ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ ద్వాదశి రా. 8.31 వరకు, అనంతరం త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా.2.24 వరకు, అనంతరం ఉత్తరాషాఢ; అమృతకాలం: రా. 9.15 నుండి 11.00 వరకు; వర్జ్యం: ఉ. 10.41 నుండి 1.17 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:302 • సోమవారం 12 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

₹82 వేల కోట్ల బడాబాబుల రుణాల రద్దు..!



- రూ.20 వేల కోట్లకు పైగా స్టేట్ బ్యాంకువే
- మొండి బకాయిలుగా ముద్ర
- పీఎన్‌బీ, బీవోఐ, కెనరా, బరోడా బ్యాంకులదీ అదేదారి
- నిరర్థక ఆస్తుల పెరుగుదలపై ఆర్బీఐ ఆందోళన
- మండిపడుతున్న జనసామాన్యం

రుణ ఎగవేతదారులపై బ్యాంకులు కరుణచూపుతున్నాయ్. మొండిబకాయిల పేరుతో ఆ రుణాలను రద్దు చేస్తున్నాయి. తాజాగా దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ భారతీయ స్టేట్ బ్యాంక్ రూ.20,339 కోట్లు మొండిబకాయిలుగా నిర్ధారిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మొత్తం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండిబకాయిల విలువ రూ.81,683 కోట్లకు చేరింది. ఈ రుణాలన్నీ రద్దు అయినట్లుగా భావించాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ పేర్కొన్న రూ.20,339 కోట్లు మొండిబకాయిలు ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకుల విలీనం జరగక ముందువి కావడం గమనార్హం. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మొండిబకాయిలు పెరిగిపోతున్నాయ్. ఐదేళ్లలో మూడు రెట్లు అధికమయ్యాయి. ఆర్బీఐ అంచనాల ప్రకారం ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ 15శాతం పెరగడం ఆందోళనకర విషయం. బడాబాబుల రుణాలు చెల్లించడంలేదని నెపంతో బ్యాంకులు మొండిబకాయిల కింద చూపించి రద్దు చేయడంపై సామాన్య ప్రజానీకంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అదే సామాన్యులు రుణాలు తీసుకుంటే... వడ్డీతో సహా బ్యాంకులు ముక్కుపిండి వసూలు చేస్తాయంటూ మండిపడుతున్నారు. మరో వైపు ప్రభుత్వరంగ బ్యాంకులకు రెండేళ్లలో రూ.2.11 లక్షల కోట్ల మూలధన సమీకరణకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడం పట్ల కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు 6లో...



అబుదాబిలో ప్రవాస భారతీయులకు ప్రధాని నరేంద్ర మోడీ అభివాదం

సాంకేతికత వృద్ధి కోసమే! ...నాశనానికి కాదు!!

- టెక్నాలజీ వాడకంతో సైబర్ నేరాలు
- క్షిపణులకు నిధుల కేటాయింపు బాధాకరం
- భారత్‌తో గల్ఫ్ బంధం బలీయమైనది
- దేశాభివృద్ధిలో ఎన్నారైల భాగస్వామ్యం
- పెద్దనోట్ల రద్దుతో నల్లధనం వెలుగులోకి
- పేదరికం, నిరుద్యోగమే అతిపెద్ద సమస్య
- వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో మోడీ
- యూఏఈతో భారత్ ఐదు ఒప్పందాలు
- అబుదాబిలో స్వామి నారాయణ ఆలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన

సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకోవడంపై భారత్ ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. మంచి కోసం కాకుండా చెడు కోసం టెక్నాలజీని వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుబాయ్‌లోని వ్యాపారవేత్తలను కలిసి భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించారు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయని అన్నారు. పౌష్టికాహార లోపం కూడా ప్రధాన సమస్యగా మారిందని, దీన్ని ప్రతి ఒక్కరూ అధిగమించాలని పిలుపునిచ్చారు. ఒపెరా హౌస్‌లో ప్రవాస భారతీయులనుద్దేశించి మాట్లాడుతూ.. భారత్‌ను ఆర్థికాభివృద్ధిలో సహాయ సహకారాలందించాలని కోరారు.

వివరాలు 3లో...



అమ్మ భాషకు ఆర్డినెన్స్?

- ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి
- సిలబస్, పాఠ్యాంశాల రూపకల్పన బాధ్యత తెలుగు విశ్వవిద్యాలయానికి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు భాషను తప్పనిసరి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం (2018-2019) నుంచి ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. తెలుగును తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఆర్డినెన్స్‌సిద్ధం చేసే పనిలో న్యాయశాఖ నిమగ్నమై ఉంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో, కళాశాలల్లో, అంతర్జాతీయ విద్యాసంస్థల్లో కూడా ఇంటర్మీడియట్ వరకు తెలుగును కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. రానురాను విద్యార్థులు మాతృభాష అయిన తెలుగును మరిచిపోతున్నారని.. ఈ భాషకున్న ప్రాధాన్యత తగ్గుతూ వస్తోందని ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో సీఎం కేసీఆర్ ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకూ తెలుగు తప్పనిసరి చేస్తూ అధికారిక ప్రకటన చేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సైతం సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించడంతో పాటు

7వ పేజీలో...

పాస్‌పోర్ట్ తరహాలో పట్టాదారు పాస్‌పుస్తకం

- 18 భద్రతా ప్రమాణాలతో 70 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ
- పాస్‌బుక్‌పై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్, పట్టాదారు చేతి వేలిముద్ర, ఫొటో



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని రైతులకు అందించనున్న నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల ముద్రణ ప్రారంభమైంది. మార్చి 11వ తేది రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజా ప్రతినిధుల ద్వారా ఈ పాస్‌పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. పట్టాదారు పాస్‌పుస్తకాల

7వ పేజీలో...

- విషాదం...



కుప్పకూలిన విమానం

71 మంది దుర్మరణం

రష్యా రాజధాని మాస్కోలో ఘటన

మాస్కో: రష్యాకు చెందిన ఒక విమానం ఆదివారం స్థానిక డొమొడెడోవో విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే నేలకూలింది. ఈ దుర్ఘటనలో 71 మంది దుర్మరణం చెందారని అధికారులు, స్థానిక మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. సరటోవ్ ఎయిర్ లైన్స్ నడుపుతున్న ఆంటొనొవ్ ఎఎన్148 విమానం ఉరల్స్‌లోని ఒర్స్క్ నగరానికి ప్రయాణిస్తుండగా రమెన్‌స్కి జిల్లాలో మాస్కో శివార్లలో

9వ పేజీలో...

- బడ్జెట్ పద్దు...

సాగునీటికి 30వేల కోట్లు



- రుణాల రూపంలో మరో 20వేల కోట్లు
- నీటిపారుదల శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రథమ ప్రాధాన్యత
- పాలమూరు, సీతారామాలకు భారీ నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో సాగునీటిరంగానికే అగ్రాసనం లభించనుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ నుండి భారీ ప్రతిపాదనలు సమర్పించగా.. ఇప్పటికే సమీక్షచేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు భారీ కేటాయింపులకు సుముఖంగా ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. గత బడ్జెట్‌లలో వరుసగా రికార్డుస్థాయిలో రూ.25వేల కోట్లకు పైగా నీటిపారుదల రంగానికి కేటాయించి దేశంలోనే అత్యధిక కేటాయింపులు చేసిన రాష్ట్రంగా చరిత్ర సృష్టించగా, ఈ సారి ఆ కేటాయింపులు రెట్టింపయ్యే వాతావరణం కనబడుతోంది. తెలంగాణ ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం కీలక దశకు చేరిన తరుణంలో ఈ ఏడాది బడ్జెట్‌తో పాటు రుణాల రూపంలోనూ పెద్ద ఎత్తున నిధులను సాగునీటిరంగానికి వెచ్చించనున్నారు. బడ్జెట్‌లో రూ.30వేల కోట్లు, రుణాల రూపంలో మరో రూ.20 వేల కోట్లు సమీకరించి కేటాయించాలని సిఎం సమక్షంలో జరిగిన నీటిపారుదల శాఖ బడ్జెట్ సమీక్షలో వ్యూహం రూపొందించినట్లు తెలిసింది. రూ.80,500కోట్ల వ్యయంతో చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఏడాది నీటిని విడుదల చేయాలన్న బలమైన సంకల్పాన్ని ప్రభుత్వం తీసుకోగా, ఏజెన్సీలకు భారీగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఊహించిన వేగంతో పనులు పరుగు పెడుతుండగా, బిల్లులచెల్లింపులో కూడా ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోంది. ఇక రూ.46వేల కోట్ల వ్యయంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డికి సంబంధించి పలు ప్యాకేజీల పనుల్లో మంచి పురోగతి ఉండగా, రూ.10వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీతారామా ప్రాజెక్టు

9వ పేజీలో...

ఔరా..!



ఆ ఫ్లైట్‌లో దక్షిణాఫ్రికా నుండి మావాడొస్తున్నాడు....

రోశయ్యకు జీవిత సాఫల్య పురస్కారం

పార్టీ మారితే పదవులు వీడాలి

- సిద్ధాంతాలతో కూడిన రాజకీయాలు అవసరం
- నేటితరానికి కొణిజేటి రోశయ్య ఆదర్శం కావాలి
- చట్టసభల పనితీరు మారాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పనిచేయాలి
- ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు

9



కొణిజేటి రోశయ్యకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి

లెక్కలు చెప్పండి

నిధులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు విరుద్ధం

- నాలుగేళ్ల చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారు
- 15లోగా వివరాలు ఇవ్వండి
- ఎవరు అబద్ధం ఆడుతున్నారో తేలాల్సిందే
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

3లో



జనసేన కార్యాలయంలో ఉండవల్లి అరుణ్ కుమార్‌తో పవన్

రాజధానికి ధీటుగా ఖమ్మం జిల్లా అభివృద్ధి

• పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం • ట్యాంక్‌బండ్ ప్రారంభోత్సవ సభలో మంత్రి హరీశ్‌రావు

ఖమ్మం , ప్రభ న్యూస్ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర రాజధానికి ధీటుగా ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, డైనమిక్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వల్లే జిల్లా సస్యశ్యామలం కానుందని, తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్, భారీ నీటి పారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ఆదివారం లకారం ట్యాంక్ బండ్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పాలనలో రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో ప్రాజెక్టులకు శంకు స్థాపనలు చేశారని, పదేళ్లలో ప్రాజెక్టులకు ఒక్క అనుమతి కూడా పొందలేక పోయారని ఆయన ఎద్దేవా చేశారు. 175 ఎకరాలున్న లకారం చెరువు శిఖం భూమి కాంగ్రెస్ పాలనలో ఆక్రమణలకు గురైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ మిషన్ కాకతీయ కింద రూ. 17.50 కోట్ల నిధులను మంజూరు చేయించుకొని అతి సుందరంగా తీర్చిదిద్దారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం శాసనసభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్‌లపై ప్రశంసల వర్షం కురిపించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారం సాధించి తెలంగాణలో అభివృద్ధికి పునాదులు వేశారని చెప్పారు. ఆంధ్రా పాలకుల పుణ్యమా అని అన్యాయానికి గురైన తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న శైలిలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారన్నారు.



సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు రాయితీలు కల్పించి ఆదుకున్నా మన్నారు. నాలుగేళ్ల క్రితం పూర్వ జిల్లాలో ఒకే ఒక్క సీటులో తెరాస విజయం సాధించినప్పటికీ 5 సెప్టెంబర్ 2015లో ముఖ్యమంత్రి కోరికపై తుమ్మల నాగేశ్వరరావు తెరాసలో చేరడంతో జిల్లాలో పార్టీ బలోపేతమైందన్నారు. హైదరాబాద్ కు ధీటుగా ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించేందుకు రంగం సిద్ధమైందన్నారు. రెండేళ్ల క్రితం తాను ఖమ్మం నగరాన్ని చూశానని ఇప్పుడు చూస్తున్న ఖమ్మం నగరం ముఖ్యమంత్రి మంజూరు చేసిన నిధులతో సుందరంగా తయారైందని తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా, నగరం మోడల్‌గా అభివృద్ధి చెందాయని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టుకు ఫస్ట్ ఫేజ్ అనుమతులు లభించాయని ఫిబ్రవరి నెలాఖరు లోపు అటవీ అనుమతులు కూడా లభించనున్నాయని చెప్పారు. మరో ఆరు నెల్లలో ఫస్ట్ ఫేజ్ పనులు పూర్తి కానున్నాయని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు గోదావరి మిగులు జలాల ద్వారా సస్యశ్యామలం అవుతుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకం ద్వారా రూ.17.50 కోట్లు మంత్రి హరీష్‌రావు మంజూరు చేయడం వల్లే లకారం ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేశామని చెప్పారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, భారీ నీటి పారుదల శాఖా మంత్రి హరీష్‌రావు అండతోనే పనులు జరుగుతున్నాయన్నారు.

తను పిలిచిన ప్రతిసారి జిల్లాకు రావడంతో పాటు సాగర్ కాల్వలపై పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నిధుల మంజూరీని వేగవంతంగా చేశారని, జిల్లా ప్రజల తరపున ముఖ్యమంత్రికి, నీటి పారుదల శాఖా మంత్రి హరీష్‌రావుకు ధన్యవాదాలు చెప్పారు. ఖమ్మం శాసనసభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్ బహిరంగ సభకు అధ్యక్షత వహించి స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు దృష్టికి నియోజకవర్గ ప్రధాన సమస్య అయినప బుగ్గపాడు చెక్ డ్యాం కాల్వలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి హరీష్‌రావు కాల్వలు తవ్వేందుకు రూ.37 కోట్ల నిధులు అవసరమని వారం రోజుల్లో మంజూరు చేస్తానని చెప్పారు. ఈ సభలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ లోకేష్‌కుమార్, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు ఎస్‌బీ బేగ్, కొండబాల కోటేశ్వరరావు, పిడమర్తి రవి తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం సంకల్పం నెరవేరాలి

శ్రీవారి సేవలో మంత్రి హరీశ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తిరుమల శ్రీవారిని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి దీవెనలతో కోటిఎకరాల మాగాణి కాళేశ్వరం ప్రాజెక్టు సంకల్పం నెరవేరాలన్నారు. తెలుగు రాష్ట్రాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. సీఎం కెసిఆర్ తిరుమలతో సమానంగా యాదాద్రిని అభివృద్ధి చేస్తున్నారని హరీష్‌రావు తెలిపారు. ఉభయ రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శనివారం సాయంత్రం తిరుమల చేరుకున్న మంత్రికి టిటిడి రిసెప్షన్ డిప్యూటీ ఈవో బాలాజీ స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు.

సీఎంగా కేసీఆర్.. ప్రజల అదృష్టం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని పోరాడిన వ్యక్తి స్వర్గీయ రాంరెడ్డి అని రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొర్లగూడెంలో రంగారెడ్డి విగ్రహా విష్కరణ సందర్భంగా జరిగిన సభలో మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ కెసిఆర్ సిఎం కావడం ప్రజల అదృష్టమని, హరీష్‌రావు నీటిపారుదల శాఖా మంత్రి కావడం రైతుల అదృష్టమని అన్నారు. ప్రతి ప్రాజెక్టు పనులను హరీష్‌రావు అహర్నిశలు పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. మేడిగడ్డ పనుల వేగం వెనుక మంత్రి హరీష్ కృషి ఎంతో ఉందన్నారు. కృష్ణానది పరివాహకంపై రంగారెడ్డికి అపార అనుభవం ఉందన్నారు. రెండు సంవత్సరాలలో గోదావరి నీటితో ఖమ్మం జిల్లా ప్రజల కాళ్ళు కడుగుతామని తుమ్మల అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంకు అనుమతులు రావడం వెనుక మంత్రి హరీష్‌రావు కృషి అద్భుతమని రోడ్లు, భవనాల శాఖా మంత్రి అన్నారు.

సీతారామాతో ఖమ్మం సస్యశ్యామలం

రెండేళ్ళలో సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హరీష్‌రావు అన్నారు. కల్లూరు మండలంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి తుమ్మల, ఎంపీ పొంగులేటి సహకారంతో ఖమ్మం జిల్లా ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తామన్నారు. యాచవరపురంగారెడ్డి పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్‌కు గౌరవం, నమ్మకం ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో రంగారెడ్డి ప్రముఖుడన్నారు. రాష్ట్ర ఏర్పాటుతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని నమ్మిన వ్యక్తి రంగారెడ్డి అని హరీష్ చెప్పారు. కృష్ణానీటిలో తెలంగాణ వాటా కోసం ఆయన పోరాడారన్నారు.



కాళేశ్వరంతో మారనున్న తెలంగాణ భవిష్యత్ చిత్రపటం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టునిర్మాణంలో అడుగడుగునా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కనిపిస్తున్నదని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. వివిధ యూనివర్శిటీలకు చెందిన విద్యావేత్తలు, నిపుణుల బృందం శని, ఆదివారాల్లో కాళేశ్వరం పనులను అధ్యయనం చేసింది. ఉద్యమకాలంలో తెలంగాణ పౌరసమాజం ఒక్కతాటిపై నిలబడి ఏకైక నినాదంతో పనిచేసిందని చక్రపాణి గుర్తుచేశారు. రాత్రీ, పగలు తేడాలేకుండా తెలంగాణ రాష్ట్రసాధన కోసం పనిచేశారని ఆయన చెప్పారు. అదే నినాదం తెలంగాణ పునర్నిర్మాణంలో బాగంగా నిర్మిస్తున్న కాళేశ్వరంలోనూ వినిపిస్తున్నదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజం అవుతోందన్నారు. తెలంగాణ జలకలవరింత సాకారం దిశగా బలంగా అడుగులు పడ్డాయని చక్రపాణి అన్నారు. కొత్తగా ఇంజనీర్లుగా ఉద్యోగంలో చేరిన వారు, టిఎస్‌పిఎస్‌సి ద్వారా రిక్రూట్ అయిన ఇంజనీర్లు ఈ మహత్తర యజ్ఞంలో పాలుపంచుకుంటున్నారన్నారు. సాధారణంగా ఇంజనీర్లు పుస్తకాలలో ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి చదువుకుని, తర్వాత వాటి నిర్వహణలో పాలు పంచుకుంటారన్నారు. ఇపుడు ఇంత భారీ ప్రాజెక్టులో పాల్గొనడం ఇంజనీర్లకు వరమన్నారు. ప్రపంచానికి కాళేశ్వరం ఒక మోడల్ ప్రాజెక్టు కానుందన్నారు.

హామీలు అమలు చేయండి

వ్యవసాయ మంత్రి పోచారానికి సండ్ర వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతుల రుణమాఫీ, వడ్డీ మాఫీ కానీ రైతుల పరిస్థితి...సరిహద్దు రైతుల సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంటనే ప్రయత్నించాలని సత్తుపల్లి శాసన సభ్యుడు సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం నాడు ఆయన మంత్రికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించేందు కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సిఎం కేసీఆర్ చెప్పారన్నారు. రుణమాఫీ కానీ రైతులు, వడ్డీ మాఫీకి నోచుకోని రైతులపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఫలితంగా రైతుల సమస్యలు రోజురోజుకు వర్ణనాతీతంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యం లో మంత్రి పోచారం వెంటనే సంబంధిత అధికారులతో సమా వేశాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకునేందుకు కృషి చేయాలని సండ్ర విజ్ఞప్తి చేశారు.

జగిత్యాలపై కవిత గురి

• అసెంబ్లీ నియోజక వర్గంలో పోటీకి ఆసక్తి? • వరుసగా భారీ కార్యక్రమాలు

• గతంలో కేటీఆర్‌తో భారీ సభ.. ఈ నెలలో జగిత్యాలకు మంత్రి హరీశ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత వచ్చే ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ నియోజక వర్గం నుండి బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భాగంగా ఉన్న జగిత్యాలను తెలంగాణ ప్రభుత్వం జిల్లాకేంద్రంగా ప్రకటించి.. పలు నియోజకవర్గాలతో జిల్లాగా ఏర్పాటు చయగా ఈ ప్రాంత అభివృద్ధిపై కవిత ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రస్తుతం జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిసున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఈ నియోజకవర్గం మినహా మిగతా అన్నిచోట్లా టిఆర్‌ఎస్ శాసనసభ్యులే ఉండగా, జగిత్యాల సిట్టింగ్ స్థానం కాకపోవడంతో ఎవరికీ సమస్యలేదని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. నిజామాబాద్ ఎంపీగా పనిచేస్తున్న కవిత జాతీయ స్థాయిలో తెలంగాణ గళాన్ని సమర్థవంతంగా వినిపించడంతో నిజామా బాద్‌కు సంబంధించి అనేక పెండింగ్ సమస్యలు పరిష్క రించారు.

కొత్తరైళ్ళు, లైన్లు సాధించ డంతో పాటు పసుపుపార్క్ దిశగా కదలిక తీసుకొచ్చారు. రాష్ట్రసమస్యలపై తనదైన శైలిలో వాణిని వినిపించి దేశం దృష్టిని ఆకర్షించారు. పార్లమెంట్ సభ్యురాలిగా తనదైన పాత్ర పోషించిన కవిత వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీబరిలో నిలవాలని భావిస్తున్నట్లు



పార్టీలో చర్చ జరుగుతోంది. మంత్రి కెటిఆర్‌తో జగిత్యాలలో గతంలో భారీసభ నిర్వహించి.. అన్నను ఆశీర్వదించండి అంటూ సంచలన ప్రకటన చేశారు. ఆ సందర్భంగా కెటిఆర్ జగిత్యాల నుండే టిఆర్‌ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని ప్రకటించారు. ఈ భారీ సభ, నేతల ప్రకటనలతోనే ఎంపీ కవిత జగిత్యాల బరిలో నిలవడం ఖాయమన్న చర్చ విస్తృతంగా జరిగింది. ఆ తర్వాత జగిత్యాల మునిసిపాలిటీ అభివృద్ధికి మంత్రి కెటిఆర్ భారీగా నిధులు విడుదల చేశారు. తాజాగా ఎంపీ కవిత జగి త్యాల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మంత్రి హరీష్‌రావుతో భేటీ కాగా, ప్రత్యేకంగా సమీక్ష కూడా చేశారు. ఈనెలలోనే హరీష్‌రావును జగిత్యాలకు ఆహ్వానిం చగా.. మరో భారీసభ జరగబోతోంది. జగిత్యాలపై ప్రత్యేకంగా గురిపెట్టి దూకుడుగా దూసుకువెళ్తున్న కవిత.. బరిలో నిలిస్తే కాంగ్రెస్ కంచుకోట బద్దలు కావడం ఖాయ మని పార్టీవర్గాల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు ఏజెన్సీల ద్వారా సర్వేలు జర్గగా.. కవిత బరిలో నిలిస్తే వార్ వన్‌సైడేనని ఫలితాలు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. జగిత్యాల ప్రగతిపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన కవిత.. ప్రగతి మంత్రంతో దూసుకెళుతూ ప్రజలను ఆకర్షిస్తోంది.

అయితే ప్రస్తుతం ఎంపీగా ఉన్న కవితను అసెంబ్లీ బరిలో నిలుపు తారా.. లేదా అన్న అంశంపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జగిత్యాల క్యాడర్, నేతలు మాత్రం కవిత తమ నియోజకవర్గం నుండి పోటీచేస్తుందన్న విశ్వాసంతో.. ఉత్సాహంతో ఉన్నారు. అధినేత గ్రీన్‌సిగ్నల్‌తోనే.. కవిత జగిత్యాలలో దూకుడుగా ముందుకెళ్తున్నారన్న చర్చ కూడా పార్టీలో ఉంది. రాష్ట్రరాజకీయాల్లోకి కవిత వస్తే క్యాడర్‌లో మరింత జోష్ వస్తుందని, మహిళలు పార్టీ కార్యక్రమాల్లో మరింత క్రియాశీలం అవుతారని విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థిత్వాల్లో అనేక మార్పులు ఉండే అవకాశం కనబడుతోంది.



గిట్టుబాటుకు ఆందోళన

ఆర్మూర్ రూరల్, ప్రభ న్యూస్ : జక్రాన్‌పల్లి మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. నిజామాబాద్ జిల్లా, జక్రాన్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పసుపు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో 15 గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నాయకులు మాట్లా డుతూ ఎర్రజొన్నాకు రూ.4వేలు, పసుపునకు రూ.10వేలు మద్దతు ధరను చెల్లించి ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ రైతుకు ఆరోగ్య శ్రీ కార్డు అందజేయాలని, పసుపునకు ప్రత్యేబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నిజామాబాద్ డీసీపీ సుదర్శన్ ఆందోళన ప్రాంతానికి చేరుకుని రైతులను సముదాయించారు. కలెక్టర్ స్వయంగా వస్తే గానీ తాము ఆందోళన విరమించబోమని రైతులు కచ్చితంగా చెప్పారు. ఆర్మూర్, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్ నుంచి బలగాలను రప్పించి ఎట్టకేలకు రైతుల ఆందోళన విరమింపజేశారు.


ముగిసిన 15వ ఆర్థిక సంఘం పర్యటన

• నిధుల సిఫార్సుపై రాష్ట్రం ఆశలు • కాళేశ్వరానికి కితాబుపై అధికారుల ఖుషీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర పర్యటనకు వచ్చిన 15 వ ఆర్థిక సంఘం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రశంసలు కురిపించడంతో ప్రభుత్వంలో కొత్త ఉత్సాహం నెలకొంది.అధికారులైతే ఖుషీగా ఉన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా బృందం శుక్ర, శని వారా టల్లో తమ పర్యటన ముగించుకుని ఢిల్లీ చేరుకుంది. మూడు రోజుల పాటు వారి షెడ్యూల్ ఖరారైనప్పటికీ రెండు రోజులకే బృందం తమ పర్యటనను ముగించుకుంది. తొలి రోజైన శుక్రవారం ఎంసిఆర్‌హెచ్ ఆర్‌డిలో దక్షిణాది రాష్ట్రా లైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళతో పాటు మహారాష్ట్రకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక శాఖాధికారులతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఆర్థిక సంఘం ఫార్మాట్ ప్రకారం రాష్ట్రా వనరాలు, ఇతర అంశాలపై ఏప్రిల్ 15 వరకు రాష్ట్ర ప్రభుత్వాలు నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. ఫార్మాట్‌పై కొన్ని రాష్ట్రా లు అభ్యంతరాలు చెప్పినప్పటికీ జాతీయ విధానాన్ని పాటించాల్సిందేనని హుకుం జారీ చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషీ (ఎస్‌కె జోషీ) , ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు పాల్గొని ప్రభుత్వం తరపున ఆర్థిక సమస్యలు, నిధులు ఇతర అంశాలను వివరించారు. దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు సాగుతున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఉదారంగా నిధులు విడుదలకు సిఫార్సు చేయాలని 15 వ ఆర్థిక సంఘానికినివేదించారు. పోరాటాలతో సాధించుకున్న కొత్త రాష్ట్రం అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం సాయంత్రం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రతినిధి బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక విందు ఇచ్చారు. సందర్భంగా కోరికల చిట్టాను ఆర్థిక సంఘం ముందుంచారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో పాటు రాష్ట్ర రాబడులు, వ్యయాలు, ఆర్థిక స్థిరత్వం, నిధుల వినియోగం, కేంద్ర పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను గూర్చి కూడా సీఎస్ ఆర్థిక సంఘానికి వివరించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షికబడ్జెట్‌లో రాష్ట్రా నికి నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉందని, రూ. 40 వేల కోట్ల ప్రతిపాదనలను కేంద్రానికి పంపగా కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని కూడా వివరించారు. రా ష్ట్రంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించే మిషన్ భగీరథకు రూ. 19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 5000 కోట్లు ఇవ్వాలని అభ్యర్థిం చామని, ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు.రాష్ట్ర అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌కు ఆర్థికసంఘం కార్యదర్శి మెహతాతో పాటు ఇతర సభ్యులు కూడా ముగ్ధులయ్యారు. కాళేశ్వరం పథకం ద్వారా 18 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వదల్చామని, ఇది దేశంలోనే అద్భుతమైన ప్రాజెక్టుగా అధికారులు వివరించారు.

ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదాతో పాటు బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటా యిం చాలన్న తమ అభ్యర్థనను కేంద్రం మన్నిం చలేకపోయిందని వివరించారు. వాటితో పాటు ఈజ్ ఆఫ్‌డూయింగ్ బిజినెస్‌లో సాధించిన ప్రగతి, జీఎస్టీ అమలు, దీని పరిధిలోకి అర్హులైన వ్యాపారులను తీసుకురావడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి, జనాభా నియంత్రణకు చేపడుతున్న చర్యలు, నగదు బదలీని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు, కేంద్ర పథకాల అమలు, స్వచ్ఛభారత్ అమలు ఇస్తున్న ప్రాధాన్యత,మౌళిక సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను గూర్చి కూడా అంతేగాక పలు సూచనలు కూడా చేశారు. కమిషన్ ఫార్మాట్‌పై తెలంగాణ రాష్ట్ర అభ్యంతరాలను కూడా వారు వివరించారు. రెండో రోజైన శనివారం అరవింత్ మెహతా బృందం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత ప్రశంసలు కురిపించడంతో నిధుల సిఫారసుకు సంఘం సానుకూలంగా ఉందని పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లయింది.

'టీఎఫ్‌సీ' దేశానికే ఆదర్శం



హైదరాబాద్, ఆంధ్రప్రభ :తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ దేశానికే ఆదర్శంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయ తీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అధ్యక్షతన తెలంగాణ ఫైనాన్స్ కమీషన్ ఆవిర్భావ పరిచయ సదస్సు ఆదివారం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన మంత్రి జూపల్లి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేయాలన్న తపనతో సీఎం కేసీఆర్ ఎన్నో వినూత్న, సాహసో పేతమైన నిర్ణయాలు తీసుకుంటు న్నారన్నారు. ఆ కోవలోనే రాజేశంగౌడ్‌ను తొలి తెలంగాణ రాష్ట్రఫైనాన్స్ కమీషన్‌కు చైర్మన్‌గా నియ మించారన్నారు. గత ప్రభుత్వాల్లో మంత్రిగా, జిల్లా పరిషత్ అధ్యక్షుడిగానే కాకుండా న్యాయవాదిగా పనిచేసిన రాజేశంగౌడ్ వ్యవస్థల పట్ల మంచి అవగాహన ఉన్న వ్యక్తి అని పేర్కొ న్నారు. స్థానిక సంస్థలకు నేరుగా నిధులు ఇచ్చేందుకు సీఎం ఆలో చిస్తున్నారని , తెలగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా ఫైనాన్స్ కమీషన్ పనిచేస్తుందన్న ఆశాభావాన్ని మంత్రి జూపల్లి వ్యక్తం చేశారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లా డుతూ ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ పదవి అంత ఆశా మాషి కాదన్నారు. అంతకు మందు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సభను ప్రారంభిస్తూ రాష్ట్రంలో బీసీ కులాలను ఏ కతాటిపైకి తెచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశం గౌడ్ మాట్లాడుతూ ఫైనాన్స్ కమీషన్ చైర్మన్‌గా బాద్యతలు అప్పగించి ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమీషన్ చైర్మన్ రాములు ,ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు కొప్పుల ఈశ్వర్ , గంగాధర్ గౌడ్ , డెయిరీ చైర్మన్ భూమారెడ్డితోపాటు వి.కృష్ణమోహన్ , బాపురెడ్డి, ఏ.శ్రీకాంత్ తదితరులు హాజరై రాజేశం గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.

సంస్కరణల దిశగా జైళ్లశాఖ

• స్వయం సమృద్ధి శాఖగా గుర్తింపునకు చర్యలు • ఈ ఏడాది చివరికల్లా 100 పెట్రోల్ బంక్‌లు

• 1000 విలేజ్ అవుట్ లెట్ల ఏర్పాటుకు నిర్ణయం • జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జైళ్ళ శాఖను స్వయం ప్రకటిత శాఖగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్న ఆ శాఖ డిజి వికె సింగ్ ఆదాయ వనరుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సంస్థకు ఆదాయంతో పాటు ఖైదీలలో పరివర్తన, ఉపాధి అవకకాశాలను కల్పించడం కోసం విస్తృత ప్రయత్నాలను ప్రారంభించారు.

క్షణికావేశంలో తప్పు చేసి జైలు శిక్ష అనుభవించి భయటకు వెళ్ళే ఖైదీ మరోసారి ఆ తప్పును చేయకుండా ఉండటం, ఉపాధి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర జైళ్ళ శాఖ ప్రస్తుతం 13 పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తోంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ల ద్వారా 2016 - 17 ఆర్థిక సంవత్సరంలోరూ. 10 కోట్ల లాభం సమకూరింది. ఈ ఏడాది చివరినాటికల్లా వీటి సంఖ్య 100కు చేర్చేందుకు ఏర్పాట్లను చేస్తోంది. వీటన్నింటినీ జైళ్ళ శాఖలో పని చేసి పదవీ విరమణ పొందిన వారితో పాటు మాజీ ఖైదీలతోనే నిర్వహించనుంది. ప్రస్తుతమున్న పెట్రోల్ బంక్‌లలో 150 మంది మాజీ ఖైదీలు, మరో 200 మంది జీవిత ఖైదీలు ఉపాధి పొందుతున్నారు. స్థలాలను గుర్తించి బంక్‌లను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను జైళ్ల శాఖకు అప్పగించేం



దుకు నిర్ణయం కూడా తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 13 పెట్రోల్ బంక్‌లకు తోడుగా రానున్న రెండు మాసాలలో మరో 7 బంక్‌లను జైళ్ళ శాఖ అధికారులు ప్రారంభించనున్నారు. గతేడాది జూన్ మాసంలో చంచల్ గూడ జైలు ప్రాంగణంలో పూర్తిగా మహిళలతోనే నడిచే పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. మరిన్ని మహిళా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు భద్రతను దృష్టిలో పెట్టుకుని స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న 80 పెట్రోల్ బంక్‌లలో దాదాపు 30 శాతం బంకులను మహిళల నిర్వహణలోనే ఉండాలన్న లక్ష్యంతో ఉన్నారు. ప్రస్తుతం పెట్రోల్ బంక్‌ల ద్వారా వస్తున్న రూ. 10 కోట్ల ఆదాయాన్ని 2017 -18 ఆర్థిక సంవత్సరంలో రూ. 15 కోట్లకు చేరనుందని అధికారులు పేర్కొన్నారు.

జైళ్ళ శాఖకు సమకూరుతున్న ఆదాయంలో పెట్రోల్ బంక్‌ల ద్వారా వచ్చే ఆదాయం పెద్దదని అధికారులు వివరించారు. అయిదేళ్ళ క్రితం చంచల్‌గూడ కేంద్ర కారాగారం సమీపంలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన జైళ్ళ శాఖ ఆ తర్వాత చర్లపల్లి, వరంగల్ కేంద్రకారాగారంతో పాటు చంచల్‌గూడ జైలు వద్ద మహిళా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంక్‌లలో పని చేసే మాజీ ఖైదీలకు నెలకు రూ. 12 వేల వేతనం చెల్లిస్తుండగా, జీవిత ఖైదీలకు రూ. 3 వేల వేతనం చెల్లిస్తున్నారు. పెట్రోల్ బంక్‌లు, విలేజ్ అవుట్‌లెట్‌ల ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యం సంస్థకు ఆదాయం సమకూర్చు కోవడంతో పాటు జైలు నుంచి విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యమని జైళ్ల శాఖ డిజి వికె సింగ్ తెలిపారు. ఒంటరి మహిళ కానీ, విడుదలైన ఖైదీ తిరిగి నేరం చేయకుండా ఉండాలన్న లక్ష్యంతోనే ఈ చర్యలని ఆయన వివరించారు.

కాళేశ్వరంపై అవినీతి ఆరోపణలు

• ప్రాజెక్టులపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలి

• కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక అవినీతి ఆరోపణలు వినవస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే తప్ప కేంద్రమందిస్తున్న సహాయ సహకారాల గురించి ఏనాడైనా ప్రజలకు చెప్పారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంకు అన్ని రకాల అనుమతులు కేంద్రం ఇచ్చి నందువల్లే ఇక్కడ పనులు మొదలయ్యాయని అన్నారు. రాజకీయ ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం నిర్ణయాలను తీసుకుని ఉంటే రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం ఏ ఒక్క భారీ ప్రాజెక్టునైనా చేపట్టగలిగేదా? అని నిలదీశారు.ఆదివారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమా వేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రా న్ని ఆదుకునేందుకు కేం ద్రం అన్ని రకాల సహకారాన్ని అందిస్తోందన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలోని అధికార పార్టీ నేతలు రాజకీయ దురుద్దేశ్యంతో కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం కేంద్రం ఇచ్చిని నిధులను కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ఖర్చు చేయలేని దీన స్థితిలో ఉందన్నారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వం చాలా వెనుకబడి ఉందని ఆయన తన అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చుపై స్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా? దత్తన్న ప్రశ్నించారు. కేంద్రం బడ్జెట్ బాగుందని ఢిల్లీలో ఉన్నప్పుడు కితాబిస్తున్న తెరాసఎంపీలు రాష్ట్రా నికి రాగానే విమర్శలు చేస్తున్నారన్నారు. జాతీయ హైవే కింద ఎకనామిక్ కారిడార్ కోసం కేంద్రం రాష్ట్రా నికి మూడువేల కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు,

సాంకేతికత వృద్ధి కోసమే!

..నాశనానికి కాదు!!



- టెక్నాలజీ వాడకంతో సైబర్ నేరాలు
- క్షిపణులకు నిధుల కేటాయింపు బాధాకరం
- భారత్‌తో గల్ఫ్ బంధం బలీయమైనది
- పేదరికం, నిరుద్యోగమే అతిపెద్ద సమస్య
- వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో మోడీ
- యూఏఈతో భారత్ ఐదు ఒప్పందాలు
- అబుదాబిలో స్వామి నారాయణ ఆలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన

దుబాయ్ : భారత ప్రధాని నరేంద్రమోడీ నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా దుబాయ్‌ను సందర్శించారు. శనివారం పాలస్తీనా పర్యటన ముగించుకుని రాత్రి దుబాయ్ చేరుకున్నారు. యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాన మంత్రి మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తుంను భారత ప్రధాని మోడీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య రంగాలను మరింత అభివృద్ధి విషయమై ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఇరు దేశాల ప్రజలు, రక్షణ, వాణిజ్య రంగంలో సహాయ సహకారాలు అందించే విషయమై మాట్లాడుకున్నారు. అదేవిధంగా గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాల నాయకులను మోడీ కలుసుకున్నారు. అనంతరం భారత్‌లోని వ్యాపార, వాణిజ్య విధి విధానాల గురించి వారికి వివరించారు. దుబాయ్‌లో ఇరు దేశాల ప్రధానులు కలుసుకోవడంతో మా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని దుబాయ్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీష్ కుమార్ ట్విట్టర్ వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు. దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో కిర్గిస్తాన్ ప్రధాని సపర్ ఇసాకోవ్‌ను ప్రధాని మోడీ కలిశారు. శనివారం సాయంత్రం అబుదాబి చేరుకోగా, అక్కడి అధికారులు సాదర స్వాగతం పలికారు. అబుదాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యన్‌తో మోడీ ఐదు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అఫ్‌షోర్ ఆయిల్ కంపెనీలో భారత్ కంపెనీలకు 10 శాతం రాయితీ ఇచ్చేలా చారిత్రాత్మక ఒప్పందం ప్రధానంగా నిలిచింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, అక్కడి వనరులు, చట్టాలు, వంటి అంశాల గురించి గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాల వ్యాపారవేత్తలకు మోడీ వివరించినట్టు రవీష్ తెలిపారు.

గల్ఫ్ దేశాలతో బలపడుతున్న బంధం : మోడీ

గల్ఫ్ దేశాలకు, భారత్‌కు మధ్య కేవలం కొనుగోలు, విక్రయ దారుడి సంబంధం లేదని, లోతైన, విస్తృత, శక్తివంతమైన బంధం ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇరు దేశాల మధ్య స్నేహ పూర్వక వాతావరణం రోజురోజుకూ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం దుబాయ్‌లోని ఒపెరా హౌస్‌లో భారతీయులనుద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు ఓ గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. భారతీయులు కన్న కలలను సహకారం చేసే దిశగా దేశ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని, అదే తరహాలో ముందుకు వెళ్తుందని హామీ ఇచ్చారు. ప్రపంచ బ్యాంకుతో వ్యాపారం చేసే దేశాల్లో గతంలో తమ స్థానం 142గా ఉండేదని, ఎన్‌డీఏ సర్కార్ అధికారంలోకి వచ్చాక 100వ స్థానానికి చేరుకుందని చెప్పారు. ఇంతటితో తమ ప్రభుత్వం సంతోషంగా లేదని, ఇంకా ఏదో సాధించాలి.. దేశానికి ఏదో చేయాలనే తపనలో ఉందని అన్నారు. తాము ఏం చేయ దలుచుకుంటున్నామో అది తప్పక చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కూడా ప్రవాస భారతీయులు అందరూ భాగస్వాములు కావాలని మోడీ పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దుతో దేశంలోని నల్లధనం చాలా బయటికి వచ్చిందన్నారు. దేశంలో నిరుపేదలు కూడా పెద్దనోట్ల రద్దుకు బ్రహ్మరథం పట్టారని, ప్రభుత్వం చేస్తుంది కరెక్ట్ అని చెప్పుకొచ్చారని గుర్తు చేశారు. కొందరు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ఉన్నారని, ఇండియా నుండి వచ్చిన సుమారు 30లక్షల మందికి యూఏఈ సొంత దేశంలో ఉంటున్న వాతావరణం కల్పించడం సంతోషంగా ఉందని, యూఏఈకి రుణపడి ఉంటానని చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి సాధించండి : మోడీ

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ సూచించారు. సాంకేతికతతో అభివృద్ధి సాధించాలే తప్ప ఎదుటి వారి నాశనానికి ఉపయోగించొద్దని కోరారు. కానీ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో మోడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం టెక్నాలజీని చాలా మంది ఎదుటివారికి ఇబ్బంది పెట్టేందుకు ఉపయోగిస్తున్నారని అన్నారు. కొందరు ఉగ్రవాదులు, హ్యాకర్లు ఈ కోవకు చెందిన వారుగా ఉన్నారని అన్నారు. దేశం ఎంతో అభివృద్ధి చెందుతున్నా... పేదరికం, పౌష్టికాహార లోపం అనేది ఇప్పటికీ నిర్మూ లించలేక పోయామన్నారు. క్షిపణులు, అణుబాంబులపై ప్రపంచ దేశాలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికతను విధ్వంసం కోసం కాకుండా అభివృద్ధి కోసం ఉపయోగించాలని హితవు పలికారు. టెక్నాలజీని ఉపయోగించుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడటంపై మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నియామకాలు కూడా ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్నాయంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత దుర్వినియోగం చేస్తున్నారో అర్థం అవుతోందని అన్నారు. వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌కు నేను ముఖ్య అతిథిగా రావడం నా గొప్ప కాదని, 125 కోట్ల ప్రజల గొప్పతనం అని చెప్పుకొచ్చారు. టెక్నాలజీని ఉపయోగించుకోవడంలో దుబాయ్ ప్రభుత్వం ఎంతో ముందంజలో ఉందని, దానికి ఉదాహరణే గల్ఫ్ ఎమిరేట్స్ అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 9.5 శాతం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని, జనాభా మాత్రం పెరుగుతూనే ఉందన్నారు. నిరుపేదల నిర్మూలన, నిరుద్యోగం, విద్య, గృహ, మానవ విపత్తులు ప్రపంచానికి పెద్ద సవాల్‌గా మారాయని అన్నారు. వీటిపై విజయం సాధించాలంటే అభివృద్ధితోనే సాధ్యం అని, ఆ దిశగా టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. అందుకొ 'సమే సబ్‌కే సాథ్.. సబ్‌కా వికాస్ అనే నినాదంతో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. ప్రధాన సెక్టార్లపైనే భారత్ దృష్టి సారిస్తోందని, 125 కోట్ల ప్రజలను శక్తివంతులుగా చేయడానికి ప్రయత్నిస్తోందని చెప్పుకొచ్చారు. మార్స్ ఆర్బిట్ ప్రోగ్రాం నిర్వహించడానికి కిలోమీటరుకు ఖర్చు కేవలం 7 రూపాయలు అవుతోందని, అదే ఇండియాలో క్యాబ్ తీసుకుంటే కూడా 10 రూపాయలు మాత్రమే అవుతోందని, క్యాబ్ ప్రయాణ ఖర్చు కంటే మార్స్ వ్యయం చాలా తక్కువ అని చెప్పారు. దేశ వ్యాప్తంగా సుమారు 65 శాతం మంది ప్రజలు 35ఏళ్లకు తక్కువగా ఉన్నారని, వీరంతా దేశ భవిష్యత్తును మార్చే ఆలోచనలో ఉన్నారని గుర్తు చేశారు. తాము కొత్త రకం టెక్నాలజీని రూపొందిస్తున్నామని, వ్యాపారం రంగంలో తనదైన ముద్ర వేసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోందన్నారు. 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా చూస్తున్నామని చెప్పారు.



దేశంలో నిర్మా ణ రంగం, ప్రాజెక్టులపై ప్రతీనెలా వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహిస్తామని, దానికి సంబంధించిన మంత్రులను పిలిపించు కని ప్రగతి పేరిట సమీక్షలు నిర్వహిస్తామన్నారు. సమ్మిట్‌లో యూఏఈ ప్రధాని, ఉపాధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ రశీద్ అల్ మక్తుంతో పాటు పలువురు అధికారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

అబుదాబీలో హిందు ఆలయ నిర్మాణానికి శ్రీకారం

అబుదాబీలో హిందు ఆలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా శ్రీకారం చుట్టారు. భారతదేశ చరిత్రను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికిగాను అబుదాబిలో హిందూ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు మోడీ తెలిపారు. దుబాయ్‌లోని ఒపెరా హౌస్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వామినారాయణ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడారు. అబుదాబీలో హిందూ ఆలయ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన ప్రభుత్వానికి భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు. ఇక ఎలాంటి తప్పు జరగకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందని మోడీ అన్నారు. భారదేశ చరిత్రకు ఎనలేని గౌరవం ఉందని చెప్పారు. ఆలయ నిర్మాణంతో ఎవరికీ, ఎలాంటి ఇబ్బందులు కల్గించకుండా చూసుకుంటారని తాను భావిస్తున్నానని అసోసియేషన్ ప్రజలకు చెప్పారు. భూమిని దానం చేసినందుకుగాను అబుదాబీ యువ రాజుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. 125 కోట్ల ప్రజల తరఫు నుంచి యువ రాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు మోడీ వివరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రజెంటేషన్‌ను అబుదాబీలో మోడీ, మహ్మద్‌బిన్ జయాద్ అల్ నాహ్యాన్ ముందు ఉంచారు. 55వేల చదరపు మీటర్లలో నిర్మాణం చేపడుతున్నారు. 2020 నాటికి నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మిడిల్ ఈస్ట్‌లో మొట్టమొదటి రాతి నిర్మాణ హిందూ ఆలయంగా పేరు సంపాదించుకుంటుందని బోచసన్‌వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ప్రతినిధి చెప్పారు.

మునగకాయతో మోడీ పరోటా!

దుబాయ్: ప్రధాని నరేంద్ర మోడీ భోజన ప్రియుడు కాకపోయినప్పటికీ వంటల విషయానికి వచ్చేసరికి కాయగూరలతో రకరకాల ప్రయోగాలు చేయడానికి మక్కువ చూపుతుంటారని ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ తెలిపారు. మోడీ దుబాయ్ పర్యటన సందర్భంగా కపూర్ ఆయనకు వంటచేసి పెట్టారు. ప్రధానికి ఎలాంటి అలర్జీలు లేనందున కాయగూరలతో ఆయనకు విభిన్నమైన వంటకాలు చేసిపెట్టడం సులభమని కపూర్ చెప్పారు. ప్రధానమంత్రికి దోసెలు, బీట్‌రూట్‌తో చేసిన కబాబ్ లు, పప్పు, అన్నం అంటే ఇష్టమని తెలిపారు. శాకాహారాన్ని ఆయన విశ్వసిస్తారు. ఇతర దేశాల సంస్కృతులను తెలుసు కోవడానికి ఆహారాన్ని మించిన గొప్ప మార్గం మరొకటి లేదని భావిస్తారు అని కపూర్‌ను గల్ఫ్‌న్యూస్ ఉటంకించింది. మేమి ద్దరం పరోటాల గురించి మాట్లాడుకుంటూ ఉండగా మునగ కాయ పరోటా గురించి ఆయన నాకు చెప్పారు. అది నాకు అత్యంత ఆసక్తికరమనిపించింది. నా కిచెన్‌లో మునగకాయ పరోటా చేస్తానని ఆయనతో అన్నాను అని సంజీవ్ కపూర్ వివరించారు.



ఓమన్ చేరుకున్న ప్రధాని మోడీ



మస్కట్ : ఓమన్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం సాయంత్రం ఓమన్ చేరుకున్నారు. దుబాయ్ నుండి ఓమన్ చేరుకున్న మోడీకి అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ ఉప ప్రధాని సయ్యద్ ఫాహ్ద్ బిన్ మహ్మద్ అల్‌సెడ్‌తో పాటు అంతర్జాతీయ సంబంధాల వ్యవహార డిప్యూటీ ప్రధాని సయ్యద్ అదాద్ బిన్ తారిఖ్ అల్‌సెడ్ ప్రధాని మోడీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఓమన్ తమ పొరుగున ఉన్న మిత్ర దేశం అని, ఇరు దేశాల మధ్య మంచి సంబంధాలు కొనసాగుతున్నాయని వివరించారు. పర్యటనలో భాగంగా వ్యాపారవేత్తలను కలుసుకోనున్నట్టు తెలిపారు. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యాపార సంబంధాల గురించి చర్చలు నిర్వహిస్తామని మోడీ చెప్పారు. ఓమన్-భారత్ సంబంధాలు మూలాలు కొన్ని శతాబ్దాల క్రితం నుండి ఉన్నాయని, గల్ఫ్ రీజియన్‌లో 9 మిలియన్ భారతీయులు నివాసం ఉంటున్నారని అన్నారు.

జోన్‌కు తూట్లు!

- ఒడిషాకు కిరోండోల్ గూడ్స్ ఆదాయం
- కుర్దా రోడ్‌కు డీజెల్ షెడ్ తరలింపు
- మన యువతకు ఇక ఉద్యోగాలూ దక్కవ్
- అరకు వరకే కొత్త జోన్ పరిమితం
- సరుకు రవాణా ఆదాయం హుళక్కి
- మిగిలేది సాధారణ ప్యాసింజర్ ట్రాఫిక్కే
- కేకే లైన్‌తో సహా సాధిస్తేనే ప్రయోజనం



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: దీర్ఘకాల ఆందోళనల అనంతరం విభజన హామీల్లో ఒకటైన రైల్వే జోన్ ఏర్పాటు పట్ల కేంద్రంలో కొంతమంది మంత్రులు సూచన ప్రాయంగా అంగీకారం తెలిపినప్పటికీ కార్యాచరణకు వచ్చే సరికి వీరే అనేక సరికొత్త అవాంతరాలు కల్పిస్తున్నారు. విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటు చేస్తామని గతంలో కేంద్ర నాయకులు ప్రకటించారు. తాజాగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతమున్న విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్లతో ప్రస్తుతం తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోని విశాఖ డివిజన్‌ను కలిపి నాలుగు డివిజన్లతో కొత్తగా జోన్ ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. విశాఖ డివిజన్‌ను తూర్పు కోస్తా జోన్ నుంచి విడదీయడం పట్ల ఒడిశా ఒప్పుకోవడం లేదు. దీర్ఘకాలంగా ఇదే కొత్త జోన్ ఏర్పాటుకు అవాంతర మౌతోంది. ఓ పక్క జోన్ ఏర్పాటుకు అవకాశాలు మెరుగయ్యాయని ప్రకటనలిస్తూనే మరో పక్క రైల్వే మంత్రి పియూష్ గోయల్ ఒడిషా నుంచి కేంద్ర కేబినెట్‌లో ప్రాతి నిధ్యం వహిస్తున్న ధర్మేంద్రప్రధాన్‌తో చర్చలు మొదలెట్టారు. ఓ వైపు ఒడిషా ప్రయోజనాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా ఈ జోన్ ఏర్పాటును సాకారం చేసే ఆలోచనలకు పదునెట్టారు. ఇప్పటికే దీనికి సంబంధించి కొన్ని సూత్రప్రాయ మార్పులు చేయడం ద్వారా ఒడిషా నుంచి ఎలాంటి ఆగ్రహావేశాలు రాకుండా చూడాలన్నది కేంద్రం యోచనగా తెలుస్తోంది. ఈ మార్పుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేసినా ఇక్కడ అదనంగా ఒరిగేదేం ఉండదు. మరోవైపు ఒడిషాలో బీజేపీ రాజకీయ ప్రయోజనాలు నెరవేరతాయి. ప్రస్తుతం విశాఖ రైల్వే డివిజన్ పరిధిలో 1052 కిలోమీటర్ల పొడవైన రైల్వే లైన్‌లు ఉన్నాయి. దువ్వాడ నుంచి పలాస వరకు 213, విజయనగరం నుంచి రాయపూర్ మెయిన్ రైల్వేలైన్ వరకు తేరుబలి వరకు 137 కిలోమీటర్లు, కొత్తవలస నుంచి కిరోండల్ వరకు 446 కిలోమీటర్లు, కోరాపుట్ నుంచి రాయగడ వరకు 164 కిలోమీటర్లు, బొబ్బిలి నుంచి సాలూరు మధ్య 18కిలోమీటర్లు, నౌపడ, గురుపూర్‌ల మధ్య 90 కిలోమీటర్ల రైల్వేలైన్లు ఈ డివిజన్ పరిధిలోకి వస్తున్నాయి. తూర్పు కోస్తా రైల్వేకొస్తున్న మొత్తం ఆదాయంలో 63 శాతం ఒక్క విశాఖ రైల్వే డివిజన్ నుంచే సమకూరుతోంది. ఈ డివిజన్ నుంచి వస్తున్న ఆదాయంలో 23శాతం ప్రయాణికుల ద్వారా సమకూరుతుంటే మిగిలినదంతా సరుకుల రవాణా ద్వారానే లభిస్తోంది. డివిజన్ పరిధిలో సరుకుల రవాణా ద్వారా వస్తున్న ఆదాయంలో తిరిగి 69శాతం ఒక్క కిరోండల్- కొత్తవలస రైల్వేలైన్ ద్వారానే సమకూరుతోంది. మొత్తం తూర్పు కోస్తా రైల్వేజోన్‌కు 446 కిలోమీటర్ల పొడవున్న కెకె లైన్‌పై వస్తున్న ఆదాయమే అత్యంత కీలకం. విశాఖ డివిజన్‌ను కొత్త జోన్‌లో విలీనం చేస్తే ఈ ఆదాయం మొత్తం కొత్త జోన్‌కు బదలీ అవుతుంది. దీనికే ఒడిషా నుంచి అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర విభజన హామీల అమల్లో తీవ్రజాప్యం జరపడంతోపాటు నిధుల మంజూరులో వ్యత్యాసాలపై ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ఆందోళనల్ని తగ్గించేక్రమంలో అటు ఒడిషాకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జోన్ విదల్చాలని కేంద్రం పక్కా వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం. కొత్తవలస- కిరోండల్ రైల్వేలైన్ 446 కిలోమీటర్ల పొడవు ఉన్నప్పటికీ ఇందులో 119 కిలోమీటర్లు మాత్రమే ఆంధ్రప్రదేశ్ పరిధిలోకొస్తోంది. ఆ తర్వాత ఈ రైల్వేలైన్ ఒడిషా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత చత్తీస్‌గఢ్‌లోకి వెళ్తోంది. చత్తీస్‌గఢ్‌లో సువమారు 130కిలోమీటర్లు సాగుతుంది. తూర్పు కోస్తా జోన్‌కు ఈ రైల్వేలైన్‌పై సమకూరుతున్న ఆదా యానికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అరకు వరకు మాత్రమే విశాఖ డివిజన్ పరిధిలో ఉంచి అరకు నుంచి కిరోం డల్ వరకు సంబల్‌పూర్ డివిజన్ పరిధిలోకి తేవాలన్నది తాజా వ్యూహం. కిరోండల్ నుంచి రవాణా అవుతున్న ఇనుము, ఖనిజ ఎగుమతులకు సంబం ధించిన బిల్లులన్నీ కిరోండల్ స్టేషన్‌లోనే వసూలవుతాయి. దీంతో ఈ మొత్తం సంబల్‌పూర్ డివిజన్‌కు చెందుతుంది. అలా ప్రస్తుతం ఉత్తరకోస్తాకే ఈ మొత్తం చేరుతుంది. విశాఖ డివిజన్ పరిధిలోని ఇతర మార్గాలతో పాటు కెకె లైన్‌కు సంబంధించి కొత్తవలస, అరకు వరకు మాత్రమే ఈ డివిజన్‌లో ఉంచి కొత్త జోన్ పరిధిలోకి తెచ్చే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు ప్రస్తుతం విశాఖలో ఉన్న డీజెల్ షెడ్‌ను కూడా ఇక్కడి నుంచి కూర్దారోడ్ డివిజన్‌కు తరలించాలని ప్రతిపాదిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ డీజెల్ షెడ్‌లో మొత్తం 206 లోకోలు ఉన్నాయి. వీటిలో అత్యంత వేగంగా ప్రయాణించే డబ్ల్యుడీఎం-3ఎ రకం ఇంజన్లు 40తో పాటు అత్యధిక బరువును మోసుకెళ్ళగలిగే డబ్ల్యుడీజీ-3ఎ రకం ఇంజన్లు 110 ఉన్నాయి. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లలో దాదాపు 70శాతం వరకు విద్యుద్దీకరణ పూర్తయింది. పైగా ఈ డివిజన్ పరిధిలోకొచ్చే విజయవాడ, గుత్తి, గుంతకల్లులలో కూడా డీజెల్ ఇంజన్ల డిపోలు ఉన్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుని విశాఖలోని డీజెల్ డిపోను తరలించడంతో పాటు ఇప్పుడు అక్కడున్న ఎలక్ట్రికల్ లోకో డిపో నుంచి వందకుపైగా లోకోలతో కొత్తగా కుర్దారోడ్‌లో ఎలక్ట్రికల్ లోకో డిపో ఏర్పాటు చేసే విధంగా ఒడిషా నాయకుల్ని ఒప్పించే ప్రయత్నం సాగుతోంది. ప్రస్తుతం విశాఖ ఎలక్ట్రికల్ లోకోలో 167ఇంజన్లు ఉన్నాయి. ఇటీవలె బూస్వాల్ డిపో నుంచి 4, ఘజియాబాద్ డిపో నుంచి 6లోకోలను కూడా ఇక్కడకు పంపాల్సి వచ్చింది. కిరండల్ రైల్వేలైన్‌లో 80శాతం వరకు ఘాట్‌రోడ్డే. 1271 వంతెనలు, 58 టన్నెల్స్ మీదుగా ఇక్కడ ప్రయాణం సాగుతుంది. ఇందుకోసం 6వేల హార్స్‌పవర్ నుంచి 7 హార్స్ పవర్ వరకు సామర్థ్యంగల ఎలక్ట్రికల్ లోకోలను ఈ డిపోకు కేటాయించారు.

ప్రధాన ఆదాయ వనరు కిరోండల్ రైల్వేలైన్‌ను తప్పించి ఇతర లైన్లతో కూడిన విశాఖ డివిజన్‌తో సహా కొత్తగా జోన్ ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన రీతిలో ఆదాయం సమకూరదు. ఈ ప్రాంతమంతా సాధారణ ప్యాసింజర్ ట్రాఫిక్ తప్ప గూడ్స్ ట్రాఫిక్ ద్వారా పెద్దగా ఆదాయం వచ్చే పరిస్థితి ఉండదు. అలాగే ప్రధానమైన లోకో షెడ్లు తరలిపోతే ఉద్యోగావకాశాలు కనుమరుగవుతాయి. కొత్త నియామకాలన్నీ తిరిగి భువనేశ్వర్ కేంద్రంగా గల తూర్పు కోస్తా పరిధికే దక్కుతాయి. కిరోండల్ రైల్వేలైన్‌తో సహా విశాఖ డివిజన్‌ను సాధించుకుంటేనే ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



కుంభకోణాల్లేని నవ భారతం

- నిరుపేదల స్వప్నం సాకారం
- మార్పును ఆస్వాదిస్తున్న యావత్ భారతం
- మీరే మా గుడ్‌విల్ అంబాసిడర్లు
- మస్కట్‌లో భారతీయులతో మోడీ భావోద్వేగం

మస్కట్: కుంభకోణాలు లేని నవభారత నిర్మాణానికి తమ ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతున్నట్టు ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. గత పాలకుల హయాంలో వరుస కుంభకోణాలతో దేశ ప్రతిష్ఠ మసకబారిందని అన్నారు. పెడదారి పట్టిన పాలనాశైలిని చక్కదిద్దడానికి తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్నదని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తన రెండు రోజుల ఒమన్ పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం మస్కట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సుల్తాన్ ఖబూస్ క్రీడా కాంప్లెక్స్‌లో భారతీయ సంతతికి చెందినవారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ కడుపేదలు సైతం వారి కలలను సాకారం చేసుకునేలా ఒక నవభారత నిర్మాణం కోసం తామంతా పనిచేస్తున్నట్టు ప్రధాని తెలిపారు. నవభారతంలో పాలనా సంస్కృతిలో మార్పు తీసుకురావడంలో భాగంగా ప్రజాసమస్యలపై దృష్టిపెట్టి వాటిపై చిత్తశుద్ధితో చర్య తీసుకోవడానికి విధానాలను సరళీకృతం చేశామని చెప్పారు. తమ ప్రభుత్వం కాలదోషం పట్టిన 1400 నుంచి 1450 చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. 21వ శతాబ్దపు అవసరాలను దృష్టిలో పెట్టుకొని తమ ప్రభుత్వం దేశంలో తర్వాతి తరపు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నదని ప్రధాని చెప్పారు. నవభారతంలో కుంభకోణాలు ఉండవు, నిర్ణయాలకు ఎంతో కాలం అడ్డంకులుండవు, సవాళ్లను ఆమోదించాము, లక్ష్యాలను సాధించాము అని సభికుల కరతాళధ్వనుల మధ్య మోడీ ధీమాగా చెప్పారు. నవభారతంలో పని సంస్కృతిలో మార్పునకు ఇదే తార్కాణం అని తెలిపారు.

పక్కా నిర్ణయంతో దేశానికి నగదు ఆదా

పవిత్రమైన ఉద్దేశ్యంతో, స్పష్టమైన విధానంతో నిర్ణయం తీసుకున్నప్పుడు దేశానికి నగదు ఆదా అవుతంది. ప్రస్తుతం ఉన్న వనరులను చక్కగా వినియోగించుకున్నప్పుడు దేశం నగదును ఆదా చేస్తుంది అని తెలిపారు. తమ ప్రభుత్వం సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా రూ1,40,000 కోట్లను ఎలా ఆదా చేసిందీ వివరించారు. ఖతర్, ఆస్ట్రేలియాలతో చమురు ఒప్పం దాలపై మరోసారి మంతనాలు జరపడం ద్వారా గతంలో చెల్లించినదానికి రూ.12,000 కోట్లను ఆదా చేశాం. మా ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదలీ పథకం ద్వారా రూ.57,000 కోట్లు ఆదా చేసిందని మోడీ తెలిపారు.

నవభారత నిర్మాణంలో మీరే భాగస్వాములు

నవభారత దృక్కోణాన్ని సాకారం చేయడంలో మీరు భాగస్వాములని ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోడీ అన్నారు. ఒమన్‌లో ఉంటున్న ఎనిమిది లక్షల మంది భారతీయులు గుడ్‌విల్ అంబాసిడర్లు. దేశాభివృద్ధికి ఊతమిచ్చారు. ఒమన్‌కు వస్తే సొంత ఇంట్లో ఉన్నట్టుంది. ఒమన్ నాయకత్వం, ప్రజల కారణంగానే ఇది సాధ్యమైంది అని ప్రధాని అన్నారు.



లెక్కలు చెప్పండి

- నాలుగేళ్లు చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారు
- 15లోగా వివరాలు ఇవ్వండి
- ఎవరు అబద్ధం ఆడుతున్నారో తేలాల్సిందే
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెదేపా, భాజపా కలయిక వల్ల ఏపీ రాష్ట్రా నికి మేలు జరుగుతుందన్న ఏకైక లక్ష్యంతోనే తాను మద్దతు తెలిపానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రాష్ట్ర విభజన కారణంగా ఏపీకి ప్రత్యేక హోదా దక్కుతుందని అందరిలా తాను భావించానని అన్నారు. కానీ తాను అనుకున్నది ఒకటి....ప్రస్తుతం జరుగుతున్నది మరోటి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానిగా నరేంద్ర మోడీ.... రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రిగా ఉంటే పరిస్థితులన్నీ చక్కబడతాయని ఆశించానని అన్నారు. కానీ నాలుగేళ్ళు అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రా నికి ఇవ్వాల్సిన నిధుల విషయంలోగానీ, ప్రత్యేక హోదా విషయంలోగానీ ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఇన్నాళ్ళపాటు చంద్రబాబునాయుడు కేంద్రాన్ని ఎందుకు నిలదీయలెదో అర్థం కాడం లేదన్నారు. పైగా నిధుల విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం పరస్పర విరుద్ధ ప్రకటన చేస్తుండడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 2014 నుంచి కేంద్రం ఇచ్చిన వివరాలను.....రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న వివరాలను తనకు అందిం చాలని రెండు ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై జాయింట్ ఫ్యాక్ట్స ఫైండింగ్ కమిటీలో చర్చిస్తామన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో జరిపిన సమావేశానంతరం పవన్‌కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేరకపోవడంతో తాను రెండు, మూడు సభలు కూడా పెట్టానని అన్నారు. ప్రత్యేక హోదాపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మాటల్లో ఎంతో వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. ఈ రెండు పార్టీలు మాటమార్చా యన్నారు. విభజన హామీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇన్నాళ్లు జాప్యం చేసిందని ఆయన విమర్శించారు. రెండు పార్టీలు న్యాయం చేయలేని పక్షంలో తనవం తుగా వారిని ప్రశ్నించాల్సిన బాధ్యతపై తనపై ఉందన్నారు. అన్ని రాష్ట్రా ల కంటే ఏపీకు ఎక్కువే ఇచ్చామని కేంద్రంలోని భాజపా చెబుతోందని.... మరోవైపు రాష్ట్రా నికి రావాల్సినవేది సక్రమంగా రావడం లేదని అంతా అస్తవ్యస్తంగా ఉందని ఏపీ ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో తన వంతు బాధ్యతగా ఏదో ఒకటి చేయాలనుకున్న ప్పుడు....రాజకీయాలకు సంబంధం లేకుండా అస్త్రసన్యాం చేసిన ఉండవల్లి అరుణ్‌కుమార్ గుర్తుకొచ్చారని అన్నారు. ఎన్నో ఏళ్ళుగా కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్నప్పటికీ రాష్ట్ర విభజన సమయంలో ఆ పార్టీతో విభేదించి రాజకీయాలను వైదొలిగారన్నారు. ఆయనైతేనే సమస్యను తటస్థంగా చూడగలుగుతారని...ప్రజల సమస్యలను అర్థవంతంగా చెప్పగలరని భావించానన్నారు. అందుకే ఉండవల్లి, జేపీ ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడిగిన వివరాలు ఇవ్వకుంటే ఆ తర్వాత చూస్తామన్నారు. ఆర్థికవేత్తలు, విద్యావేత్తలతో కలిసి ఒక జేఏసీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ విభజన హామీలపై చర్చిస్తామన్నారు.



ప్రభుత్వాలు అబద్ధాలాడవు.. నిజాలు దాస్తాయి: ఉండవల్లి

ఏ ప్రభుత్వం అబద్ధాలాడదు కానీ...నిజాలు మాత్రం దాస్తుందని ప్రముఖ రాజకీయవేత్త ఉండవల్లి అరుణ్‌కుమార్ చమత్కరించారు. హైదరాబాద్, ప్రశాసన్‌నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌తో భేటీ ముగిసిన అనంతరం ఉండవల్లి మీడియాతో మాట్లాడారు. భేటీలో తన మొదటి ప్రశ్నతోనే పవన్ ఆకట్టుకున్నారని అన్నారు. రాజకీయ నాయకులు అబద్ధాలాడుతారు...ప్రభుత్వాలు మాత్రం ఆడవని అభిప్రాయపడ్డారు. రాజకీయాలు గురించి తాము ఏమాత్రం మాట్లాడలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఉండవల్లి చెప్పారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

న్యాయదేవత కనువిప్పింది

చెవులే కాని కళ్లు లేవనుకున్న
న్యాయదేవత నోరు విప్పింది
అన్యాయాన్ని ఏరూపంలోనూ
సహించబోమన్న మాటని
మరొక్కసారి నిలబెట్టుకునేలా
కళ్లలో నిప్పులు చెరిగింది.

తరతరాలుగా నమ్ముకున్న
తన జనుల్ని ఊరడించింది
మౌనం వీడి వీధిలో పోరాడింది
ఆశ్రిత పక్షపాతం సహించని
ఆ న్యాయ మేధస్సు
నేనున్నానంటూ లేచింది

సత్యం న్యాయం జీవమని
అసత్యం అన్యాయం మరణమని
అక్షరబేధాన్ని ఎరిగించి
జనజీవితానికి భరోసాగా
జరుగుతున్న చోద్యం చూడక
వైద్యం చేసే పనిలో పడింది.



మనిషి గమ్యంలో గమనంలో
విలువల్ని నిలుపుకోమంటూ
భావితరాలు తమని
వేలెత్తి చూపకుండా
ఒక్కటై కదిలిన
ఆ మూర్తిమత్వాలు
యుగాలకు తరగని సందేశాన్ని
ఆకాశం నిండా నింపి
తలెత్తి చూసేలా
వేగుచుక్కలై వెలిగి
మార్గనిర్దేశనం చేయటం చూసిన
భరతమాత కన్నుల్లో
గర్వం తొణికిసలాడింది.

- జంధ్యాల రఘుబాబు
9849753298

సాహిత్య వార్తలు

అంతర్జాతీయ సహస్ర కవి సమ్మేళనం

తెలుగు భాష, తెలుగు కవిత్వానికి పట్టాభిషేకం చేయాలన్న సత్సంకల్పంతో తెలుగు గడ్డ, అవని గడ్డలో తెలుగు లోగిలి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పి.యస్.రావు ఆధ్వర్యంలో, బిక్కి కృష్ణ సారధ్యంలో 2018 ఫిబ్రవరి 25,26,27 తేదీలలో మూడు రోజుల పాటు వెయ్యి మంది కవులతో 'అంతర్జాతీయ సహస్ర కవి సమ్మేళనం- వెయ్యి కవితల పండుగ'ను జరపాలని సంకల్పించాం. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మంత్రులు, ప్రఖ్యాత రచయితలు, సామాజిక వేత్తలు అతిథులుగా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కవులు తమపేర్లను 8332903156 నెంబరులో ఫిబ్రవరి 5వ తేదీలోపు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని పూర్తి వివరాలకు 9246415150, 83744-39053 నెంబర్లలో సంప్రదించవచ్చు.

- కలిమిశ్రీ, సహస్ర కవి సమ్మేళనం, ఆహ్వాన కమిటీ కన్వీనర్,
9246415150

కవిసంధ్య-పానుగంటి కవితల పోటీ

మార్చి 21, అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిసంధ్య కవిత్వ పత్రిక ''కవి సంధ్య పానుగంటి కవితల పోటీ''ని నిర్వహిస్తున్నది. ఈ పోటీలో పాల్గొనడానికి కవులు ఎంట్రీ ఫీజుగా 200రూ.లు మనియార్డర్/డ్రాఫ్టు ద్వారా లేదా నేరుగా బ్యాంకు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఎంట్రీ ఫీజు చెల్లించిన వివరాలు కవితలతో పాటు జతపరచాలి. సామాజిక అంశాలపై రాసిన కవితలకు ప్రాధాన్యత ఉంటుంది. బహుమతులు వరుసగా రూ. 3000/-, రూ.2000/-, రూ.1000/-లు, అయిదు మంచి కవితలకు రూ.500/- చొప్పున ఐదుగురికి ఇవ్వబడతాయి. చివరితేదీ 20 ఫిబ్రవరి 2018. ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన బ్యాంకు వివరాలు: అకౌంట్ పేరు కవిసంధ్య, అకౌంట్ నెం. 1557110000-2360, ఆంధ్రాబ్యాంక్-యానాం, ఐ.ఎఫ్.ఎస్.కోడ్ ఎ.ఎన్.డి.బి. 000-1557. పంపాల్సిన చిరునామా- దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం-533464. వివరాలకు- 9440105987

- కవి సంధ్య- యానాం

కొలకలూరి సాహిత్య పురస్కారాలు-2018

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం అంకం లింగమూర్తి రాసిన 'అమ్మ-నాన్న' నాటికల సంపుటికి లభించింది. ఈ పురస్కారానికి గాను రూ. 10,000/- నగదు పురస్కారముంటుంది. అలాగే జీడిగుంట రామచంద్రమూర్తి రాసిన 'మూడు నాటికలు' సంపుటికి రెండవ బహుమతి రూ. 5000/-ను గెలుచుకుంది. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం ఈతకోట సుబ్బారావు రాసిన 'కాకిముద్ద' కవితా సంపుటికి మొదటి బహుమతి రూ.10,000/-, అడిగోపుల వెంకటరత్నం రాసిన ముందడుగు కవితా సంపుటి, రెండవ బహుమతి రూ.5000/- గెలుచుకున్నాయి. ఈ పురస్కారాలు 26వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు ఎన్.టి.ఆర్. కళాప్రాంగణం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ నందు జరిగేసభలో అందించబడతాయి.

-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
ఆచార్య కొలకలూరి సుమకిరణ్

19న పఠాభి శతజయంతి

భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల యానాం, కవిసంధ్య సంయుక్త నిర్వహణలో ప్రముఖ అభ్యుదయ కవి పఠాభి శతజయంతి ఉత్సవం 19న యానాంలో జరుగుతుంది. ఈ సందర్భంగా ''పఠాభి సాహిత్యం- ప్రాసంగికత'' అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు ఉంటుంది. డా॥ అత్తలూరి నరసింహారావు, డా॥సీతారాం, అదృష్ట దీపక్, వంశీకృష్ణ, డా॥వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, డా॥జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానం రాజు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, డా॥వరగు భాస్కరరెడ్డిల పత్రాలు సమర్పిస్తారు. కవి శిఖామణి కీలకోపన్యాసం చేస్తారు. మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియేల్, డి. సుబ్రహ్మణ్యేశ్వరరావులు అతిథులుగా పాల్గొంటారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల- కవిసంధ్య, యానాం

కింకర్తవ్యం



ఏ దారిలో నీటికోసం వెతకకు
వేదనలో వాదనకు ఊతమివ్వకు
కలలో సౌధాలకు పునాదులు వెయ్యకు
రేపటికోసం నేడే అర్రులు చాచకు
నిన్నలో నిన్ను చూసుకుని నిజమనుకోకు
దేనిలోనూ నీ ప్రమేయం లేనివాడివి
నీకసలు తెలీకుండానే వచ్చినవాడివి
నిమిత్తమాత్రుడి జీవనయానమిది
హద్దుల మైలురాళ్ళు చూస్తుండు

అస్థిత్వపు అవధుల్లో నడుస్తుండు
ఎండకు ఎండ...వానకు వాన
చలికి చలి...చీకటికి చీకటి
వెలుగుకు వెలుగు
ఇవన్నీ నీ కనుసన్నల్లో లేవు
వాటిని కాదంటే ఇక ఏమీ లేదు.
అందుకే...నీ కర్తవ్యం ఏమిటి?
ఇంత తెలిశాక ఏమీ లేదనుకోకు
తెలుసుకుంటే చాలా ఉంది
తెలుసని విర్రవీగితే వికటిస్తుంది
అలమీద నడిచే మరో అలలా
సాగిపోయే ప్రయత్నం చెయ్యి!
ఆకాశంలో మబ్బులా
కదిలే సాహసం చెయ్యి!!

- వయ్యస్సారెస్
9000013367

తెలంగాణ తెలుగుపై సంస్కృతం వెలుగు

ఏదైనా ఒక భాషలోని పదాలపై అదే పనిగా దృష్టి సారించి పదే పదే నిశితంగా పరిశీలిస్తుంటే, ఆ పదాలు ఆ భాషకు సంబంధించిన సొంత మాటలా లేక సంస్కృతం మొదలైన పరభాషా పదాలా అనే అనేక భాషా రహస్యాలు బయల్పడుతాయి. తద్వారా అసలు సిసలు పద స్వరూప విషయం కూడా మనకు విశదం అవుతుంది. ఉదాహరణకు తెలుగు భాషలోని ''పిల్లి''ని మెల్లిగా చూద్దాం. ''పిల్లి'' అనగానే కొంత హిందీ పరిజ్ఞానం వున్నవాళ్లకు చప్పున ''బిల్లీ'' స్ఫురిస్తుంది. ఓహో! తెలుగు పిల్లికీ, హిందీ బిల్లీకీ, సంబంధం వుందని చెప్పేందుకు పెద్దగా పిల్లిమొగ్గలు వెయ్యకుండానే అవగతం అవుతోంది. మరి హిందీ బిల్లీకి తల్లి ఎవరు? ఇంకెవరు, సంస్కృతం.

ఆ భాషలోని ''బిడాలము'' బింబస్మరణకు వస్తుంది. ఈ బిడాలమే వర్ణసమీకరణాది మార్పులకు లోనై ''బిల్లీ'' అయ్యింది. ఆ బిడాలమే వర్ణవ్యత్యయంతో గుజరాతీలోని ''బిలాడో''గా మారింది. మనక్కావాల్సింది మళ్లీ పిల్లే! మరి ''పులి'' మాటేమిటి? తెలుగు పులినే తమిళంలో కూడా పులి అంటారా? అదే కన్నడంలో హులి(తెలుగులోని పదాది ప్రకారం కన్నడంలో హకారమైంది). తెలుగు భాషలో వున్న ''ఎలుకలు'', ''చిలుకలు'', ''ఈగలు'' అనే పదాలకు తమిళంలోని ''ఎలిగళ్, కిళిగళ్, ఈగళ్ మాతృకలు, అనుచిత విభాగం వల్ల, ఎలుక, చిలుక, ఈగ అనే ఏకవచనాల్ని చేసుకున్నాం తెలుగులో. నిజానికి అవి ఎలి, కిళి, ఈ అనే పదాలు తమిళంలో. ఘల్ అనేది మన ''ట'' వంటి బహువచన ప్రత్యయం, తమిళంలో ఇట్లా తెలుగు భాషలో వున్న పదసంపదను పరిశీలిస్తే ఆ పదాలు సంస్కృతం నుంచి వచ్చాయా, తమిళం లోంచి వచ్చాయా, తెలుగు భాషలోనే వున్నాయా అనే అంశం బోధపడుతుంది. తెలుగు ద్రావిడ భాషాజన్యం అయినప్పటికీ సంస్కృతం నుండి ''సింహం'' మొదలైన అనేక పదాలు మన భాషలోనికి వచ్చాయి. అట్లాగే తెలంగాణ భాషలో సైతం ఈ సంస్కృతం మాటలు వందలూ, వేలూ వున్నాయి. పైగా చదువు పెద్దగా లేని పల్లెటూరి ప్రజల సంభాషణల్లోనూ ఇవి చోటుచేసుకొన్నాయి.

సంస్కృతంలో ''ఖని'' అంటే రత్నములు పుట్టెడు చోటు, గని అని శబ్దరత్నాకరకారుడు బహుజనపల్లి పేర్కొన్నారు. రత్నాలేకాదు నల్లబంగారం వంటి బొగ్గు లభించేస్థలం కూడా ఖనే! గనే!! అందుకని తెలంగాణలో ఓ వూరు ఉంది. అది గోదావరి ఖని. గోదారి ఒడ్డున బొగ్గు లభించే ప్రదేశం కనుక ఆ పేరొచ్చింది. అట్లాగే రవీంద్రఖని. ''ఖర్జూరం'' సంస్కృత పదం. ఇది తెలంగాణలో ''కజ్జురం'' అవుతుంది. కజ్జురపు పండ్లు అని పిలుస్తారు. మహా ప్రాణాక్షరం ''ఖ'' పోయి, ''క'' అయ్యింది. ''ర్జూ'' అనే సం యుక్తం జ్జు అనే ద్విత్వంగా మారింది. కొమ్ము దీర్ఘం పోయి కొమ్ము మిగిలింది. కనుక తెలంగాణ కజ్జురం సంస్కృత ''ఖర్జూర''జన్యం. వీటిని ఎక్కువగా పెళ్లి మొదలైన శుభ కార్యాల్లో వాడుతారు.

ఇరవై నాల్గు కేరట్ల బంగారాన్ని తెలంగాణలో చొక్కం లేదా సొక్కం బంగారం అని పిలుస్తారు. అందులో రాగి మొదలైన దాతు కల్సినపుడు అది నగలు చేయడానికి, పనికి వస్తుంది. అట్లాగే వెండిలో స్వచ్ఛమైనది వున్నప్పుడు దాన్ని సైతం సొక్కం వెండి అంటారు. అది కంసాల వద్ద కల్తీ చేయబడినపుడు ''కేటి'' అవుతుంది. కేటి వెండికి నలుపురంగులో ఉంటుంది. ఈ ''కేటి''కి మూలరూప పదం సంస్కృతంలోని ''ఖేటము''. దీనికి అర్థం అధమం అని. ప్రథమంగా వుండాల్సిన వెండి ఏదైనా కల్సినపుడు అధమంగా అవతరిస్తుంది. అంటే సొక్కం వెండి కేటి వెండిగా మారిపోతుంది. సంస్కృతంలోని ''స్వచ్ఛము'' బహుశః ''సొక్కం'' కావచ్చును. స్వచ్ఛంలోని ''చ్ఛ'' వర్ణం సొక్కంలో ''క్క'' అనే అక్కరంగా వుంది. అబ్బురపడాల్సింది ఏమీ లేదు. 'క' 'చ' కావడం తాలవ్యీకరణం. ''చ'' ''క''గా మారడం విలోమతాలవ్యీకరణం.

చెరకుగడలకు ఓ తెగులు తగులుతుంది. దాన్ని తింటున్నపుడు అక్కడక్కడ ఎర్రగా కన్పిస్తుంది. చెరకు కర్రలో దీన్ని గండమాల అంటారు. నిజానికిది సంస్కృతం మాట. దీనికి అర్థం మెడచుట్టు గడ్డలు లేచెడి వ్యాధి విశేషం అని బహుజనపల్లి సీతారామాచార్యులు చెప్పినా నిజామాబాదు ప్రాంతాల్లో అది చెరకు పంటకు సంబంధితమై ఉంది. ఇదంతా అర్థ వివరిణామ పరిణామం. ''గంభీరము'' అంటే లోతు గలది అని అర్థం. చాలా హుందాగా, నిండుగా తొణక్కుండా బెణక్కుండా ఉన్నపుడూ ''వాడు గంభీరంగా వుంటాడు'' అంటారు. తెలంగాణ ''గంభీరావు పేట'' వుంది. అట్లాగే ''గంభీర్‌పూర్'' వుంది. ''వినాయక చవితి'' అందరికీ తెల్సిన పండగ. దీనికే వినాయక చతుర్దశి కూడా నామాంతరం. ఇదే తెలంగాణలో ఎంకయ్య పండుగ, సంస్కృత ''వినాయకుడు'' ''వినాయకయ్య'' అయ్యి ఏకంగా ఎంకయ్య అయ్యిండు. ఎనుక ముందు చూడకుండానే! ఈ ఎంకయ్య పండుగనే గన్పతుల పండుగ అని కూడా అంటారు. ''గణపతి'' అనేది సంస్కృతం. గణపతి పండుగలకు బదులు గన్పతులు అనడానికి కారణం వాడవాడనా గణపతుల్ని పెట్టి ఆ తదుపరి నిమజ్జనం చేస్తారు. కనుక జనం గన్పతుల పండుగ అంటున్నారు. గరుడుడు, గరుత్మంతుడు, తెలంగాణలో ''గరుష్మంతుడు'' అయిపోతాడు. సంస్కృతంలోని గరుత్మంతుడే తెలంగాణ గరుష్మంతుడు. అదే గరుడ పక్షి. దసరా రోజున పాల పిట్టతో పాటు గరుష్మంతుడు కనిపిస్తే ఎంతో పుణ్యమని ప్రతీతి.

''ఏమే పిల్లల్ని ఏం గద్దరించి పెడుతున్నవే? బయపడుతరు. బయం మంచిదే గానీ ఏదైన అతి కావద్దు''...ఈ తీరు మాటల్లోని ''గద్దరించి పెట్టుడు'' కూడా సంస్కృతం నుండి వచ్చిందే! ''గర్జించు'' అనే క్రియ వుంది అమరంలో. అది క్రమంగా ''గద్దించు'' అయ్యింది తెల్గులో. తెలంగాణలో మాత్రం ''గద్దరించిపెట్టు'' అయ్యింది. కొన్ని ప్రాంతాల్లో ''గద్దరిచ్చి పెట్టు''గా వుంది. గద్దరించులో ఇంచుకాగమం వుంటే గద్దరిచ్చులో ఇచ్చుకాగమం వున్నది. నిజానికిది ''ఇసుకాగమం''. కన్నడంలో వుంటుంది. మన ''సహించు'' అక్కడ కర్ణాటకంలో ''సహిసు', మన ''కోపించు'', ''కోపిసు'' అవుతుంది. భాషలో నాటకం వుండనే ఉంటుంది. తెలుగు లోని ''సున్నా'' కన్నడంలో సున్నా అవుతుంది. అంటే లేకుండా పోతుంది. అందుకే మన క్రియల్లోని ''ఇంచు'' కన్నడంలో ''ఇసు''అవుతుంది. బాగా ఏం కాదు, ఇంచుమందమే (అంగుళం మేరనే, కొంచెమే) తేడా! తెలంగాణ భాషపై కన్నడ ప్రభావం వుందీ అనడానికి ''గద్దరిచ్చి పెట్టుడు'' వొక ఉదాహరణ మాత్రమే! సంస్కృతంలో ''గర్వం'' అనే మాట వుంది. తెలంగాణలోని వానికి గర్రు ఎక్కువ'' అనే వాక్యం వుంది. ఈ ''గర్రు'' ఆ ''గర్వం'' నుండి వచ్చిందే! అంతేగాక, గర్వం అనే మాట గర్వాంతంగా ప్రచురితమై వుంది. ''వాడు గర్వాంతం మనిషి'' అని అంటుంటారు కొందరు. అంటే ''గర్విష్ఠి'' అని అర్థం. ఇంక ''గళం'' వుంది గీర్వాణ భాషలో. అర్థం గొంతు అని. తెలంగాణలో ''గొంతు''కు మారుగా గళం లేదుగాని గొంతు చుట్టూ వుండే చొక్కా కలర్‌లో గళం వుంది. కాకుంటే అది ''గల్లా''గా మారిపోయింది. ''వాడు నన్ను గల్లపట్టుకొని అడిగిండు. వాళ్లిద్దరు గల్లలు గల్లలు పట్టుకొని కలెవడ్డరు''



అంటే గళసంబంధితమే! అట్లాగే తెలంగాణలో ''నల్లా అనే మాటొకటి వుంది. ఇది సంస్కృత నాళంలోంచి వచ్చింది. నాళం అంటే గొట్టం. కొళాయి గొట్టమే. మంచినీళ్ల పైపే తెలంగాణలో ''నల్లా''. చిత్రంగా సంస్కృతగళం ''గల్లా'' అయినట్లే, ''నాళం'' నల్లా అయ్యింది. హిందీలో అదే ''నల్''. సంస్కృతంలో ''గుంజ'' అనే మాట ఒకటుంది. ఇది తెలుగు గులాబీ కాదు సుమా! (పందిరిగుంజ) ఈ అమర భాషలోని ''గుంజ''కు అర్థం గుగిబె-గురివింద. ఇది చాలా చక్కగా తెలంగాణలో ప్రయుక్తం అవుతున్నది. అదే అర్థస్ఫూర్తితో. ''వాళ్ల దగ్గర పాపం గుంజెత్తు బంగారం లేదు'' అంటుం టారు. గుంజ ప్లస్ ఎత్తు గుంజెత్తు. ఒక్క గురిజెడు, గుంజెడు అలాగే కించిత్తు బంగారం లేదని చెప్పడం. మామూలు జనం కూడా ''ఇది ఎన్ని గుంజెల బంగారం?'' వంటి ప్రశ్నా వాక్యా లు ఉపయోగిస్తుంటారు సులువుగ. ఈ తెలంగాణ గుంజె మరీ గుంజలు పాతుకుని వున్నది సంస్కృతం ''గుంజె''లో.

''వాడు గుడుంబ తాగి తాగి పాడయిపోయిండు''లోని గుడుంబ ఓ రకమైన మద్యం. మద్యపానం ఏరకమైనది అయినా అది మద్యంలోనే ప్రాణం తీస్తుందని కాదు, ఎప్పుడైనా తీసేయవచ్చును. సంస్కృతం ''గుడ'' శబ్దం వుంది. అది ఆకారాంత స్త్రీలింగం, అదే తెలుగులో ''గుడము''అవుతుంది. అంటే ఒక అర్థం బెల్లం అని. దాని నుండి తయారయ్యేదే ''గుడుంబ''. ఇది ఒక రకమైన సారాయి. అది బెల్లం నుండి వచ్చిన సారమే కావొచ్చును, ఇప్పపూల నుండి తయారైన సారాయమే అదొచ్చుగాక మన ప్రాణసారమైతే కాదు, మనిషి నిస్సారమై కేంద్ర నాడీవ్యవస్థను దెబ్బతీస్తుంది. తప్పతాగితే తప్పుదారిన పడ్డట్లే మరి! మత్తులో గమ్మత్తున్నా మన ప్రాణానికి హిమ్మత్తు మాత్రం పోతుంది.

''గుణం'' సంస్కృత నుడి. ''గుణం''లో మూర్ధన్యణకారం వుంది. అది తెలంగాణలో మామూలు ''న''గా మారుతుంది. ''వానిది బారిగునం-దీనిది రాజగునం (కొన్నిసార్లు రాజాగునం) ఆమె చేతిగునం మంచిది (హస్తవాసి)..ఇట్లాంటి వాక్యవిన్యాసాలున్నాయి ప్రజల్లో. ''వాడు మామూలు గొస్తు కాదు. వీడు పేద్ద గేత్తు'' అంటుంటారు. నిజానికిది ''గృహస్థ'' పదజన్యాలు. గృహ స్థుడు అంటే ఇంటి యజమాని. ఈ గృహస్తు ''గేస్తు'' అవు తుంది. తెలంగాణలో అది ''గాస్తు''. ఇంకా జానపదులనోట ''గాత్తు''. ఒక మనిషి మనం అంచనా వేసినట్లు వుండక దండి వాడు అయినపుడు ఈ మాటను పల్కుతారు. అయితే ఈ ''గాస్తు'' పదం ఎప్పుడూ సకారాత్మకంగా ప్రయోగించబడదు. అదీ విశేషం. ''గోండోడు'' సంస్కృత మాట. పామరజాతివాడు మొద లైన అర్థాలు నిఘంటువులు చెప్పినా అది తెలంగాణలో కొండ జాతి గోండులను వుద్దేశించిన మాట. పోతే ''గోకర్ణం'' అనే పదం వుంది సంస్కృతంలో. దీనికి అయిదు అర్థాలు శబ్దరత్నాకరంలో ఇచ్చినా అవేవీ తెలంగాణకు ఆనవు-సరిపోవు. తెలంగాణ సీమలో ఓ పాత్రను గోకర్ణం అంటారు. పెళ్లి మొదలైన కార్యాల్లో పూర్వం బంతులు లేచేవి. వరుసగా కింద కూచోపెట్టి వడ్డించేవాళ్లు. అన్నం ఒకరు పెడితే, కూరలు మరొకరు వేయడం వంటివన్నీ మామూలే. అయితే చారు మొదలైనవాటిని గోకర్ణంలో పోసి వడ్డన చేసేవాళ్లు. దానికి చారుపోయడానికి అంటే సులువుగా పోసేందుకు ముందు భాగంలో ఆవుచెవి లాగా చేసేవాళ్ళు. ఇది ఇత్తడి పాత్ర.''వాల్లకు గాచారం మంచిగ లేదు. ఎల్లకాలం యిబ్బందులే!'' వాక్యాల్లోని గాచారం ''గ్రహచారం'' నుంచి రావాలి. అయితే సంస్కృతంలో ''గోచారం'' అనే మాట వుంది. దీనికి సూర్యాది గ్రహాల మేషాది రాసుల సంచారం అని అర్థం. గ్రహాల ప్రభావమూ, రాశుల అసరూ ప్రాణుల మీద పడుతుందని కొందరి విశ్వాసం. సంస్కృతంలో ''గోప్యుడు''మాట వుంది. ఒక అర్థం కావదగినవాడు. అట్లే ''గోవనం'' అనే పలుకు వుంది. దీనికి ''దాచటం, కాపాడటం''అని అర్థాలు. ''గోప్యం''అంటే కూడా దాచదగినది అని అర్థం. అంటే రహస్యం అని. తెలంగాణలో కొంతమంది ''చెవులగోపెం'' చెబుతారు. గోడలకు చెవులుంటాయి కనుక ఆ గోప్యాన్ని (గోపెం) శ్రవణాల్లోనే చెప్పుతారు. అదీ మూడోవాడికి విన్పించని రీతిలో. ఈ చెవుల గోపెం లోని గోపెం అచ్చంగా సంస్కృత గోప్యమే! అది దాచదగిన, కాపాడదగిన రహస్యం. అది పరస్యం కాకూడని అంశం. ''చెవుల గోపెం'' గొప్ప పలుకుబడి. ''అది గోర్జెమోలె ఎర్రగ వుంది'' అన్నపుడు ''గోర్జెం'' సంస్కృతంలోని ''గోరోజనం''. నిజానికి ముందు ''గోరో చన''రూపంలో వుంటుంది. తర్వాత గోరోజనం అయ్యి తెలంగాణ ప్రాంత వ్యవహారంలో గోర్జెం అయింది. ఆవుల కడుపులో నుండి తీసే ఒక వస్తువు అనే అర్థవివరణ శబ్ద రత్నా కరంలో వుంది. కాలేయము, ప్లీహము వంటి ఒక ఎర్రని పదార్థమే గోర్జం. తెలంగాణలో గొర్రెలూ, మేకలూ మొదలైన వాటిల్లోనూ ఇది ఉంటుంది. ఇంక ''గోలీ'' గురించి. ఆధునిక ప్రమాణ భాషలోని ''మాత్ర''కు సమానార్థకం తెలంగాణ గోలి. ఆంగ్లంలో ఇదే ట్యాబ్లెట్లు. సంస్కృతంలో ''గోలకం'' పదం ఉంది. దానికి ఒక అర్థం పిల్లలు ఆడుకునే చిన్న రాతి వుండఅని. కానీ తెలంగాణలో ఈ రాతి వుండల్నీ, గాజు వుండల్నీ కొన్ని ప్రాంతాల్లో గోళీలు అంటారు. మరికొన్ని ప్రాంతాల్లో గోటీలు అంటారు. అయినా ''గోలి'' అంటే మాత్రం ''మాత్ర'' అనే! అది ''గోలకం, గోళం'' వంటి సంస్కృత పదాల్లోంచి ప్రాదుర్భవించింది. ఇట్లా అనేక పదాలకు మాతృకలు సంస్కృతంలో వున్నాయని చూపవచ్చును.

- నలిమెల భాస్కర్
9704374081

నీ అడుగుల సవ్వడికోసం

కార్తీకమాసం...
చలిగాలులు వీచే సాయం సమయంలో
మంచు పెదవులతో నువ్వు ముద్దిస్తే
గడియకో వెచ్చని కవనం
నా అంతరంగంలో ఊపిరి పోసుకుంది!
నలుబది వసంతాల నాటి ముచ్చట
నేటికీ మనసు పొరలలో నిక్షిప్తమై వుంది...
నువ్వు పంచి ఇచ్చిన జ్ఞాపకాల అనుభూతులే
నీకోసం నిరీక్షించేందుకు సత్తువనిచ్చాయి!

తమకపు తడివేళ్లతో నన్ను స్పృశించి
నీ మనసు పల్లకీపై
వలపు స్వర్గానికి మోసుకెళ్ళి
ఆనందామృత ధారలను కురిపించావు!
క్షీర సముద్రయానంలో...
నీతో విహరిస్తోన్న వేళ...
విధి వెక్కిరించింది!
అసూయతో అలమటించింది!!!
నీ సన్నిధి నుండి దూరంగా...

విరహపు దుర్గంలోనికి నెట్టివేసింది!
విలువైన యవ్వనకాంతులు
ఈ తనువు నుండి దూరమయ్యాయి...
నాలుగు దశాబ్దాల కాల ప్రవాహంలో
వృద్ధాప్యం తీరాన్ని చేరుకున్నాను!
అయినా...ప్రేయసీ...
నా గుండె లోతుల్లో...ఎక్కడో
వమ్ముకాని వలపు ఆశ
నీ అడుగుల సవ్వడికై
నిరీక్షిస్తూ ఉంది!

- విడదల సాంబశివరావు
9866400059



సగం తెగిన చంద్రుడిలో పండు వెన్నెల


నా కంటి చెమరింతలకు/నాలోని పులకింతలకు/ ఏకాంతంలో చెలరేగే/ నిశాంత నిశ్శబ్దాలకు/ నా కవిత్వమే ఒక దోసిలి/ జీవితం వెలిగే ఓ జాబిలి.

దుఃఖానికైనా, సుఖానికైనా, ఆశకైనా, నిరాశకైనా ఊరటనిచ్చేది కవిత్వమే అని చెపుతారు కవిత్వ ప్రేమికులు. వృత్తి ఏదైనా నిరంతరం అక్షరాలను వెంటపెట్టుకొని, పదాలను కూరుస్తూ, వాక్యాలను నిర్మిస్తూ మనసులో మెదిలే భావాలకు గుండెతడిని అద్ది కవిత్వంగా మార్చి అందిస్తారీ కవిత్వ ప్రేమికులు. అలా అందించిన కవితా వాక్యాలే పైన కనిపించేవి. ఆ వాక్యాలు డా॥యశోద పెనుబాల కలం నుండి జాలువారినవి.

ఆమెలో వేల భావాల రాసులే ఉన్నాయి. అవన్నీ కవితలై విహరిస్తూ అలరిస్తాయి. ప్రేమ కవితలకు కాలమేం చెల్లలేదంటాయి ఈమె కవితలు. రాసి రాసి రాయకుండా ఉండలేని స్థితికి ఆమె చేరుకున్నట్లనిపిస్తుంది. అందుకే కొన్ని అక్షరాలనైనా/ మన స్ఫూర్తిగా స్పృశించకపోతే/భావాలు గాలిపటాల్లా తెగి పోతాయి/ అక్షరం నా చిన్ననాటి నేస్తం అని చెప్పుకున్నారు యశోద.

కష్టం కలిగిన ప్రతిసారీ/ కడలి అలలా కదిలిపోకు/ ఉవ్వెత్తున ఎగిసే కెరటానివవ్వు/ చిన్న ఆలోచనకే చిగురాకులా కంపించకు/ఒక్కో ఆలోచనను/ ఒక్కో సంధించిన అస్త్రంలా మలుచుకో...అని పోరాడి గెలవాలనే ధైర్యాన్ని నూరిపోస్తారు కవితలో. యశోదలోని అనేక భావాలలో ప్రేమ భావమొకటి మనల్ని తడుముకుంటుంది.

నీ గురించి కలగన్న ప్రతిసారీ/ కోటి వెలుగులు ఈ జీవితం లో/వేల చందమామలు ఒక్కచోట చేరి/ వెన్నెల గుమ్మరించినట్టు అంటారొక కవితలో ఈ కవయిత్రి. ఇలాంటి భావ పరంపరల నన్నింటినీ యాభై ఆరు కవితలుగా కూర్చి 'సగం' తెగిన చంద్రుడు' పేరుతో ఒక కవితా సంపుటిగా వెలువరించారు డాక్టర్



యశోద పెనుబాల. ఈ కవితలన్నింటినీ ఒకదగ్గర చేర్చటంతో వాటిని చక్కగా చదువుకుంటూ మనమూ మన లోకంలో విహరించవచ్చు. కొన్ని దుఃఖాలను పంచుకోవచ్చు. ప్రణయలోకాల్లో విహ రించవచ్చు. ఆలోచనలతో వేగిపోవచ్చు. ధైర్యాన్ని మనకు మనమై కూడగట్టుకొని ముందుకు సాగవచ్చును. ఇలా ఈమె కవిత్వంలోని భావాలు మనను ఆకట్టుకుంటాయి. గౌరవం.. సన్మానం/ సత్కారం ...గుర్తింపు ఇవన్నీ కొన్ని రక్తబిందువులు/ చమట చుక్కలుగా మార్చి/ శ్రమించిన వాళ్లకి కదా అవి దక్కాలి/ శ్రమకోర్చి చీకటి వెలుగులు మరిచి/కష్టించిన వారి పెద వులుపై కదా/ గెలుపు నవ్వులు మెరవాలి అని ప్రశ్నిస్తారొక కవితలో. అర్హులు కాకుండా అవకాశాలను కొల్లగొడుతున్న వారిపై తీవ్రనిరసనని తెలుపుతారు. ఇదే కవిత చివరలో అర్హతలేని వాళ్లు అందలం ఎక్కి/ విజ్ఞత లేని వాళ్ళు ఆకాశానికి నిచ్చెనలేసి/ విర్రవీగుతుంటే/ విజయ దశమి కూడా విస్తుపోతుంది అంటూ నేటి సమాజ చిత్రాన్ని ఆవిష్కరిస్తారు. ఒక అభ్యుదయాన్ని ఈ కవయిత్రి కాంక్షిస్తారు. శ్రమజీవుల పట్ల ఒక సానుభూతి ఈమెకుంది.

గెలవాలంటే పిడికిలి బిగించి ముందుకెళ్లాలంటారీమె. మౌనం అంటే ఒక్క అంగీకారమే కాదు/ ఒక్క స్తబ్దత ఆవరించినపుడు/మొలకెత్తిన కొన్ని ప్రశ్నలు కూడా మౌనమే.../ సమాధానపరచలేని ఎన్నో ప్రశ్నలకు/జవాబు మౌనమే అంటూ మౌనానికి కొత్త భాష్యం చెపుతారు యశోద.

పదాలన్నీ పరిచయించి/భావాలన్నీ అన్వయించి/ అక్షరాలను కరిగించి/వెన్నెల వెలుగును పరిచాను/ చీకటి నలుపును దాచానంటారొక కవితలో నూతన భావాలతో ఆవిష్కరించబడిన 'సగం తెగిన చంద్రుడు' కవితా సంపుటితో డా॥ యశోద పెనుబాల కవయిత్రిగా తన ప్రతిభ ను చాటుకున్నారని చెప్పవచ్చు.

పేజీలు-142, వెల.200/-రూ.లు. ప్రతులకు పెనుబాల ప్రచురణలు, హైదరాబాద్-500073. సెల్. 9866676734.

- నియోగి
9553097319

బెంగళూరులో తెలంగాణ భవన్

కర్ణాటక రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బెంగుళూరులో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం కృషి కొనసాగుతుందని కన్నడ రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు సందీప్ కుమార్ మక్తాలా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుసుకొని తెలంగాణ భవన్ నిర్మాణం కోసం బెంగుళూరులో ఎకరం స్దలం కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. తెలంగాణ భవన్ నిర్మాణం కోసం రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల సహకారం కోరుతున్నామని వెల్లడించారు. రాబోయే ఎన్నికల హామీల్లో తెలంగాణ భవన్ నిర్మాణ అంశం పొందుపర్చాలని బెంగుళూరు పరిధిలో పోటీ చేయబయే పార్టీలను, ప్రజా ప్రతినిధులను అభ్యర్ధించడం జరుగుతుందన్నారు. తెలంగాణ భవన్ నిర్మాణ ప్రతిపాదనపైన మహదేవ్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్ధి ఏ.సీ. శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్దలం కేటాయించని పక్షంలో తాను సొంత నిధులతో స్దలం కొనుగోలు చేసి తెలంగారణ భవన్ నిర్మాణానికి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారని తెలియచేశారు.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా శివప్రసాద్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా బి.శివ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం వరకు పూర్తి స్ధాయి బాధ్యతలను వాకాటి కరుణ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల మేరకు ఆమె శనివారం బాధ్యతల నుంచి తప్పుకోవడంతో నూతన కమిషనర్‌గా శివప్రసాద్ బాధ్య తలను స్వీకరించారు. ఈయన కింగ్‌కోఠిలోని జిల్లా ఆస్పత్రిలో మెడికల్ సూప రింటెండెంట్‌గా ఆయన ప్రస్తుతం బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి ఆదేశాల మేరకు బాధ్యతలను స్వీకరించారు.

పాలిటెక్నిక్ కోర్సుతో ఉపాధి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారతదేశంలోనే పాలిటెక్నిక్ కాలేజీలు ఎక్కువగా ఉన్నాయని, పాలిటెక్నిక్ కోర్సు పూర్తయిన వారిలో 30 శాతం మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంపి పూనియా అన్నారు. దేశంలో నాణ్యమైన సాంకేతిక విద్య లభిస్తోందని చెప్పారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(ఏఐఎఫ్‌పిటివో), తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్‌లెక్చరర్స్ అసోసియేషన్(టిజి-పాలా) సంయుక్తంగా ఆదివారం జాతీయ సదస్సున నిర్వహించింది.ఈ సదస్సుకు ఏఐఎఫ్‌పిటివో అధ్యక్షులు డాక్టర్ ఎన్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా టిజి- పాలా అధ్యక్షులు వై నర్సయ్యగౌడ్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో టిజి- పాలా అసోసియేట్ ప్రెసిడెంట్ మురళీగుప్తతోపాటు వివిధ రాష్ట్రా లకు చెందిన లెక్చరర్స్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, విద్యార్ధులకు అవసరం అయిన మౌలిక వసతులను ఏర్పాటు చేశామని తెలంగాణ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల కంటే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోనే ఎక్కువ మంది విద్యార్ధులు చేరుతున్నారని తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్లను క్రమబద్ధీకరించాలి



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్రనూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం వరంగల్‌లో జరిగాయి. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు వరంగల్ నగరంలోని టీఎన్‌జీఓ ఉద్యోగుల సంఘం భవనంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్ధాపక అధ్యక్షుడు చెన్నబోయిన సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సామాల రాజేంద్రప్రసాద్ (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా రమాదేవి, సంపత్, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ముజాహిద్‌అలీ (మహబూబ్‌నగర్), కోశాధికారిగా అమృత్‌రెడ్డి (నల్గొండ), ప్రచార కార్యదర్శిగా మధుసూదన్ (కేసముద్రం) సంయుక్త కార్యదర్శిగా అజయ్ (హైదరాబాద్), రాజేశ్వర్ (సీఎంఎస్)లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగులను క్రమబద్దీకరించాలని ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమానవేతనం చెల్లించాలనిప్రభుత్వాన్ని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యల పట్ల పోరాడి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని, సంఘం బలోపేతానికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమరేందర్, వేణు, చారి, రవి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూల పల్లకిలో పరమశివుడు


వైభవంగా మహా పుష్పోత్సవం

శ్రీశైలం, ప్రభన్యూస్: పూల పల్లకిలో స్వామి, అమ్మవార్లు కన్నులపండువగా ఆదివారం దర్శనమిచ్చారు. పకృతి ప్రతిరూపమైన పార్వతీదేవితో కలిసి పూల తేరులో ఊగారు. దైవానికి ప్రీతికరమైన పువ్వులతో అలంకరించిన మహాపుష్పోత్సవం ఆదివారం జరిగింది. శ్రీగిరిపై మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు ఆధ్యాత్మిక, ఆర్బాటభరితంగా సాగింది. రాత్రి 8 గంటల సమయంలో నేత్రపర్వంగా జరిగిన గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లను పుష్పపల్లకిలో అశేష భక్తజనం నడుమ కడువైభవంగా ఊరేగారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు , వేదపండితులు పుష్ప, బిల్వార్చన పార్వతీదేవికి పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణం ద్వారా క్షేత్ర ప్రధాన వీధులలోకి తీసుకుని వచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి సమీపించడంతో లక్షలాది మంది స్వామి సన్నిధికి చేరారు. క్షేత్ర ప్రధాన వీధులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు కొనసాగింది.

మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేదెన్నడో..?

- ఉపాధి పేరుతో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు యధేచ్ఛగా కొనసాగుతున్న మహిళల అక్రమ రవాణా
- హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో చేరుతున్న వైనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపాధి నిమిత్తమని చెబుతూ బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు మహిళల అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది. కొన్ని ముఠాలు వారిని అక్రమంగా భారతదేశంలోని కోల్‌కతా, హైదరాబాద్ వంటి నగరాలకు తరలించి వారిని బానిస కూలీలుగా, ఇళ్లలో పనిమనుషులుగా మార్చేస్తున్నాయి. కాస్త అందంగా కనిపించే వారిని డ్యాన్స్ బార్లు, మసాజ్ పార్లర్లు, వ్యభిచార గృహాలకు అమ్మేస్తున్నాయి. ఈ అక్రమ రవాణాకి అడ్డుకట్ట పడెదెన్నడో..!?వివరాల్లోకి వెళితే.. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా రవాణా అవుతున్న మహిళలు,యువతులు హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో చేరుతున్నట్లు తేలింది. ఈ విషయంలో ముంబైతర్వాతి స్ధానం హైదరాబాదే కావడం గమనార్హం. ఇలా హైదరాబాద్‌కు చేరుతున్న మహిళలు, యువతులు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలు, డ్యాన్స్ బార్లు, మసాజ్ పార్లర్లు, వ్యభిచార గృహాలే అడ్డాలుగా మారుతున్నాయి. ఈ విషయాన్ని స్వయంగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) వెల్లడించింది. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి ఇలా అక్రమంగా రవాణా అవుతోన్న మహిళలు, యువకుల పరిస్థితిపై మన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అధ్యయనం చేసింది. ఈ క్రమంలో బీఎస్ఎఫ్ అనేక ఎన్జీవోల సహకారం కూడా తీసుకుంది. ఈ అధ్యయనం ఆధారంగా హ్యూమన్ ట్రాఫికింగ్.. మోడెస్ ఆపరరెండీ ఆఫ్ టాట్స్ ఆన్ ఇండో-బంగ్లాదెశ్ బోర్డర్ నివేదికను రూపొందించింది. అంతేకాదు, ఈ ఇల్లీగల్ హ్యూమన్ ట్రాఫికింగ్, హైదరాబాద్‌లో అక్రమంగా తిష్టవేస్తున్న బంగ్లాదేశీయుల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ



నగర పోలీసు విభాగాన్ని కూడా బీఎస్ఎఫ్ హెచ్చరించింది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నివేదిక ప్రకారం ప్రతీయేటా బంగ్లాదేశ్ నుంచి బారత్‌లోకి కనీసం 50 వేల మంది మహిళలు, యువతులు అక్రమంగా ప్రవేశిస్తున్నారు. ఇలా గత దశాబ్ద కాలంలో దాదాపు ఐదు లక్షల మంది బంగ్లాదేశీయులు బారత్‌లోకి ప్రవేశించారు. వీరిలో 12 ఏళ్ల నంచి 30 ఏళ్ల మధ్యలో ఉండే బాలికలు, యువతులే ఎక్కువగా ఉంటున్నారు. బంగ్లాదేశ్-భారత్ సరిహద్దుల్లో మాటు వేసిన కొన్ని ముఠాలు ఈ మానవ అక్రమ రవాణాకు పాల్పడు తున్నాయి.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకా కేంద్రంగా ఈ ముఠాలు కార్యకలపాలు కొన సాగిస్తున్నాయి. కడుపేదరికంతో బాధపడుతున్న బంగ్లా మహిళలు, యువతులను తొలుత కోల్‌కతాకు రప్పించి అక్కడ్నించీ ముంబై, హైదరాబాద్ ఇంకా పలు ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఈ మానవ అక్రమ రవాణా ముఠాలు బంగ్లాదేశ్ రాజధాని ఢాకా మొదలుకుని భారత్ సరిహద్దుల్లో ఉన్న గ్రామాల వరకు కొంతమంది దళారులను ఏర్పాటుచేసుకుని ఒక సిండికేట్‌గా మారి ఈ మానవ అక్రమ రవాణాను సాగిస్తున్నాయి. ఈ దళారుల్లో 16 శాతం మహిళలు కూడా ఉన్నారు. బంగ్లాదేశ్‌లోని మహిళలు, యువతులను ఈ దళారు ట్రాప్ చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారు. భారత్‌లో జీవన విధానం బాగుంటుందని, మంచి ఉద్యోగాలు లభిస్తాయని నమ్మబలుకుతున్నారు. ఇంటి పనులు చేసేవారికి మంచి డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లో పేదరికంలో మగ్గుతూ.. కాస్త అందంగా..ఆకర్షణీయంగా ఉన్న యువతులకు ఈ దళారులు సినిమాల్లో అవకాశాల పేరుతో ఎరవేస్తున్నారు. అంతేకాదు, భారత్‌లో అబ్బాయిలు బాగుంటారని, ప్రేమించి పెళ్లి చేసుకోవచ్చంటూ లేనిపోని ఆశలు కల్పించి.. దేశ సరి హద్దులు దాటిస్తున్నాయి. ప్రధానంగా బంగ్లాదేశ్ గ్రామాల్లోని నిరుపేద అమ్మా యిలే వీరికి టార్గెట్‌గా మారుతున్నారు. ఇలా మోసపోతున్న వారిలో జెసోర్, సత్ఖారీ, గోజడాంగ, హకీంపుర ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు. బంగ్లా-భారత్ సరిహద్దుల్లో సరైన కంచె లేకపోవడం.. జీరోలైన్‌గా పిలిచే ఇతర దేశ సరిహద్దు ప్రాంతం సమీపం వరకు జనావాసాలు విస్తరించడం ఈ మానవ అక్రమ రవాణా ముఠాల కార్యకలాపాలకు బాగా కలిసివస్తోంది.

సహకరిస్తున్న బీజీబీ

బంగ్లాదేశ్ నుంచి జరుగుతోన్న ఈ మానవ అక్రమ రవాణా వ్యవహారంలో సిండికేట్లకు, దళారులకు బంగ్లాదేశ్ సరిహద్దు భద్రతా దళమైన బోర్డర్స్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) సహకరిస్తుండటం, దళారుల వద్ద ఒక్కో యువతికి 200 నుంచి 400 టాకాలవరకు వసూలు చేస్తూ వీరు సరిహద్దులు దాటించేస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని కూరిగ్రామ్, లాల్‌మొన్నీర్‌హత్,నీల్ఫామారి, పంమఘూర్, థకూర్గావ్, దినజ్‌పూర్, నావ్‌గావ్, చపాయ్, నవాబ్‌గంజ్, రాజ్‌షహిజిల్లాలు.. పశ్చిమ బెంగాల్‌లోని బినోపోల్ ప్రాంతాల్లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దులు దేశంలోకి అక్ర మంగా ప్రవేశించేవారికి అనువుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో అటు బంగ్లా.. ఇటు భారత్‌కు చెందిన వ్యవస్థీకృత ముఠాలు పక్కానెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని ఈ మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయి.

కొన్నాళ్లు సరిహద్దు గ్రామంలోనే..

మానవ అక్రమ రవాణా ముఠాల బారినపడి ఎంతోమంది బంగ్లా మహిళలు, యువతులు, బాలికలు భారత్‌లోకి ప్రవేశిస్తున్నారు. భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత కొన్నాళ్లపాటు వీరిని సరిహద్దు గ్రామాల్లోనే ఈ ముఠాలు దాచి ఉంచుతున్నాయి. ఆ తరువాత దేశంలోని వివిధ నగరాల్లో ఉండే తమ ఏజెంట్లకు విక్రయిస్తున్నాయి. ఇలా భారత్ చేరిన వారిలో ఎక్కువ మంది మహిళలు, యువతులు ముంబైకి చేరుతున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చేరుస్తున్నారు. బెంగళూరు, రాయపూర్, సూరతలకు పెద్ద సంఖ్యలో వీరు చేరుతున్నట్లు బీఎస్ఎఫ్ తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో విభిన్న వర్గాలు, ప్రాంతాలకు చెందిన వారు నివసిస్తున్నందున బంగ్లాదేశ్ నుంచి ఇక్కడికి చేరుతున్న యువతులను స్థానికులు పెద్దగా గుర్తిండం లేదు. దీంతో వారు తేలిగ్గానే ఇక్కడి వారితో కలిసిపోతున్నారు.

హైదరాబాద్ శివారు ప్రాంతాలే వీరికి ఆవాసాలు...

హైదరాబాద్ నగర శివార్లలో ఉండే పారిశ్రామిక ప్రాంతాలు వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి ఎంతో కాలంగా ఆశ్రయం కల్పిస్తున్నాయి. దీంతో బంగ్లాదేశీయులు కూడా ఈ ముసుగులో ఇక్కడ స్థిరపడిపోతున్నారు. ఇలా అక్రమంగా తరలివచ్చిన వారికి అవసరమైన గుర్తింపు కార్డులు ఇప్పించేందుకు కూడా కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయి. ఈ ముఠాల సహకారంతో అడ్డదారిలో ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు వంటివి పొందుతూ బంగ్లాదేశ్ నుంచి ఇక్కడికి చేరుకున్న మహిళలు, యువతులు స్థానికులుగానే చెలామణి అయిపోతున్నారు. అసలు దళారులు బంగ్లాదేశ్ నుంచి వీరిని భారత్ చేర్చే ముందు చెప్పేదొకటి, తీరా ఇక్కడికొచ్చాక వారు చేస్తుందొకటి. ఉపాధికోసం వచ్చిన యువతులకు ఇక్కడి ఏజెంట్లు బాగా డబ్బున్న వారి ఇళ్లల్లో పనికి కుదుర్చుతున్నారు. మరికొంతమంది డాన్స్ బార్లలో డ్యాన్సులు చేసేందుకు కుదుర్చుతున్నారు. సినిమాల్లో అవకాశాలంటూ తీసుకెళ్లి వ్యభిచారం చేయిస్తున్న ఘటనలు కోకొల్లలు.

పురుషోత్తంరెడ్డి కోసం వేట ముమ్మరం

- రంగంలోకి 11 ఏసీబీ టీంలు
- కూతుళ్లతో వాట్సాప్, ఇంటర్నెట్ కాల్స్‌తో టచ్‌లో వున్న పురుషోత్తంరెడ్డి
- శ్రీనివాసరెడ్డి చిక్కితే స్పష్టత వచ్చే అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏసీబీ వేట కొనసాగుతోంది. మొత్తం 11 టీంలు ఆయన కోసం గాలిస్తున్నాయి. పురుషోత్తంరెడ్డి హైదరాబాద్‌లోనే కొన్ని ప్రాంతాల్లో తలదాచుకుని ఉంటారన్న అను మానాలున్నాయి. అయితే పురుషోత్తంరెడ్డి ఎప్పటికప్పుడు స్థావరాలు మారుస్తున్నట్లు ఏసీబీకి సమాచారమందుతోంది. అంతేకాదు, పురుషోత్తంరెడ్డి తన కూతు ళ్లతో వాట్సాప్, ఇంటర్నెట్ కాల్స్ సంభాషణ జరిపినట్లు ఏసీబీ గుర్తించింది. కేరళ, చెన్నైలో పురుషోత్తంరెడ్డి ఉండవచ్చన్న అనుమానంతో కొన్ని ఏసీబీ టీంలు అక్కడకు వెళ్లాయి. కాల్‌డేటాను విశ్లేషించిన ఏసీబీ ఆయన చివరికాల్ ఓ ఎమ్మెల్యేకు చేసినట్లుగా ఏసీబీ గుర్తించింది. అంతేకాదు, ఆ తర్వాత సదరు ఎమ్మెల్యే ఫోన్ స్విచ్చాప్‌లో ఉందని తెలుస్తోంది. గతంలో జీహెచ్ఎంసీలో పని చేసిన పురు షోత్తంరెడ్డి ప్రమోషన్‌పై హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా వచ్చారు. కాగా, ఇందులో రెండు పోస్టులుండగా.. రెండో పోస్టును ఎంపిక చేసుకున్నాడని తెలుస్తోంది. దీంట్లో రియల్ ఎస్టేట్, వెంచర్లకు పర్మిషన్ ఇచ్చే పోస్టు కావడంతో సహజంగానే పురు షోత్తంరెడ్డి పెద్దలతో పరిచయాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

2009లో పురు షోత్తంరెడ్డిని ఏసీబీ అరెస్టు చేసింది. దీంతో 2010 నుంచి 2017 వరకూ ఉన్న అక్రమాస్తుల వివరాలపైనే దర్యాప్తు కొనసాగుతుందని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే పురుషోత్తంరెడ్డి బినామీలుగా వ్యవహరిస్తున్న ఇద్దరినీ ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇంకెంతమంది బినామీలు ఉన్నారన్నదానిపై ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు పురుషోత్తంరెడ్డికి సంబంధించిన బంధువుల ఇళ్లల్లో ఏసీబీ సోదాలు కొనసాగుతూనే వున్నాయి. ప్రధానంగా పురుషోత్తంరెడ్డి వెనక ఉంది ఎవరు? ఎంతమంది బినామీలు ఉన్నారు? వారికి.. పురుషోత్తంరెడ్డికి ఉన్న సంబం ధాలు ఇత్యాది విషయాలపై ఏసీబీ సీరియస్‌గా దృష్టిపెట్టింది. కాగా, పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులన్నీ రియల్‌ఎస్టేట్, వెంచర్ల పర్మిషన్లతో పాటు వాటిలో పెట్టుబడుల ద్వారా ఆర్జించి ఉండవచ్చని ఏసీబీ భావిస్తోంది.

మంచిర్యాల విల్లాల్లో బిజినెస్ చేయడం ద్వారా దాదాపు రూ.100 కోట్ల అక్రమార్జనకు పురుషోత్తంరెడ్డి యత్నిం చాడని సమాచారం. ఇలా అవకాశం ఉన్న అన్ని చోట్లా అందినకాడికి పురు షోత్తంరెడ్డి చక్కబెట్టుకున్నాడని ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇందుకు తనకు నమ్మకస్తులైన వారిని బినా మీలుగా పెట్టుకున్నారని కూడా ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెలుగుచూసినట్లు తెలుస్తోంది. ఏసీబీ అధి కారులు దాడులు నిర్వ హిస్తారన్న ముందస్తు సమా చారంతో ఏసీబీ అధికారులు బం జారా హిల్స్‌లోని సాగర్ సొసైటీలో తన ఇంటికి చేరుకోకమునుపే పురుషోత్తంరెడ్డి కుటుంబంతో సహా పారిపోయారు. అయితే, దాడులు జరుగుతాయని పురుషోత్తంరెడ్డికి ఉప్పందించిన వారెవరు? అన్నదానిపై ఏసీబీ ప్రధానంగా దృష్టిసారించింది. పురుషోత్తంరెడ్డితో పాటు అతడి బావ శ్రీనివాసరెడ్డి కూడా పరారీలో ఉన్నారు. శ్రీనివాసరెడ్డి పురుషోత్తంరెడ్డి బినామీగా ఉన్నాడని ఏసీబీ అధికారులు అను మాని స్తున్నారు. ఏసీబీ సోదాల నిర్వహణలో మూసాపేటలో రూ.3.27 కోట్ల విలువ చేసే త్రీస్టోర్డ్ బిల్డింగ్, అమీర్‌పేటలోని ఫోర్‌స్టోర్ బిల్డింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌లో షేర్లు, గండిపేటలో 500 చదరపు గజాల ప్లాట్, షామీర్‌పేటలో 0.25 ఎకరాల వ్యవ సాయ స్థలం తదితరాలను ఏసీబీ గుర్తించింది. డాక్యుమెంటరీ వాల్యూ ప్రకారం వాటి విలువ రూ.5.35 కోట్లు కాగా, మార్కెట్ వాల్యూ రూ.25 కోట్లు ఉండవచ్చని ఏసీబీ అదికారులు స్పష్టం చేశారు. తదనంతరం ఏసీబీ అధికారుల సోదాల్లో మరిన్ని డాక్యుమెంట్లు విదేశాల్లో షాపింగ్, నగదు తదితరాలు బయటపడ్డాయి.

ఇప్పటివరకూ ఏసీబీ అధికారులు పురు షోత్తం రెడ్డికి సంబంధించి రూ.50 కోట్ల ఆస్తులను గుర్తించారు. కాగా, తాజాగా ఆయన ఆస్తులు దాదాపు రూ.300 కోట్లకు పైనే ఉండవచ్చని తెలుస్తోంది. ప్రధానంగా రియల్‌ఎస్టేట్, వెంచర్స్ ద్వారా పెద్ద మొత్తంలో పురుషోత్తంరెడ్డి అక్రమార్జనకు పాల్పడ్డాడని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. తవ్విన కొద్దీ పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులు వెలు గు చూ స్తుండటంతో ఈడీ, ఐటీ అధికారులు సైతం పురు షోత్తంరెడ్డి అక్రమాస్తులపై దృష్టి సారించినట్లు సమా చారం. అయితే, పురుషోత్తంరెడ్డికి ప్రధాన బినామీగా వ్యవహరిస్తున్న శ్రీనివాసరెడ్డి ఆచూకీ లభ్యమైతే పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఏసీబీ అధి కారులు చెబుతున్నారు.

మందుపాతర పేలి జవాను మృతి


చర్ల, ప్రభన్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండల సరిహద్దులో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేల డంతో ఛత్తీస్‌గఢ్‌లో ని రిజర్వ్ గార్డు దళానికి చెందిన జవాన్ సచిన్‌హేమ్ల(36) అనే జవాన్ మృతిచెందాడు. చర్ల మండలం తిప్పాపురం గ్రామం నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పామేడుకు రూ. 5 కోట్లతో అక్కడి ఆర్ అండ్ బి అధికారులు నూతనంగా రహదారిని నిర్మిస్తున్నారు. పనులు జరిగేది పూర్తి అటవీ పాంతం, మావోయిస్టులకు గట్టిపట్టు ఉన్న ప్రాంతం కావడంతో రహదారి భద్రతకు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో తోగ్గూడెం గ్రామం సమీపంలోని దట్టమయిన అటవీపాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు బేస్‌క్యాంపు ఏర్పాటు చేసి రహదారి పనులు చేయిస్తున్నారు. తమకు గట్టిపట్టు ఉన్న ప్రాంతంలో పోలీసులు బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడంతో ఆగ్రహంగా ఉన్న మావోయిస్టులు వారం రోజులుగా క్యాంపుపై దాడికి విఫలయత్నం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆది వారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సాయుధ పోలీసులు సమీపంలోని అట వీప్రాంతం, చర్ల మండల పరధిలోని అడవుల్లో కూంబింగ్ నిర్వహించేందుకు కాలినడకన బయలుదేరారు. బేస్‌క్యాంపు నుండి సుమారు రెండు వందల మీటర్ల దూరం వచ్చే సరికి కాలిబాట మార్గంలో మావోయిస్టులు పెద్దకర్రను అడ్డంగా పెట్టి మందుపాతరను అమర్చారు. దీనిని గమనించని సచిన్‌హేమ్ల కర్రదుంగను దాటి మందుపాతరపై కాలువేయడంతో భారీ శబ్దంతో పేలిపోవడంతో సచిన్ శరీర బాగాలు తెగిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మావోయిస్టులు పొంచి ఉండి మందుపాతర పేల్చిఉంటారనే అనుమానంతో అప్రమత్తమయిన పోలీసులు వెంటనే కాల్పులకు దిగారు. సుమారు 15 నిముషాల పాటు కాల్పులు జరిగినట్లు సమాచారం. అనంతరం మృతదేహాన్ని బేస్‌క్యాంపుకు తరలించి రోడ్డుమార్గం గుండా అంబులెన్స్‌లో అతని స్వస్థలం బీజపూర్ కు తరలించారు. సచిన్ కు భార్య, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిట్యాల, ప్రభ న్యూస్ : నల్గొండ జిల్లా, చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో టీజేఏసీకి చెందిన వాహనం ఆదివారం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆరెగూడెం గ్రామానికి చెందిన లడె మహేష్, చిన్నూరి మధు ద్విచక్రవాహనంపై వెలిమినేడు నుంచి ఆరెగూడెం గ్రామానికి వస్తుండగా వెనుక నుంచి టీజేఏసీకి చెందిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్, మధులకు తీవ్ర గాయాలుకావడంతో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఢీకొట్టిన వాహనం అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట


- నిఘాతో రూ.500 కోట్ల అక్రమాలను నియంత్రించాం
- పౌరసరఫరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సక్సెస్
- కమిషనర్ సీ.వి. ఆనంద్



హెదరాబాద్, ఆంధ్రప్రభ : పౌరసరఫరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రయోగం విజయవంతమైందని కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ కారణంగా రేషన్ సరుకుల అక్రమాలకు అడ్డుకట్ట పడిందన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘాను కట్టుదిట్టం చేశామని, నిరంతరం తనిఖీలు కొనసాగించామని వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అవినీతిని నిరోధించడానికి, అక్రమాలకు అడ్డుకట్టవేయడానికి, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్ల ఆగడాలు అరికట్టడానికి, నాణ్యత విషయంలో రాజీపడకుంగా చూడడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి సానుకూల ఫలితాలను రాబట్టామని సి.వి. ఆనంద్ తెలిపారు. ఏడాది కాలంలోనే 843 ప్రాంతాల్లో తనిఖీలు, దాడులు నిర్వహించి 71 క్రిమినల్ కేసులు, 165 మందిపై 6ఏ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిర్వహణకు ఏడాది కాలంలో రూ. 1.25 కోట్లు ఖర్చు కాగా, పౌరసరఫరాల శాఖకు సంబంధించి దాదాపు రూ. 500 కోట్ల మేరకు అక్రమాలను నియంత్రించామని తెలియచేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో నిజాయితీ, నిబద్ధత, పని సామర్థ్యం, ఉద్యోగుల గత చరిత్రను ప్రామాణికంగా తీసుకొని పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ చేసిన వారిని కాంట్రాక్టు పద్ధతిన నియమించడం జరిగిందని సి.వి. ఆనంద్ తెలియచేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు, దాడులు నిర్వహించి రూ. 3.60 కోట్ల విలువ చేసే 12,915 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 2,619 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని, అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3.90 లక్షల విలువగల చక్కెర, ఎల్‌పిజీ సిలిండర్లు, కిరోసిన్‌ను స్వాధీనం చేసుకున్నారని సి.వి. ఆనంద్ వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో రూ. 6.39 కోట్ల మేరకు అక్రమాలను, తరుగును నివారించామన్నారు. దాదాపు 144 మండల స్థాయి నిల్వ కేంద్రాలు, 78 రేషన్ దుకాణాలు, 17 ఎల్‌పిజి ఔట్‌లెట్లు, 8 పెట్రోల్ బంకులు, 117 హస్టళ్లు, రెసిడెన్సియల్ స్కూళ్లు తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాహనాలు, రైళ్లు, ఇతర మార్గాల ద్వారా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వారిని కూడా నిఘా వర్గాలు అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో తరచుగా బియ్యం ఆక్రమాలకు పాల్పడుతున్న వారిపై పీడీ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో నిఘాను కట్టుదిట్టం చేయడంతో బియ్యం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందన్నారు. మిల్లర్ల నుండి రావలసిన సీఎంఆర్‌ను కూడా పూర్తి స్దాయిలో రాబట్టగలుతున్నామని సి.వి. ఆనంద్ తెలిపారు.

మరో ఉద్యమానికి శ్రీకారం

ఏపీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు



శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్‌ను 14 శాతం నుంచి 20 శాతానికి పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నెరవేరుస్తూ ఇటీవల అందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా విడుదల చేసినందుకుగాను జిల్లా ఎన్‌జిఒల సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రజాప్రతినిధుల సత్కారసభ ఆదివారం సాయంత్రం స్థానిక బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ బాబు మాట్లాడుతూ, ఉద్యోగులు తమ సమస్యలపైనే కాకుండా వ్యవస్థపై కూడా పోరాడాల్సివుంటుందని, సమైక్యాంధ్ర ఉద్యమం మాదిరిగానే మరో ఉద్యమానికి త్వరలో శ్రీకారం చుడతామని అన్నారు. విభజన తరువాత కేంద్రం నిధులు కేటాయించడంలో చేస్తున్న అలసత్వంపై కేంద్రాన్ని తప్పకుండా ప్రశ్నిస్తామని, రాజకీయ వ్యవస్థ విఫలమైతే తామే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఉద్యోగులు సిపిఎస్‌పైనే కాకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ఉద్యమించినప్పుడే ఏ పోరాటానికైనా గుర్తింపు ఉంటుందన్నారు. మానవతా దృక్పథంతో ఉద్యోగుల డిమాండ్లు ఉన్నప్పుడే ప్రజల మద్దతు కూడా లభిస్తుందన్నారు. హెచ్ఆర్ఏ పెంపుతో రాష్ట్ర ఖజానాకు భారం అయనప్పటికీ ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను తప్పలేదన్నారు. హెచ్ఆర్ఎ, పిఆర్‌సి వంటి సమస్యలపైనే కాకుండా కొన్ని సామాజిక సమస్యలపైన కూడా ఉద్యోగులు స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. పెరిగిన అద్దె భత్యంలో ఎంతో కొంత సమాజసేవకు ఉపయోగిస్తే ప్రజల మన్ననలు కూడా ఉద్యోగులు అందుకుంటారని అన్నారు.

నిరంతర పోరాటాలతోనే విజయాలు సాధ్యమని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సమస్యలపై ఎప్పటికప్పుడు గళం వినిపిస్తున్నామని తెలిపారు. సిపిఎస్‌పై మరింతగా పోరాడనున్నామని చెప్పారు. శుక్రవారం చేపట్టిన ధర్నాకు విశేష స్పందన లభించిందని, తమ సమస్యల పరిష్కారం విష యంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, జడ్‌పి ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, శ్రీకాకుళం ఎంఎల్ఎ గుండ లక్ష్మీదేవిలను ఉద్యోగసంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కా ర్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షులు రవిశంకర్, డివి రమణ తదితరులు పాల్గొన్నారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

కొనసాగుతున్న పాతనోట్ల లెక్కింపు

న్యూఢిల్లీ: కేంద్ర రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేసి 15నెలలు గడుస్తున్నా ఆయా బ్యాంకుల నుంచి ఆర్బీఐకు పాతనోట్లు ఇంకా వస్తూనే ఉన్నాయని ఆర్బీఐ అధికారులు తెలి పారు. ఖచ్చిత సంఖ్య కోసం లెక్కింపు వేగ వంతం చేశామని ఆర్బీ ఐ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ప్రక్రియ పూర్తవగానే వివ రాలు వెల్లడిస్తామన్నా రు. సమాచార హక్కు నిమిత్తం వచ్చిన దరఖా స్తును ఉద్దేశించి ఈ వివరాలను అధికారులు వెల్ల డించారు. బ్యాంక్ నోట్లను ప్రత్యేకిస్తే తమ అంచనా ప్రకారం జూన్ 30,2017నాటికి రూ.15.28 ట్రిలి యన్స్ (లక్ష కోట్లు) ఉండొచ్చని అయితే ఈసంఖ్య మారవచ్చన్నారు. ప్రస్తుతానికి 59 సీవీపీఎస్ (కరె న్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్) మెషన్లను లె క్కింపు కోసం వినియోగిస్తున్నామని అన్నారు. వీ టితోపాటు కమర్షియల్ బ్యాంకులకు చెందిన 8సీవీ పీఎస్ మెషిన్లను సైతం వినియోగిస్తున్నాం అన్నా రు. అంతేకాక ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో అద్దె ప్రాతిపదికన 7సీవీపీఎస్ మెషిన్లను ఉపయో గిస్తున్నాం అన్నారు.



రూ.82వేల కోట్ల
రుణాలు రద్దు

● ఎస్‌బీఐ వాటా 20,339 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ 2016-17 ఆర్థికసంవత్సరానికి రూ.20,339 కోట్ల మొండి బకాయిలను రద్దు చేసింది. అదే ఆర్థికసంవత్సరానికి అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు(పీఎస్‌బీలు)సమష్టిగా రద్దు చేసిన మొండి బకాయిల విలువ రూ.81,683 కోట్లు. ఈ డేటా ఎస్‌బీఐ అనుబంధ బ్యాం కులు దానితో విలీనం కాని కాలంనాటిది. అదే 2012-13 ఆర్థిక సంవత్సరానికి పీఎస్‌బీలు రూ.27,231 కోట్ల బకాయిలను రద్దు చేశాయని ప్రభుత్వ డేటా చెబుతు న్నది. ఐదేళ్ళ కాలంలో బకాయిల రద్దు దాదాపు మూడింతలు పెరిగింది. పీఎస్‌బీ లు రద్దు చేసిన బకాయిలు వరుసగా 2013-14లో రూ.34,409 కోట్లు, 2014- 15లో రూ.49,018 కోట్లు, 2015-16లో రూ.57,585 కోట్లు, 2016-17 ఆర్థికసం వత్సరానికి రూ.81,683 కోట్లుగా ఉంది. 2016-17లో ఎస్‌బీఐ బాటలో బకా యిల రద్దు చేసిన బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్(రూ.9,205 కోట్లు), బ్యాం క్ ఆఫ్ ఇండియా(రూ.7,346 కోట్లు),కెనరా బ్యాంక్(రూ.5,545 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా(రూ.4,348 కోట్లు) ఉన్నాయి. పీఎస్‌బీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ భాగంలో రూ.53,625 కోట్ల విలువైన బకాయిలను రద్దు చేశాయి. రిజర్వ్ బ్యాంక్ నుంచి అందిన డేటా ప్రకారం 2017, సెప్టెంబర్ 30 నాటికి మొత్తం 21 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తొమ్మిది బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తి నిష్పత్తి 15 శాతానికి పైగా ఉంది. ఇది మొత్తం బకాయిల్లో మొండి బకాయిల శాతం. 14 బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తి నిష్పత్తి 12 శాతానికిపైగా ఉంది. పీఎస్‌బీలు నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) లేదా మొండి బకాయిల భారాన్ని మోస్తున్న కారణంగా ఆర్థిక రంగం తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నది. ప్రభుత్వం పీఎస్‌బీలకు వచ్చే రెం డేళ్ళలో రూ.2.11 లక్షల కోట్ల మూలధన జోడింపు ప్రణాళికను ఆవిష్కరించింది. అందులో బాండ్‌లను కూడా చేర్చింది.




విదేశీ రుణ నిర్వహణ
ఆర్‌బీఐకొద్దు

● స్వతంత్ర రుణ వ్యవస్థ కార్యాలయంపై నీతి ఆయోగ్ పట్టు

● విదేశీ రుణాలపై వడ్డీ చెల్లింపులు రూ.5.75లక్షల కోట్లు

● ఆర్బీఐని తప్పించాలని డిమాండ్



న్యూఢిల్లీ: విదేశీ రుణాలపై భారీ మొత్తంలో వడ్డీ చెల్లింపునకు అడ్డుకట్ట వేయాలని నీతీఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్ గట్టి పట్టుపడుతున్నారు. దీని కోసం స్వతంత్రంగా డెబిట్ మేనేజన్‌మెంట్ కార్యాల యం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచిసు న్నారు. దీంతో విదేశాల నుంచి తీసుకున్న రుణాలపై పెద్దమొత్తంలో చెల్లించే వడ్డీని కొంత వరకు ఆదా చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్ర భుత్వానికి కావాల్సిన రుణాలను.. వాటిలో మార్కె ట్ నుంచి రుణాలు కావాల్సి వచ్చినా వీటిని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ పద్ధతికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్న మైందన్నారు. ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూలో పెద్ద మొత్తంలో రుణాలకు వడ్డీ చెల్లించడానికి వ్యయం చేయాల్సి వస్తోందని, వడ్డీల భారాన్ని తగ్గించుకోవ డానికి ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తే వడ్డీ చెల్లింపును గణనీయంగా తగ్గించుకోవచ్చునని కుమార్ పిటిఐ తో మాట్లాడుతూ చెప్పారు. ప్రస్తుతం భారత్ అప్పు లు స్థూలదేశీయోత్పత్తి లేదా జీడీపీలో 18 శాతం వర కు విదేశీ రుణాలున్నాయని నీతిఆయోగ్ వైస్ చైర్మన్ వివరించారు. దీనికి కారణం రిజర్వుబ్యాంకు వీటిని నిర్వహిస్తోందని ఆర్‌బీఐ తన విధులను సక్రమంగా నిర్వహించడం లేదని స్వప్రయోజనాలకు వినియో గించుకోవడం వల్ల దేశానికి వడ్డీలభారం పెరుగు తోందని కుమార్ వివరించారు. ప్రభుత్వ డెబిట్ మా ర్కెట్ నిర్వహించడానికి బయటి వారిని తీసుకుంటే విదేశీ మారకద్రవ్యం పెద్దమొత్తంలో వస్తుంది. అదే సమయంలో దీన్ని నిర్వహించడం కూడా ఇబ్బం దికరంగా మారుతుంది. కాబట్టి డెబిట్ మార్కెట్‌ను నిర్వహించడానికి దేశానికి చెందిన కొద్ది మందికి అప్ప జెప్పితే మంచిదని.. ప్రభుత్వం వీలైనంత త్వర లోనే దీనిపై ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాల నికుమార్ పట్టుబడుతున్నారు. భారత్ ఆర్థికంగా శర వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. వ చ్చే ఆర్థిక సంవత్సరం అంటే 2018-19లో దేశ ఆర్థిక వ్యవస్థ 7.5 శాతం కంటే ఎక్కువ నమోదయ్యే అవ కాశాలున్నాయి.అదే 2019-20 ఆర్థికసం వత్సరం లో వృద్ధిరేటు 8 శాతానికి చేరుకుంటుందని కుమార్ చెప్పారు.భారత్ విదేశీ రుణాలు మార్చి 2018 నాటికి రూ.66.68 లక్షల కోట్లకు చేరుకోవచ్చునని అంచనా. మార్చి 2019 నాటికి ఇది కాస్తా రూ.72.51 లక్షల కోట్లకు చేరుతుందని బడ్జెట్ డాక్యుమెంటు చెబు తోంది. విదేశాల నుంచి తీసుకొచ్చిన రుణాలపై ప్రభు త్వం 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.5.3 లక్షల వడ్డీని చెల్లిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో రూ.5.75 లక్షల కోట్లు చెల్లిస్తుందని అంచనా. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 2015 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పబ్లిక్ డెబిట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (పీడీఎంఏ) తీసుకురావాలని ప్రతిపాదన చేశారు. పీడీఎంను తీసుకురావడానికి అ నేక కారణం డెబిట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను నిర్వ హించడంలో ఆర్‌బీఐ తన సొంత ప్రయోజనాలను చూసుకుంటోందని తెలిపింది. దేశంలో కీలకవ డ్డీరేట్లు రెపో రేటును నిర్ణయించేది ఆర్‌బీఐ.. అదే సమ యంలో ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయడం విక్ర యించడం కూడా ఆర్‌బీఐ చేస్తోంది. ప్రస్తుతం పరి స్థితి ఎలా ఉందంటే కౌలుదార్లకు పంట రుణాలతో పాటు కనీస మద్దతు ధరలాంటి లబ్ధి పొంద లేకపో తున్నారని కుమార్ అన్నారు. వచ్చే మూడు నెలల్లో నీతి ఆయోగ్ రాష్ట్రప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి కౌలుదార్లకు బ్యాంకు రుణాలతో పాటు .. భూమి యజమానుల హక్కుల్లో ఎలాంటి రాజీ లేకుండా కౌలుదార్లకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం

● ఈ వారం మార్కెట్ ● శివరాత్రి సందర్భంగా సెలవు



న్యూఢిల్లీ : నేటి నుంచి ప్రారం భం కానున్న స్టాక్ మార్కెట్లను ప్ర భావితం చేయనున్న అంశాల విష యానికి వస్తే.. గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలు, పారిశ్రామికో త్పత్తి గణాంకాలు, ద్రవ్యోల్బణం గ ణాంకాలు ప్రభావితం చేయనున్నా యని మార్కెట్ నిపుణులు చెబుతు న్నారు. మంగళవారం శివరాత్రి సందర్భంగా మార్కెట్లకు సెలవు. గత వారం కూడా బీఎస్ఈ ఏకంగా 1,060.99 పాయిట్లు లేదా 3.2 శాతం క్షీణించింది. ప్రభుత్వం బడ్జెట్‌లో ఈక్విటీపై దీర్ఘకాలిక మూలధనం లాభాల పన్ను విధించడంతో పాటు గ్లోబల్ మార్కెట్లో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మార్కెట్లకు కుప్పకూలాయి. ప్రస్తుతం కార్పొ రేట్ ఫలితాల సీజన్ కొనసాగుతోంది. కంపెనీ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో ఇన్వెస్టర్లకు కాస్తా ఉపశమనం కలుగుతుంది. అయితే ద్రవ్యోల్బణం, ద్రవ్య లోటు, రిజర్వుబ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోయే అవకాశాలు లేనందు వల్ల ఈ అంశాలు మార్కెట్ జోరుకు అడ్డుకట్ట వేసే అవకాశాలున్నాయి. గత వారం జరి గిన పరపతి సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను యథాతథంగా 6 శాతంగా కొనసాగిం చడానికి నిర్ణయించింది. ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో ద్రవ్యో ల్బణం పెరిగేఅవకాశాలున్నాయి. దీంతో పాటు ద్రవ్యలోటు కూడా పెరుగు తుందని ఆర్‌బీఐ హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లో ఒడిదుడుకులు కూడా మా ర్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. మొత్తానికి ఈ వారంలో డిసెంబర్ ఐఐపీ, జన వరి రిటైల్ ద్రవ్యోల్బణం, టోకు ద్రవ్యోల్బణం కలిసి మార్కెట్లను శాసించ నున్నాయి. అలాగే ఈ వారంలోనే అతి పెద్ద కంపెనీలు గెయిల్, ఎన్‌హెచ్‌పీసీలు క్యూ3 ఫలితాలు ప్రకటించబోతున్నాయి. గత శుక్ర, శనివారాల్లో ఎస్‌బీఐ, కోల్ ఇండియాలు ఆర్థిక ఫలితాలు విడుదల చేశాయి. వాటి ప్రభావం కూడా మా ర్కెట్లపై ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లు గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలపై స్పందిస్తున్నాయి. ఇదే వరుస రాబోయే మరికొన్ని కొన్ని రోజుల పాటు ఉం టుందని నిపుణులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో రీ మాక్స్ కలెక్షన్

హైదరాబాద్: మల్టీ బిలియన్ డాలర్ల రియల్ ఎస్టేట్ నెట్‌వర్కుతో పాటు లైఫ్ స్టయిల్ కంపెనీ రీ/మాక్స్ ఇండియా ఫ్రాంచైజీ ఇండియాతో కంపెనీతో భాగస్వామ్యం చేపట్టింది. కొత్తగా ది రీ/మాక్స్ కలెక్షన్ ఇండియవూను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది. ప్రీమియం హోం సెగ్మెంట్.. వాణిజ్య, గృహాలకు అద్దెకు లీజింగ్ సేవలందిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.300 కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తందని కంపెనీ సీఓఓ యతిన్ శర్మ చెప్పారు.

కుబేరుల నగరం ముంబై

● గ్లోబల్ సంపన్న దేశాలలో 12వ స్థానం ● మొత్తం సంపద 95,000కోట్ల డాలర్లు ● అగ్రస్థానంలో న్యూయార్కు ● న్యూవరల్డ్ వెల్త్ నివేదిక



ముంబై : ప్రపంచంలోని అత్యంత సంపన్న నగరా ల్లో భారత్ ఆర్థిక రాజధాని నగరం ముంబై 12 స్థానాన్ని ద క్కించుకుంది. ఈ నగరం మొత్తం సంపద విలువ 95, 000 కోట్ల డాలర్లు. భారత కరెన్సీ ప్రకారం లెక్కగడితే రూ .61,75,000 కోట్లుగా తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 15 సంపన్న నగరాల్లో న్యూయార్కు అగ్రస్థానంలో ఉం ది. న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక ప్రకారం చూస్తే .. ముంబై 12 వ స్థానంలో ఉంటే దాని తర్వాత స్థానం టోరంటో 94, 400కోట్ల డాలర్లతో 13వ స్థానం, ఫ్రాంక్‌ఫర్ట్ 91,200 కోట్ల డాలర్లతో 14వ స్థానం, ప్యారిస్ 86,000 కోట్ల డాలర్లతో 15వ స్థానం ఆక్రమించాయి. పైన తెలిపిన నగరాల్లో ప్రైవే ట్ వ్యక్తుల మొత్తం సంపద కలుపుకొని ఈ జాబితాను రూపుదిద్దారు. (స్థిరాస్తులు, నగదు, ఈక్విటి, వివిధ రకాల వ్యాపా రాల)లను పరిగ ణనలోకి తీసుకుని.. వాటి నుంచి అప్పు లు తీసేసిన తర్వాత నికర సంపదను ఇంతని లెక్క గట్టా రు. అయితే ఈసం పదలో ప్ర భు త్వా ని కి చెం ది న ఆస్తులు కానీ నగదును కానీ లెక్కలోకి తీసుకోలేదు. బిలి యనీర్ల విషయానికి వస్తే ముం బై పదవ స్థానం ఆక్రమించంది. ముంబై నగరంలో మొత్తం 28 మంది బిలియనీర్లున్నారు. బిలియనీర్ అంటే నికరంగా ఒక బిలియన్ లేదా రూ.6,500 కోట్ల ఆస్తులుండాలి.

ముంబై నగరం మొత్తం సంపద 95,000 కోట్ల డాలర్లు అయితే... బాంబే స్టాక్ ఎక్స్చేంజీ (బీఎస్ఈ) ప్రపంచంలోనే అతి పెద్ద స్టాక్ ఎక్స్చేంజీల్లో 12వ స్థానాన్ని ఆక్రమించింది. ముంబై నగరంలో అతి పెద్ద పరిశ్రమలతో పాటు ఆర్థిక సర్వీసులు, రియల్ ఎస్టేట్, పెద్ద పెద్ద మీడియా సంస్థలున్నాయి. సం పద సృష్టించడంలో వచ్చే పదేళ్లలో ముంబై శరవేగంగా దూసుకుపోతుందని తెలిపింది. ప్రపంచంలోని టాప్ 15 సంపన్న దేశాల్లో న్యూయార్కు అగ్రస్థానంలో ఉంది. ఈ నగ రం సంపద 3,00,000 కోట్ల డాలర్లు. భారతీయ కరెన్సీ ప్రకారం లెక్కగడితే రూ.1,95,000 కోట్లుగా చెప్పు కోవచ్చు. ఈ నగరంలోనే ప్రపంచంలోనే అతి పెద్ద స్టాక్ ఎక్స్చేంజీ ఉంది. న్యూయార్కు చుట్టుపక్కల కనెక్టికట్‌తో పాటు లాంగ్ ఐలాండ్‌లున్నాయి. ఈ రెండు నగరాల్లో కూడా అపారమైన సంపద ఉంది అయితే వీటిని న్యూయా ర్కు నగరం సంపద పరిధిలోకి తీసుకోలేదని నివేదిక వివరించింది.

ఇక లండన్ విషయానికి వస్తే ఈ నగరం సంపద 270 లక్షల కోట్ల డాలర్లు, టోక్యో 250 లక్షల కోట్ల డాలర్లు, శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా 230 లక్షల కోట్ల డాలర్లు, ఇక మిగిలిన నగరాల విషయానికి వస్తే బీజింగ్ 220 లక్షల కోట్ల డాలర్లు, షాంఘై 200 లక్షల కోట్ల డాలర్లు, లాస్‌ఏంజిలెస్ 140 లక్షల కోట్ల దాలర్లు, హాంగ్‌కాంగ్ 130 లక్షల కోట్ల డాలర్లు, సిడ్నీ లక్షకోట్ల డాలర్లు, సింగపూర్ లక్షకోట్ల డాలర్లు, షికాగో 98,000 వేలకోట్ల డాలర్లు.మొత్తం 15 నగ రాల జాబి తాలో .. శాన్ ఫ్రాన్సిస్కో, బీ జింగ్, షాం ఘై, ముంబై, సిడ్నీలు వచ్చే పది సంవత్సరాల్లో శరవేగంగా సంప దను సృష్టిస్తాయని అంచనా వేసింది.

అయితే టాప్ 15 స్థానాల్లో దక్కించు కోవడం విఫ లమైన నగ రాలు ఇలా ఉన్నాయి. హ్యూస్టన్, జెనీవా, ఒసాకా, సియోల్, షాంజెన్, మెల్ బోర్న్, జురిచ్, డాలస్ నగరాలున్నాయని న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక వివరించింది.



అబుదాబీ చమురు క్షేత్రాల్లో...
ఓఎన్‌జీసీవిదేశ్ వాటాలు

● పెట్టుబడులు 600మిలియన్ డాలర్లు

● పది శాతం వాటాల కొనుగోలు



అబుదబి / న్యూఢిల్లీ : అబుదబిచమురు క్షేత్రంలో భారత్ కంపెనీలు పాగా వేయడం ఇదే మొదటిసారి. ప్రభుత్వరంగానికి చెందిన ఓఎన్‌జీసీ విదేశీ లిమిటెడ్ అబుదబి చమురు క్షేత్రంలో పది శాతం వాటాను 600 మిలియన్ డాలర్లకు (రూ. 3,900)కోట్లకు కొనుగోలు చేసింది. ఓఎన్‌జీసీకి అనుబంధ సంస్థ వోవీఎల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్లు కలిసి మొత్తం 600 మిలియన్ డాలర్లు అబుదబి నేషనల్ ఆయిల్ కంపెనీకి చెల్లిం చాయి. ఈ కాంట్రాక్టు 40 సంవత్సరాల పాటు అమల్లో ఉం టుంది. ప్రస్తుతం ఈ చమురు క్షేత్రంలో రోజుకు 4 లక్షల పీపాల ముడి చము రు ఉత్పత్తి జరుగుతోందని తెలిపింది. భారతీయ కన్సార్టియం వార్షిక వాటా ఈ చమురు క్షేత్రంలో రెండు మిలియన్ టన్నుల వరకు ఉంటుందని ఓవీల్ ఒక ప్రకటనలో వివరించింది. ఈ చమురు క్షేత్రాల నుంచి రోజుకు 450,000 పీపాలను రోజుకు ఉత్పత్తి చేస్తామని ఒవీఎల్ పేర్కొంది. ఈ కాంట్రాక్టుపై శనివారంసాయంత్రం అబుదబి క్రౌన్ ప్రిన్స్ షేక్ మహ్మద్ బిన్ జాయెడ్ అల్ నహేన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీల సమక్షంలో ఒస్పందాలపై సంత కాలు జరిగాయి.మొట్టమొదటి సారి భారత్‌కు చెందిన కంపెనీ అబుదబిలో కంపెనీల వాటాలు దక్కించుకోవడం ఇదే మొదటిసారి. ఈ ఒప్పందం మార్చి 9, 2018 నుంచి అమల్లో ఉంటుంది. దీని కాలపరిమితి 40 సంవత్స రాల కాలం పాటు ఉంటుంది. ఒఎన్‌జీసీ గ్రూపు చైర్మన్ శశిశంకర్, ఎడి ఎన్ ఓసీ గ్రూపు చీఫ్ఎగ్జిక్యూటివ్ అహ్మద్ అల్‌జబేర్‌లో ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇదిలా ఉండగా అబుదబి చమురు క్షేత్రంలో ఎడిఎన్‌ఓసీకి మొత్తం 40 శాతం వాటా ఉంది. వాటిలో భారత్‌కు చెందిన ఒఎన్‌జీసీ పది శాతం వాటా కొనుగోలు చేస్తే, మిగిలిన 30 శాతం వాటాలను అంతర్జాతీయ చమురు సహజ వాయువు కంపెనీలకు విక్రయించాలనే ఆలోచనలో ఉంది. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న డిమాండ్ తట్టుకోవడానికి ఈ ఒప్పందం అనుకూలంగా ఉంటుందని ఒఎన్‌జీసీ ప్రకటనలో వివరించింది.ఈ ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కూడా మెరుగుపడతాయని శంకర్ అన్నారు. ఇదిలా ఉండగా ఓవీఎల్ ఇండియా చేతిలో 18 దేశాల్లో మొత్తం 39 ప్రాజెక్టులు న్నాయి. వాటిలో అజర్‌బైజాన్, బంగ్లాదేశ్, బ్రెజిల్, కంబోడియా, ఖజికిస్తాన్, మొజాంబిక్, మయన్మార్, రష్యా, దక్షిణ సూడన్, సుడాన్, నమీబియా, వెనుజులా, వియత్నాం, న్యూజిలాండ్‌లున్నాయి. ఈ చమురు క్షేత్రాల నుంచి ఒఎన్‌జీసీ విశేష్ రోజుకు 277,000 పీపాల ముడిచమురు ఉత్పత్తి చేస్తోంది. దీంతో పాటు రోజుకు 704 మిలియన్ టన్నుల స్థాయిలో సహజవాయువును ఉత్పత్తి చేస్తోంది.

ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు రెండంకెలకు


ఆటో ఎక్స్‌పో హుందాయ్ వద్ద సందడి

న్యూఢిల్లీ : రాబోయే రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) అమ్మకాల జోరందుకుంటాయి. ప్రభుత్వం కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ఇప్పటి నుంచే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంతో పాటు బ్యాటరీ ధరలను తగ్గించడానికి గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీంతో 2020 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు రెండంకెల్లో వృద్ధి ఉంటుందని అసోచామ్, గ్లోబల్ అడ్వయిజరీ సర్వస్ యెర్నస్ట్ యంగ్ తాజా నిర్వహించిన అధ్యయనం చేసి నివేదికను విడుదల చేసింది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో ఈవీల వాటా కేవలం ఒక శాతం కంటే తక్కువగా ఉందని తెలిపింది. ఈ రంగం జోరందుకోవాలంటే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపయాలను సమకూ ర్చాల్సి ఉంటుంది. ఉదాహరణకు చార్జింగ్ స్టేషన్లను వీలైనంత వేగంగా తీసుకురా వాల్సి ఉం టుం దని తెలిపింది. 2030 నాటికి దేశ వ్యా ప్తంగా రవాణా వ్యవస్థలో 40 శాతం ఈవీ లోకి తీసుకురా వాలనే ఆలోచనలో ప్రభు త్వం ఉంది. అయితే దీనికి సంబంధిం చిన నియం త్రణా సంస్థను తేవాలని అసో చామ్ నివేదిక సూచించింది. ఇక ఆటో మొబైల్ కంపెనీలు ఈవీ విధానంపై ప్రభు త్వం స్పష్టత ఇవ్వాలని. దీంతో పాటు రీసెర్చి అండ్ డెవలెప్‌మెంట్‌పై రాయి తీలు ఇవ్వాలని కోరుతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభు త్వం ఆర్ అండ్‌డిపై వ్యయంపై వెయిటేజీ టాక్స్ డిడక్షన్‌ను గతంలో 200 శాతం నుంచి150 శాతానికి తగ్గించింది. ఇదే సదు పాయాన్ని ఎలక్ట్రిక్ వాహనాల ఆర్అండ్‌డికి కూడా ఇవ్వా లని కోరుతున్నాయి. ప్రస్తుతం దేశంలో బ్యాటరీ రీసైక్లింగ్, సెకెండ్ యూసెజ్‌మార్కెట్లపై ఎలాంటి పాలసీ ఫ్రేం వర్కు లేదు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల లక్ష్యం చేరుకోవాలంటే పాత లిథియం, ఇయాన్ బ్యాటరీలకు సర్టిఫై చేస్తేనే ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తుందని అసోచామ్, ఈవై నివేదికలో వివరించింది. సంప్రదాయ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాల చాలా ఖరీదైనవిగా ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం వీలైనంత వరకు బ్యాటరీ ధరలను తగ్గించే ఆలోచన చేయాలని సూచించింది.


ప్రీమియం బైక్‌లు, స్కూటర్లపై యమహా ఫోకస్



జపాన్‌కు చెందిన ద్విచక్ర వాహన దిగ్గజం యమహాఏప్రిల్ 2020 నాటికి బీఎస్-6 ఉద్గార ప్రమాణా లను పాటించే ప్రీమి యం బైక్, స్కూట ర్లను భారత్ మార్కెట్లోకి తీసుకువ స్తుంది. ప్రస్తుతం దేశీయ మార్కె ట్లో 150 సీసీ ఫ్లస్ పె ా టా ర్ సై కి ల్ సెగ్మెంట్‌లో కంపెనీ వాటా 13 శాతంగా ఉంది. వచ్చే 3-4 సంవత్స రాల్లో ఈ వాటాను 20 శాతా నికి పెంచుకోవాల నే లక్ష్యం గా ముందుకు సాగు తున్న ట్లు కంపెనీ సీని యర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్ మార్కె టింగ్ రాయ్‌కురియన్ తె లిపా రు. బీఎస్-6 ప్రమాణాలు అం దుబాటులోకి వచ్చిన తర్వాత 100 సీసీబైక్ మార్కెట్లో కొంత స్తబ్ధత నెల కొంటుం దని, కొత్త ప్యూయెల్ ఇంజెక్షన్ టె క్నాలజీ వస్తుందని .. ఇది మంచి పరిణా మమని... కస్టమర్ 100 సీసీ బైక్‌ను 125 సీసీ లేదా 150 సీసీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలి లేదా స్కూటర్ సెగ్మె ంట్‌కు మారిపోవాల్సి వ స్తుందని ఆయన వివరించారు. ఇవన్నీ పరిగణనలోకి తీసు కున్న తర్వాత ఇక నుంచి భారత్ మార్కెట్ కోసం ప్రీమియం బైక్‌లు, స్కూటర్లపై దృ ష్టి పెట్టాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. దేశీ య మార్కెట్లో మొత్తం 19.5 మిలియన్ మోటార్ సైకిళ్లు విక్రయిస్తే. వాటిలో ప్రీమియం బైక్‌ల వాటా 3మిలి యన్‌లని, రోజు రోజుకు యమహా బ్రాండ్‌కు మంచి ఆదర ణ లభిస్తుందని వాటాను కూడా పెంచుకుంటున్నట్లు చెప్పా రు. ఇక స్కూటర్ సెగ్మెంట్‌లో కాస్తా ఆలస్యం ఎంట్రీ ఇచ్చా మని.. ప్రస్తుతం మార్కెట్లో మోటా ర్‌సైకిళ్లు.. స్కూటర్ల వాటా సరిస మానం గా ఉం దని ఆయన అన్నా రు. టైర్-1, టైర్-2 పట్టణాల్లో ప్రజలు 100 సీసీ బైక్‌ల నుంచి స్కూ టర్లకు మారుతు న్నా రని, బీఎస్6 ప్రమా ణాలు అ మల్లోకి వచ్చిన త ర్వాత ఇది మరింతరందు కుం టుందని కురియన్ అంచనా వేస్తు న్నారు.

గతే డా ది దేశీయ మా ర్కెట్లో 7. 5 లక్షల యూ నిట్లు విక్ర యించా మని.. ఈ ఏడాది 9.6 లక్షల యూ నిట్లు విక్రయిం చాలని లక్ష్యం గా పెట్టు కున్నామ న్నారు. ఈ ఏడాది 2.5 లక్షల యూనిట్లు ఎగుమతి చేస్తామని... గత ఏడాది 2.3 లక్షల యూనిట్లు ఎగుమతి చేశామని ఆయన వివరించారు.

రూ.20వేల కోట్ల టర్నోవర్‌కు పార్లే



న్యూఢిల్లీ: బిస్కెట్లు, కన్ఫెక్షనరీ తయారీ కం పనీ పార్లే ప్రొడక్ట్స్ వచ్చే ఐదేళ్లలో రూ. 20వేల కోట్ల టర్నో వర్ ను సాధి స్తుందని కంపెనీ హెడ్ మయాంక్‌షా చెప్పారు. ప్రస్తుతం కం పెనీ టర్నోవర్ రూ. 10వేల కోట్ల కంటే ఎక్కువగా ఉం దని ఆయన అన్నారు. త మ పోర్టుపోలియోను విస్తరిం చుకుంటూపోతోందన్నారు. ఇప్పటికే కంపెనీ స్నాక్స్ బేకరీ, ఐట మ్స్.. కేక్‌లు, రస్కలతో పాటు ప్రస్తుతం ప్రీమియం చాకొటెల్ సెగ్మెంట్‌లో కూడా ప్రవేశించిందన్నారు. ప్రస్తుతం కంపెనీ రిటైల్ మార్కెట్లతో పాటు హోటళ్లకు కూడా సరఫరా చేస్తోందని, కొత్త కొత్త బిస్క ట్లు జీరా జెఫ్స్ బిస్కట్స్‌ను ఆఫర్ చేస్తోందని కంపెనీ ప్రొడక్ట్ హెడ్ బి కృష్ణారావు చెప్పా రు.వచ్చే మూడేళ్లలో ప్లాటినా రేంజి ప్రీమియం ప్రొడక్ట్స్ వాటా 25 శాతం వరకు పెం చుకుంటామని షా చెప్పారు. ప్లాటిని బ్రాండ్స్ విషయానికి వస్తే హైడ్ అండ్ సీక్ మిలానో, మెక్సిటోస్, సింప్లిగుడ్ బిస్కెట్లున్నాయి.

వన్‌ప్లస్ స్టోర్ డాట్ బైబ్యాక్

హైదరాబాద్ : గ్లోబల్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కంపెనీ వన్ ఫ్లస్ అధికారిక బైబ్యాక్ ఈ-స్టోర్‌ప్లస్‌డాట్ ఇన్‌ను ప్రారంభించింది. వినియోగించిన స్మార్ఫోన్ల అమ్మకానికి సం బంధించి దేశంలో అతి పెద్ద, అత్యంత విశ్వసనీయ వేదిక క్యాషిఫీతో భాగస్వామ్యం చేప ట్టింది. దీని ద్వారా వినియోగదారుడు తాను వినియోగించిన స్మార్ట్‌ఫోన్‌ను అత్యా ధునిక వన్‌ఫ్లస్ స్మార్టఫోన్‌తో మార్చుకోవచ్చు. అత్యుత్తమ మార్పిడి విలువకు భరోసా కల్పిస్తుంది. 30 నగరాల్లో వినియోగదారులకు ఈ సేవలను అందిస్తోందని వన్‌ప్లస్ ఇం డియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ తెలిపారు.

జీతం తక్కువ... పనిభారం ఎక్కువ

108 బైక్ అంబులెన్సులకు బ్రేక్!

●డ్రైవింగ్‌లైసెన్సులు లేక మూలనపడ్డ బైకులు ●పూర్తిస్థాయి డ్రైవింగ్ రాని ఏఎన్ఎంలు ●రెండు పథకాలు గాడిలో పెట్టేందుకు అధికారుల కసరత్తు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : అత్యవసర సమయంలో ప్రమాదం బారిన పడిన వారిని ఆదుకునే విధంగా 108 బైక్ అంబులెన్సులు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ వీటిని నడిపే పైలట్‌లు (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఇఎంటీలకు జీతం తక్కువగా ఉండడంతో ఉద్యోగం చేయడానికి వారు ఆసక్తి చూపడం లేదు. ఈబైక్ అంబులెన్సు వాహనంపై పనిచేయడానికి బీఎస్సీ (లైఫ్ సైన్స్) లేదా బీఎస్సీ (నర్సింగ్) చేసిన విద్యార్థులు అర్హులు. వీరి నెల జీతం 9,300 రూపాయలు మాత్రమే. దీంతో పాటు 12 గంటల పాటు పనిచేయాల్సి రావడంతో వారు చదివిన చదువుకు ఇంత తక్కువ జీతం అన్న భావనలో విద్యార్థులు ఉన్నారు. కొందరు విద్యార్థులు శిక్షణలో ఉండగానే మానివేస్తుండగా మరి కొందరు ఉద్యోగంలో చేరిన రెండు,మూడు రోజుల్లోనే విధులకు రావడం లేదు. వీటితో పాటు ప్రాజెక్టు రెక్కల పేరుతో ఎఎన్ఎంలకు అందజేసిన వాహనాలను సైతం రోడ్డు ఎక్కడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎఎన్ఎంలలో చాలామందికి డ్రైవింగ్‌లైసెన్సు లేకపోవడంతో వీటిని బయటకు తీయవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ వాహనాలు రోడ్డు ఎక్కడం లేదని పలువురు పేర్కొంటున్నారు. జనవరిలో ప్రాజెక్టు రెక్కల పేరుతో ఎఎన్ఎంలకు బైక్‌లు, 108 కింద బైక్ సేవలు వీటితో పాటు 102 అమ్మ ఒడి వాహనాలను ప్రభుత్వం ప్రారం భించింది. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 600 వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. ఆదిలోనే వీటికి అడ్డంకులు ఏర్పడడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

దేశంలోనే తొలిసారిగా

ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు అత్యవసర చికిత్స అందుతున్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం బైక్ అంబులెన్సులను ప్రవేశపెట్టింది. ఈవాహనాలను ఎన్‌హెచ్ఆర్ఎం పథకం కింద సమకూర్చగా జీవీకే వీటికి సంబంధించి మెయింటనెన్స్ చూసుకుంటుంది. దేశంలోనే తొలిసారిగా బైక్ అంబులెన్స్‌లను తెలంగాణ ప్రభుత్వం ప్రవే శపెట్టింది.108 బైక్ అంబులెన్స్ (పెద్ద వాహనాలు) వెళ్లలేని పరిస్థితుల్లో ఈ బైక్ సేవలు ఉపయోగపడతాయని ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇక్కడ విజయవంతం అయితే విడతల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

ఐసీడీసీ ప్రాజెక్టు కింద 12 బైక్‌ల కేటాయింపు

ప్రస్తుతం 12 బైక్ అంబులెన్సులను ఐసీడీసీ ప్రాజెక్టు కింద నాలుగు జిల్లాలకు కేటాయించారు. అటవీ ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు వైద్యం అందించే ఉద్దేశ్యంతో వీటిని కేటాయించారు. అటవీ ప్రాంతాల్లో రోడ్డు మార్గం సరిగ్గా ఉండకపోవడంతో ఈ బైక్ అంబులెన్సులు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చాలావంది పైలట్లు అక్కడ పనిచేయడానికి జంకుతున్నారు. తక్కువ జీతం ఇచ్చినా కనీసం తమకు సొంతజిల్లాకు కేటాయించాలని కోరుతుండడంతో ఈ విషయమై ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. శ్రీశైలం వెళ్లే ఘాట్‌రోడ్డు రహదారిలో ఉన్న మన్ననూర్ చెక్‌పోస్టు దగ్గర ఉన్న మండలానికి 3 బైకులు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ అటవీ ప్రాంతానికి3 బైక్ అంబులెన్సులు, ఏటూరు నాగారానికి 3, భద్రాచలానికి 3 బైక్ అంబులెన్సులను కేటా యించారు.

> **మొదటగా హైదరాబాద్,**
> **రంగారెడ్డి జిల్లాల్లో 50 బైక్ అంబులెన్సులు**
>
> మొదటగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 50 బైక్ అంబులెన్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికోసం 50 మంది బీఎస్సీ చేసిన వారిని ఎంపిక చేసింది. బీఎస్సీ చేసిన విద్యార్థులను ఇప్పటికే నాలుగు బ్యాచ్‌లకు విడదీసి శిక్షణ ఇచ్చి వారిని పైలట్‌లుగా ఎంపికచేసింది. నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చే సమయంలో ఒక్కో అభ్యర్థి నుంచి జీవీకే రూ. 16 వేలు వసూలు చేసింది. ఈ బైక్ అంబులెన్సు సర్వీసులను ప్రారంభించిన తరువాత శిక్షణా ఖర్చులకు చెల్లించిన డబ్బు లను తిరిగి చెల్లించాలని పైలట్లు ససేమిరా అనడంతో 5వ బ్యాచ్ నుంచి డబ్బులను ప్రభుత్వమే భరిస్తామని తెలిపింది. దీంతో గతంలో శిక్షణ పొందిన పైల ట్‌లు ఈ విష యమై మొదట్లో ఆందోళన వ్యక్తం చే శారు. తాము శిక్షణ సమయంలో చెల్లించిన డబ్బు లను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వాహనాలను రోడ్డు ఎక్కలేదు. దీంతో ఆది లోనే హంసపాదులాగ బైక్ అంబులెన్సులకు బ్రేక్‌పడింది.

ప్రాథమిక వైద్యం అందించే ఉద్దేశ్యంతోనే...


మొదటగా మల్కాజిగిరి, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఈ బైక్ అంబులెన్సులను ప్రవేశపెట్టారు. ప్రాథమికవైద్యం అందించే ఉద్దేశ్యంతో వీటిని ప్రభుత్వం ప్రారంభించింది. అత్యవసర మందులతో పాటు చిన్నపాటి ఆక్సిజన్ సిలిండర్, అవసరమై మందులను మెడికల్ కిట్‌లో ఉంచారు. ఇందులో 54 రకాల మందులు అందుబాటులో ఉంటాయి.ప్రమాదం జరిగిన సందర్భంలో రక్తం పోతే గ్లూకోజ్ తగ్గకుండా వెంటనే ఐవీ ఫ్లూయిడ్‌ను అందిస్తారు. గాయం తీవ్రతను బట్టి ఇంజక్షన్లు ఇస్తారు. కృత్రిమంగా ఆక్సిజన్‌కు అందిస్తారు. శరీర ఉష్ణోగ్రతలు కొలిచే సాధనం, టించర్ ఆయింట్‌మెంట్స్ తదితర మెడికల్ కిట్‌లో ఉన్నాయి. దీనిని ఫస్ట్ రెస్పాండెన్స్ వాహనంగా కూడా పిలుస్తున్నారు.

ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ సేవలను ప్రజలకు మరింత చేరువచేయడానికి ప్రాజెక్టు రెక్కలు పేరుతో ఎఎన్ఎంలకు బైక్‌లను ఇప్పించింది. దీనివల్ల బాలింతలు మరియు శిశువును వారి ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రినుంచి ఇంటికి చేర్చడానికి తగిన రవాణా సౌకర్యాన్ని కూడా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వం ఆశించిన విధంగా వీరు తమ బైక్‌లను బయటకు తీయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లైసెన్స్ లేదన్న ఒక్క కారణంగా ఈ బైక్‌లు ముందుకుకదలడం లేదని ఎఎన్ఎంలు పేర్కొంటున్నారు.

> **ట్రాఫిక్ జామ్ అయినప్పుడు**
>
> ♦108నెంబర్‌కు ఫోన్ రాగానే అక్కడి ట్రాఫిక్‌తో పాటు క్షతగాత్రుడు ఉన్న ఏరియాను వెంటనే గుర్తిస్తారు. ఆ ప్రదేశానికి పెద్ద వాహనం వెళ్లలేకపోతే ఈ బైక్ అంబులెన్స్ వెళ్లి ప్రథమచికిత్స నిర్వహించి మెయిన్ రోడ్డుకు తరలించే విధంగా సహాయపడుతుంది. ♦ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 108 బైక్ సేవలు అందరికీ అందుబాటులో ఉంటాయి. ♦ఈ బైక్‌ను నడిపే వ్యక్తి బైక్ నడపడంలో శిక్షణ గల వ్యక్తినే ఎంచుకున్నారు. దాంతో పాటు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇ.ఎం.టీ)లో శిక్షణ పొందిన వ్యక్తినే ప్రభుత్వం ఎంపిక చేసింది. ♦నాలుగు చక్రాల వాహనం వెళ్లలేని గల్లీల్లో మరియు ట్రాఫిక్ జాం అయినప్పుడు ఈ బైక్ అంబులెన్స్‌ను ఎక్కువగా ఉపయోగించవచ్చు. ♦అత్యవసర వైద్య సేవలు మరింత విస్తృత పరచడానికి, సమయభావాన్ని తగ్గించి క్షతగాత్రులకు వెంటనే ప్రథమచికిత్స అందించేందుకు ఇవి దోహదపడతాయి.

10 వేల రూపాయాలు ఆర్థిక సాయంగా...

ప్రాజెక్టు రెక్కల కింద బైక్‌ను కొనే ఎఎన్ఎంలకు ప్రభుత్వం 10 వేల రూపాయాలను ఆర్థిక సాయంగా అందించింది. దీంతోపాటు బైక్‌లను అమ్మే కంపెనీ 5నుంచి 7 వేల వరకు బైక్ కొనుగోలులో సబ్సిడీ ఇచ్చింది. మిగతా డబ్బులను ఎఎన్ఎంల జీతాల నుంచి నెలకు 350 రూపాయలను ప్రభుత్వం కట్ చేసుకుంటుంది. ఇవన్నీ బాగానే ఉన్న చాలామంది ఎఎన్ఎంలకు డ్రైవింగ్ లైసెన్సులు లేవు, మరికొందరికీ డ్రైవింగ్‌లో పూర్తిస్థాయి అనుభవం లేదు. దీంతో అధికారులు డ్రైవింగ్‌పై పూర్తిస్థాయి శిక్షణ ఇప్పించి డ్రైవింగ్ లైసెన్సులను వచ్చిన తరువాతే ఎఎన్ఎంలు బైక్‌లను తీయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. మొదటగా రంగారెడ్డి జిల్లాలోఎఎన్ఎంల నుంచి 307 దరఖాస్తులు రాగా అందులో 275 మంది ఎఎన్ఎంలకు మాత్రమే అనుమతి ఇచ్చారు.

> **చిన్నచిన్న లోపాలు తలెత్తడం సహజమే**
>
> 
>
> ప్రభుత్వం ఏ పథకం ప్రారంభించినా అది పేదలకు మేలు చేసే విధంగానే ఉంటుంది. చిన్న చిన్న లోపాలు ఉండడం సహజమే. బైక్ అంబులెన్సుల వలన చాలా ఉపయోగం ఉంటుంది. దేశంలోనే మనవే మొదటగా దీనిని ప్రారంభించాం. పైలట్లకు జీతం తక్కువగా ఉండొచ్చు. సీఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. జీవికే 108కు సంబంధించి నిర్వహణ చూస్తుంది. సమస్యలు ఏమున్నా ఉంటే వాటిపై చర్చలు జరిపి ఆ తరువాత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రాజెక్టు రెక్కలు ముఖ్య ఉద్దేశ్యం

♦గతంలో ఎఎన్ఎంలు ఆటోలు, బస్సుల్లో తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ బైక్‌ల వలన తొందరగా గర్భిణీ ఉన్న చోటుకి వెళ్లే పరిస్థితి ఉంటుంది.

♦మాతా శిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఎఎన్ఎం గ్రామాల్లో, బస్తీలకు బైక్‌లపై ఇంటింటికి వెళ్లి వైద్య సేవలను అందిస్తారు. తమతో పాటు వ్యాక్సిన్ క్యారియర్, మందులను, సిరంజీలను తదితర సామగ్రి తీసుకు వెళతారు.

♦ఎఎన్ఎంలు గర్భిణీలు ఇంటికి వెళ్లి వారి పేర్ల నమోదు, టీకాలు తదితర సేవల గురించి వారికి అవగాహన కల్పిస్తారు.

♦మొదటగా ఈ ప్రాజెక్టును గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దివ్య ప్రారంభించింది. అక్కడ విజయం సాధించడంతో ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యింది.

♦ప్రస్తుతం ప్రాజెక్టు రెక్కలు కింద ఇప్పించిన బైకులు రోడ్డెక్కకపోవడంతో అసలు డ్రైవింగ్ లైసెన్సులు ఎప్పుడు వస్తాయన్నది తెలియాల్సి ఉంది. దీంతోపాటు పూర్తి స్థాయిలో మహిళలకు డ్రైవింగ్ నేర్పించాల్సి ఉండడంతో వీటిపై సందిగ్ధత నెలకొందని చెప్పవచ్చు.

అమ్మ భాషకు ఆర్డినెన్స్?

(మొదటిపేజీ తరువాయి)

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కూడా ఈ తరహా విధానానికి శ్రీకారం చుట్టాలని కోరడంతో అక్కడ కూడా సీఎం చంద్రబాబు తెలుగు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళలో ఆ రాష్ట్రాల మాతృభాషను ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయని, తెలుగు రాష్ట్రాల్లోనే ఇది అమలు కావడం లేదని భావించిన ప్రభుత్వాలు ఇందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నాయి. ఆయా రాష్ట్రాలలో పర్యటించి వచ్చిన ఉన్నతస్థాయి అధికారిక బృందం తెలుగును తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించింది.

తెలుగు భాషను ఇంటర్ వరకు తప్పనిసరి చేస్తూ అనుసరించాల్సిన విధివిధానాలు, సిలబస్ రూపకల్పన, పాఠ్యపుస్తకాల తయారీ తదితర అంశాలు అధ్యయనం చేసేందుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ అనేక ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచింది. సిలబస్‌ను రూపొందించడం, పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెచ్చే బాధ్యతను ప్రభుత్వం తెలుగు వర్శిటీకి అప్పగించాలని ప్రతిపాదించింది. దీంతో ప్రస్తుతమున్న పాఠ్యాంశాలు పూర్తిగా మారే అవకాశం ఏర్పడింది. గతంలో తెలుగు మాధ్యమంలో సిలబస్ రూపకల్పన ఇంటర్మీడియట్ విద్యామండలి సిద్ధం చేసి తెలుగు అకాడమీకి అప్పగిస్తే.. ఈ అకాడమీ పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేది. ఈ పనిని ప్రస్తుతం తెలుగు వర్శిటీకి అప్పగించాలని విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనుంది. తెలుగును తప్పనిసరి చేస్తూ న్యాయశాఖ ఆర్డినెన్స్‌ను సిద్ధం చేస్తోందని, ఒకట్రెండు రోజుల్లో దీనిని ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా గవర్నర్ కార్యాలయమైన రాజ్‌భవన్‌కు పంపించాలని అధికారులు నిర్ణయించారు. గవర్నర్ సంతకం కాగానే ఆర్డినెన్స్‌ను జారీ చేసి వచ్చే నెల 12 నుంచి ప్రారంభమవుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఆర్డినెన్స్ జారీకి ఎటువంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ప్రభుత్వం ఈ రంగంలో వున్న నిష్ణాతులతో చర్చించి వారి అభిప్రాయాలను తీసుకున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాన్నే తెలంగాణలోనూ పాటించాలని ఆ రాష్ట్రాలు ఏ విధంగా వారి మాతృభాషను పాఠశాలలు, కళాశాలల్లో తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని అధ్యయనం చేశాకే కొత్త చట్టానికి రూపకల్పన చేసినట్లు సమా చారం. ఉర్దూ మాతృభాషతో చదువుకుంటున్న విద్యార్థులకు తెలుగు స్థానంలో ఉర్దూని చదివే వెసులుబాటుని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వం జారీ చేసే ఆర్డినెన్స్‌లో ఈ అంశాన్ని పొందుపర్చినట్లు సమాచారం. ఈ ఆర్డినెన్స్ అమల్లోకి రాగానే తెలుగు తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం ఆచరణలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ముద్రితమవుతున్న పాఠ్యపుస్తకాలు, సిలబస్ పాటించకుండా కార్పోరేట్ విద్యాసంస్థలు తమకు తాముగా సిలబస్ రూపొందించుకుని పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెస్తే అటువంటి సంస్థలపై కఠినంగా వ్యవహరించే అవకాశం కనిపిస్తోంది. సంబంధిత సంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయడంతో పాటు ఆ విద్యాసంస్థల అనుమతిని రద్దు చేసే వెసులుబాటును ఈ ఆర్డినెన్స్‌లో పొందుపరుస్తున్నట్లు సమాచారం. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యామండలి తరచూ పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేయడం, మెరుపు దాడులను నిర్వహించి పాఠ్యపుస్తకాలను శోధించాలని.. ఆయా విద్యాసంస్థలు సిద్ధం చేసే డైరీలలో ఎటువంటి పాఠ్య ప్రణాళిక ఉందో దానిని కూడా చూడాలని.. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పక్షంలో వెంటనే యాజమాన్యాలపై చర్య తీసుకునే విధంగా చట్టాన్ని సిద్ధం చేయాలని ప్రభుత్వం న్యాయశాఖను కోరినట్లు సమాచారం. పాఠశాల స్థాయిలో నిర్వహించే వారాంతపు, మాసిక, త్రైమాసిక, అర్ధసంవత్సరం, వార్షిక పరీక్షలను సైతం తెలుగులోనే జరపాలని ప్రశ్నపత్రం తెలుగులోనే ముద్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

పాఠ్య ప్రణాళిక విషయంలో నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించాలని భావిస్తోంది. తెలుగును తప్పనిసరి చేయడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్‌తో పాటు ఇంటర్ వరకూ నిర్వహించే వివిధ ప్రవేశపరీక్షలు, సర్వీస్ కమిషన్ జరిపే పోటీ పరీక్షల్లో తెలుగు మాధ్యమంతో కూడిన ప్రశ్నపత్రాలనే ముద్రించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

నైతికతకు నిలువుటద్దం పండిట్ దీన్‌దయాళ్




హైదరాబాద్, ఆంధ్రప్రభ: పండిట్ దీన్‌దయాల్ సిద్ధాంతాలతోనే భాజపా ముందుకు సాగుతోందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. నైతిక విలువులకు మారుపేరుగా నిలిచిన పండిట్ ఆశయాలకు అనుగుణంగా భాజపా పనిచే స్తోం దన్నారు. ప్రస్తుతం రాజకీయాలు కులాలు, మతాలు, ప్రాంతాల చుట్టూ తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ భాజపా మాత్రం నైతిక విలువలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు... దిగజారుతున్న రాజకీయ విలువులను పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తోం దన్నారు. దేశంలో కుటుంబ, వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటున్నది ఒక భారతీయ జనతా పార్టీ మాత్రమేనని అన్నారు. పార్టీలో అంకితభావంతో పనిచేసే ప్రతి నాయ కుడికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సంప్ర దాయంఒక్క భాజపాలోనే ఉందన్నారు. ఇతర పార్టీల్లో వారసత్వం, లేదా కుటుంబ పాలనలు కొనసాగుతున్నాయన్నారు. ఆదివారం నాంపల్లి లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ బలిదాన్ దివాస్‌ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజకీయ విలువలు రోజురోజుకు నశించిపోతున్నాయన్నారు. పదవుల కోసం పలువురు నేతలు తాము గెలిచిన పార్టీలకు రాజీనామాలు చేయకుండానే అధికార పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే కళంకమని వ్యాఖ్యానించారు. అలాగే అధికార, ప్రతిపక్ష పార్టీలు మధ్య ఆరోపణలు కూడా రోజురోజుకు దిగజారుతున్నాయని ఆయన ఆవేదనన వ్యక్తం చేశారు. పరస్పరం వ్యక్తిగత ఆరోపణలకు దిగుతూ రాజకీయాలు అంటేనే ప్రజలకు అసయించుకునే పరిస్థితిని తీసుకస్తు న్నారన్నారు.

ఇక కొన్ని రాష్ట్రా లు అయితే స్వాతంత్ర్య ఫలాలు అన్నివర్గాలకు అందించకుండా కేవలం ఒకటి, రెండు వర్గాలకు కొమ్ముకాసే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు.కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, అవకాశం, అవినీతి, బంధుప్రీతి కోసం రాజకీయ విలువులను దిగజార్చుతున్న కాంగ్రెస్ నాయకులు నరేంద్రమోదీ ప్రభుత్వం విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన ఈ నాలుగేళ్ళలో ఒక్క అవినీతి ఆరోపణలకు తావులేకుండా మోదీ సర్కార్ నిబద్దతో పనిచేస్తోందన్నారు.

తక్షణ ట్రిపుల్ తలాక్

రాజ్యాంగ విరుద్ధం


●బాబ్రీ మసీదు విషయంలో రాజీపడేది లేదు ●దేశంలో రోజురోజుకు మతతత్వం పెరుగుతోంది : ముస్లిం పర్సనల్ బోర్డు ఆందోళన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బాబ్రి మసీద్, ట్రిపుల్ తలాక్ బిల్ విషయంలో రాజీ పడబోమని అఖిల భారత మజ్లీస్ ఈ ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ పునరుద్ఘాటించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు అంశాల పైన అఖిల భారత ముస్లిం పర్సనల్ బోర్డు 26వ ప్లీనరీ తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించడం జరిగిందన్నారు. ట్రిపుల్ తాలక్ విషయంలో కేంద్రం ముస్లింలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. బాబ్రి మసీదు శతాబ్దాలుగా ముస్లింల మసీదుగానే ఉందని వివరించారు. ప్రభుత్వం దాన్ని మార్చడానికి తీవ్ర ప్రయత్నం చేయడం కూడా సరైన విధానం కాబోదన్నారు. దేశంలో రోజు రోజుకు మతతత్వం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే 4.40 కోట్ల దరఖాస్తులను ముస్లిం పర్సనల్ బోర్డు పక్షాన కమిషన్‌కు అందచేశామన్నారు. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి సుప్రీంకోర్టు సూచనలపై సమీక్షించడానికి ముస్లిం పర్సనల్ బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ముస్లింలు అంతా ఐక్యంగా పోరుసాగించవలసి ఉందని పిలుపునిచ్చారు. కేంద్రం వైఖరిపైన ముస్లిం సమాజం, ముస్లిం సంస్థలు, బోర్డులు మౌనం పాటించడం సరికాదన్నారు. కేంద్రం వైఖరికి నిరసనగా శాంతియుత పోరాటం చేయడం అందరి బాధ్యత అని ముస్లిం పర్సనల్ బోర్డు ప్లీనరీ పిలుపునిచ్చిందన్నారు. ముస్లింల ధార్మిక, షరియత్ హక్కులను మార్చడానికి కేంద్రం తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తుందని వివరించారు. ఈ ప్రయత్నాలను ముస్లిం సమాజం తిప్పి కొట్టాలన్నారు. తక్షణ ట్రిపుల్ తలాక్ ముస్లీం పర్సనల్‌లో లాకు పెను ముప్పు అని బోర్డు అధ్యక్షులు మౌలానా రాబే హసనీ నద్వీ, ప్రధాన కార్యదర్శి మౌలానా వరీ రెహ్మానీ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం, గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు ట్రిపుల్ తలాక్ బిల్లు వ్యతిరేకం అన్నారు. బాబ్రి మసీదుపై సుప్రీం కోర్టులో చట్టపరమైన యుద్ధం జరుగుతుందన్నారు. న్యాయం, సమాన గౌరవం ఆధారంగా జరిగే చర్చలకు ముస్లిం పర్సనల్ బోర్డు సిద్ధమన్నారు. ట్రిపుల్ తలాక్ సమస్య వ్యక్తిగత చట్టానికి ముప్పు కలిగిస్తుందని వివరించారు. ఈ బిల్లును అడ్డుకునేందుకు రాజ్య సభలో ప్రతిపక్షాలు అనుసరించిన తీరును అభినందించారు. బాబ్రి మసీదు సమస్యపై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టవలసి ఉందన్నారు. ఒకసారి మసీదు నిర్మించబడిన తర్వాత అది మసీదుగానే పరిగణించబడుతుంది అని మౌలానా సయ్యద్ మోహమ్మద్ రాబే హసనీ నద్వీ పేర్కొన్నారు. ఈ విషయంలో రాజీకి తావులేదన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు కూడా అమోదయోగ్యమైంది కాదన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమైన చర్య అని వివరించారు.

బాబ్రి మసీదుకు కేటాయించబడిన స్థలం విక్రయించడానికి, బహూకరించడానికి, ఇతరులకు కేటాయించడానికి అవకాశం లేదని అసదుద్దీన్ ఓవైసీ వివరించారు. అది బాబ్రి మసీదు స్థలంగానే పరిగణించబడుతుందన్నారు. ఈ విషయంలో ముస్లిం పర్సనల్ బోర్డు 1990, 1993లో చేసిన తీర్మానాలకు కట్టుబడి ఉందన్నారు. ముస్లీం పర్సనల్ బోర్డు 26వ ప్లీనరీ సమావేశాలు హైదరాబాద్‌ల జరిగాయి. సుమారు 500ల మందికి పైగా ప్రతినిధులు ప్లీనరీలో పాల్గొన్నారు. ఇటీవలి పరిణామాలపైన ప్రధానంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ముస్లీంల విషయంలో అనుసరిస్తున్న తీరు పట్ల బోర్డు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రిపుల్ తలాక్, బాబ్రీ మసీదు అంశం పై సుదీర్ఘంగా చర్చించి గతంలో ప్రకటించిన వైఖరికి కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటించింది. సమావేశాల ముగింపు సందర్భంగా బహిరంగ సభను నిర్వహించారు. పలువురు ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ బోర్డు ప్రముఖులు ప్రసంగించారు. బాబ్రీ మసీదు అంశాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఒకరిద్దరు సభ్యులు చేసిన సూచనలపైన వాడి వేడి చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ విషయంలో డిసెంబర్ 1990, జనవరి 1993లో చేసిన తీర్మానాలకు కట్టుబడి ఉండాలని మరో తీర్మానం ఏకగ్రీవంగా చేయడం జరిగింది.

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రా నికి జరిగిన అన్యాయంపై ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన తనయుడు, మంత్రి కెటిఆఅర్‌లు ఎందుకు పెదవి విప్పడం లేదని కాంగ్రెస్ పార్టీ నిలదీసింది. గాంధీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ముఖ్య అధికార ప్రతి నిధి దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, ఎపికి జరిగిన అన్యాయంపై అక్కడి ఎంపీలు కేంద్రాన్ని నిలదీస్తుంటే తెలంగాణ ఎంపీలు ఎందుకు మౌ నంగా ఉంటున్నారని నిలదీశారు. ప్రధాని నరేంద్రమోడీని ప్రశ్నిస్తే సిబిఐ, ఈడి కేసులు తప్పవన్న ఉద్దేశ్యంతోనే అధికార టిఆర్ఎస్ నేతలు ప్రశ్నించడం లేదన్నారు. మోడీతో కెసిఆర్,లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని, ఈ అంశంపై తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద చర్చించేందుకు టిఆర్ఎస్ సిద్ధం అని ఆయన సవాల్ విసి రారు.రాష్ట్రా న్ని ఏకపక్షంగా విడ గొట్టారని పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి మాట్లాడిన రోజే హైదరాబాద్‌లో మంత్రి కెటిఆర్ చిట్‌చాట్‌పేరుతో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ లోఫర్ పార్టీ అనీ, రాహుల్ గాంధీ పప్పూ అని వ్యాఖ్యానించారని, తర్వాత రోజు పత్రికల్లో వచ్చినవార్తల క్లిప్పిం గ్‌లను ట్విట్టర్‌లో పెట్టి మోడీ కార్యాలయం చూసేలా చేశార న్నారు. గూగుల్‌లో కుక్క అని తెలుగులో టైప్ చేసి చూస్తే మంత్రి కెటిఆర్ బొమ్మలు వస్తున్నాయన్నారు.

పాస్‌పోర్టు తరహాలో పట్టాదారు పాసుపుస్తకం

(మొదటిపేజీ తరువాయి)

ముద్రణకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సెక్యూరిటీ ప్రెస్‌తో ఒప్పందం కుదుర్చు కుంది. దేశ వ్యాప్తంగా ఏకకాలంలో నాలుగు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లలో వీటి ముద్రణ జరుగుతోంది. హైదరాబాద్ శివార్లలోని చర్లపల్లిలో ఉన్న ప్రెస్‌తో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దేవాస్, మహారాష్ట్రలోని నాసిక్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా ప్రెస్‌లలో వీటి ముద్రణకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకారం కుదిరింది. రాష్ట్రంలోని కోటి 40 లక్షల ఎకరాల సాగుకు గాను యోగ్యమైన భూములకు 70 లక్షల పాస్‌పుస్తకాలను ప్రభుత్వం సిద్ధం చేయిస్తోంది. ఈ పట్టాదారు పాస్ పుస్తకంపై కాకతీయుల తోరణం, ప్రసిద్ధిగాంచిన చార్మినార్, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, రైతులు ఎరువు చల్లుతూ.. దుక్కి దున్నుతున్న చిత్రాలను ముద్రిస్తున్నారు. చిరునవ్వులు చిందిస్తున్న రైతు కుటుంబాల మహిళల చిత్రాలను కూడా ఈ పాస్‌పుస్తకాలపై ముద్రిస్తున్నారు. రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం, బంగారు తెలంగాణ మన స్వప్నం.. మన లక్ష్యం... లాంటి నినాదాలను కూడా కవర్‌పేజీపై ముద్రిస్తున్నారు. 18 భద్రతా ప్రమాణాలతో, ఇండియన్ పాస్‌పోర్టు తరహాలో ముదురు ఆకుపచ్చ రంగులో మొత్తం ఆరు కాలమ్స్‌తో 20 పేజీలుగా పట్టాదారు పాస్‌పుస్తకం రూపొందుతోంది. మొత్తం 13 డిజిట్ల యునిక్‌ఐడితో రాష్ట్రం, గ్రామం, మండలం, జిల్లా కోడ్‌తో పాటు పాస్‌బుక్ నెంబర్‌ను ముద్రిస్తున్నారు. యునిక్ ఐడిలోని ఆరవ స్థానంలో జిల్లాను (ఉదాహరణకు రంగారెడ్డి అంటే ఆర్ గా) సూచించే విధంగా ఆ జిల్లా పేరులోని మొదటి ఇంగ్లీషు అక్షరాన్ని ప్రచురిస్తున్నారు. ఆధార్ అనుసంధానంతో పాస్ పుస్తకంపై బార్ కోడ్, క్యూఆర్ కోడ్, పట్టాదారుడి చేతి వేలిముద్ర, ఫోటో ఉంటాయి. పాస్‌బుక్‌లో పట్టాదారుడి మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా నెంబరు, బ్యాంకు యొక్క ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఇతర బ్యాంకు శాఖ వివరాలుంటాయి. భూమి హద్దు ల(బౌండరీస్)తో కూడిన పట్టాదారు సాగుచేసే భూమి మ్యాప్, లావాదేవీల క్రయ విక్రయాల వివరాలు ఉంటాయి. ప్రభుత్వం చేపట్టిన భూసర్వేలో పట్టాదారు పాస్ పుస్తకం కోసం పక్కా గణాం కాలు, భూయజమానుల ఫోటోలు, ఆధార్ వివరాలు సేకరించిన సంగతి తెలిసిందే. ఎలక్ట్రానిక్ భూమి యాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం గురించి ముఖ్య సూచనలు పొందుపరుస్తున్నారు. రోజుకు రెండున్నర లక్షలకు పైగా పాస్‌పుస్తకాల ముద్ర ణ కొనసా గుతోంది. తెలంగాణ భూమి హక్కుల పట్టాదారు పాస్ పుస్తక నియ మావళి ప్రకారం పాస్ పుస్తకం పోయిన వెంటనే సదరు వ్యక్తి లిఖిత పూర్వకంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని.. పరపతి సంస్థలకు తెలియజేయాలని సూచించే విధంగా పుస్తకంలో ప్రచురిస్తున్నారు. వార్తాపత్రికల్లో పుస్తకం పోయిన విషయాన్ని ప్రచురించి.. ఆ వార్తా పత్రిక ప్రతిని అర్జీతో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారికి అంద జేయాలని.. ఆ తర్వాత డూప్లికేట్ పాస్ పుస్తకం కొరకు నిర్దేశించిన రుసు మును చెల్లించి మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకుంటే అది చిరునామాకు పంపిస్తారని తెలిపింది.

సత్వర న్యాయానికి సమష్టి కృషి అవసరం

సుప్రీం జస్టిస్ రంజన్ గోగోయ్

అమరావతి,ఆంధ్రప్రభ : సమాజ హితాన్ని కాంక్షించేందుకు న్యాయ మూర్తులు సమాజ నిర్మాతలు కావాలని, సత్వర న్యాయం జరగాలంటే న్యాయవాదులు, న్యాయమూర్తులు సమష్టిగా కృషి చేయాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గోగోయ్ అన్నారు. న్యాయం జరగడం ఆలస్యమైతే అది వ్యవస్థలోని లోపంగానే గుర్తించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కక్షిదారులకు న్యాయం సరిగా జరగడం లేదని, శ్రద్ధ వహించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను దృష్టిలో ఉంచుకుని సమగ్ర న్యాయం జరగాల్సి ఉందన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బిబిఏ) 111వ వార్షికోత్సవ కార్యక్రమం ఇక్కడి ఏ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్చి జస్టిస్ రంజన్‌గోగోయ్ ప్రసంగిస్తూ న్యాయవాదులు సామాజిక ఇంజనీర్లు అని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకమైందన్నారు. కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్య ఇంకా పెరగాల్సి ఉందన్నారు. కేసుల విచారణలో జాప్యాన్ని నివారించాల్సి ఉందని, ఇది జరగాలంటే బార్‌కు బెంచ్‌కు మధ్య సమన్వయం మరింతగా పెరగాల్సి ఉందన్నారు. వాకోర్టు న్యాయమూర్తులు ఏవీ శేషసాయి, సి ప్రవీణ్‌కుమార్, ఎమ్వీ సత్యనారాయణమూర్తి, సునీల్‌చౌదరి తదితరులతో పాటు కృష్ణా జిల్లా జడ్జి లక్ష్మణరావు, ఎంఎస్‌జె రవీంద్రబాబు, లా కార్యదర్శి డి వెంకటరమణ, బిబిఏ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, కార్యదర్శి కందుల శ్రీనివాసరావుతో పాటు సీనియర్ న్యాయవాదులు చలసాని అజయ్‌కుమార్, గోగుశెట్టి, మన్మధరావు, హాజరత్తయ్య గుప్తా తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జులై 31లోపు పంచాయతీ ఎన్నికలు


● రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ● జిల్లాల వారీగా టీఎస్ ఈసీ సమీక్షలు ● బ్యాలెట్ పద్ధతిలోనే ఓటింగ్ ● వార్డు మెంబర్లకు తెలుపు రంగు.. సర్పంచుకు పింకు కలర్ బ్యాలెట్ ● రాష్ట్రంలో బ్యాలెట్ బాక్సుల కొరత ● మహారాష్ట్ర, కర్నాటక నుంచి బాక్సులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ఇటు ప్రభుత్వం అటు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తులు ముమ్మరం చేస్తున్నాయి. ఈ ఏడాది జులై 31లోపు పంచాయతీలకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చకచకా జరిగి పోతున్నాయి. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్దమవుతోంది. ఓటర్ల జాబీతా సవసరణలు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఒకవైపు సాగుతుండగానే మరోవైపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన మందస్తు ఏర్పాట్లపై దృష్టిసారించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలిసారి స్థానిక సంస్థలకు జరగనున్న సాధారణ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలను తీసుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఛైర్మన్ నాగిరెడ్డి జిల్లాల వారీగా అధికారులతో సమావేశాలు , సమీక్షలు చేపట్టారు. జిల్లా కలెక్టర్లు , సంయుక్త కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు తదితర అధికారులతో నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో ఎన్నికల నిర్వహణ ప్రణాళికల రూపకల్పనపై మార్గదర్శకాలను సూచిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థలను పటిష్టం చేసేందుకు చేపట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ చట్టాల సవరణతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం తన పని తాను చేసుకుపోంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణను ప్రస్తుతం ఉన్న విధానంలోనే కొనసాగించాల్సి వస్తే అందుకు తగ్గ ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించింది. గ్రామ పంచాయతీల పాలక మండళ్లకు సంబంధించి పంచాయతీ పరిధిలోని ఓటర్లు వార్డుల వారీగా వార్డు సభ్యులను ఎన్నుకోవటం , గ్రామ పంచాయతీ సర్పంచును గ్రామ ఓటర్లంతా నేరుగా ఎన్నుకునే విధానమే ప్రస్తుతం అమల్లో ఉంది. వచ్చే ఉన్నికలను కూడా బ్యాలెట్ పద్దతిలోనే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఎన్నికల్లో పోటీ చేసే వారికి గుర్తుల కేటాయింపులతోపాటు వార్డు స్ధానాలకు పోటీపడే వారికి తెలుపు రంగం బ్యాలెట్ పత్రం, సర్పంచు స్ధానానికి పోటీ పడే వారికి పింక్ రంగు బ్యాలెట్ పత్రాలను ఉపయోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద తగినన్ని బ్యాలెట్ బాక్సలు లేవు. ఎన్నికలు నిర్వహించాలంటే కొత్తగా బ్యాలెట్ బాక్సులను తయారు చేయించాల్సిన అవసరం ఉంది. అయితే జులై 31లోపు ఎన్నికల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఇరుగు పొరుగు రాష్ట్రాలనుంచి బ్యాలెట్ బాక్సెలను అరువు తెచ్చుకోవాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా తెలగాణ రాష్ట్రంలో లాగే పంచాయతీ పాలక మండళ్ల పదవీ కాలం ఒకే సమయంలో ముగియనుంది. దీంతో ఏపీలో కూడా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మినహాయించి మిగిలిన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి అవసరమైనన్ని బ్యాలెట్ బాక్సులను తెప్పించుకోవాలని నిర్ణయించారు.

లెక్కకు లెక్కలతోనే సమాధానం

● కేంద్రం నుంచి స్పష్టత వచ్చే వరకు పోరాడండి ● రాష్ట్ర ప్రయోజనాల కోసం దేనికైనా సిద్ధం ● టీడీపీ ముఖ్యనేతల భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై బీజేపీ రాష్ట్ర నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి చెప్పే లెక్కలకు లెక్కలతోనే సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఆయన ఢిల్లీ పరిణామాలపై చర్చించేందుకు అందు బాటులో ఉన్న ముఖ్యనేతలు, అధికా రులతో ఉండవల్లి తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు ఎంపీ గల్లా జయ దేవ్‌ను అభినందించారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ వాణిని చక్కగా వినిపించారని కితాబిచ్చారు. అనంతరం నేతలతో చంద్రబాబు మాట్లాడుతూ ఒకవైపు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే మరోవైపు హామీలు అమలు కోసం పోరాటం చేయాలని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు చెబుతున్న లెక్కలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విభజన హామీలకు సంబంధించిన లెక్కలు చెప్ప కుండా అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే నిధులు ఇస్తూ వాటిని రాష్ట్రానికి కేటాయించినట్టుగా ప్రచారం చెయ్యడంపై మండిపడ్డారు. ఏపీకి ఏమైనా ప్రత్యేకంగా నిధులు, ఇతర కేటాయింపులు జరగలేదన్నారు. అయితే బిజెపి నేతలు తప్పుడు లెక్కలు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించే దిశగా పనిచేస్తు న్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర బిజెపి నేతల వైఖరితో అన్యాయం జరిగే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి నేతలు చేస్తున్న ప్రచారానికి దీటుగా స్పందించాలని నేతలను ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్చి 5 నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ మలి విడిత సమావేశాల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. ఢిల్లీకి ధీటుగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని ప్రధాని మోడీ తిరుపతిలో హామీ ఇచ్చినప్పటికీ నిధులను మాత్రం ఇవ్వటంలేదన్న అంశాన్ని ప్రస్తావించారు. రాజధాని నిర్మాణానికి రూ. 1.30 లక్షల కోట్లు ఖర్చువంతుంటే రూ.3500 కోట్లు కేటాయించడమే నిదర్శనమన్నారు. ఇప్పటివరకు అమరావతి నిర్మాణానికి రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చిందని స్పష్టం చేశారు. అదేవిధంగా రెవెన్యూ లోటుకు సంబంధించి రూ. 22 వేల కోట్లు ఇవ్వాల్సివుండగా కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే వస్తుందని దానిలో ఇప్పటికే రూ.3800 కోట్లు ఇచ్చిందని తెలిపారు. కాగ్ చెప్పిన లెక్కలను కూడా పరిగణనలోకి తీసుకొకుండా కేంద్రం అన్నింటికి కోతలు పెడుతువచ్చిందని ఆసహనం వ్యక్తం చేశారు. కె.బి.కె, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ రాష్ట్రంలోని వెనకబడిన ఏడు జిల్లాలకు ఇస్తామని చెపి ్ప రూ.1050 కోట్లు ఇచ్చిందని, అదే బుందేల్‌ఖండ్‌కు రూ. 6వేల కోట్లు కేటాయించారని చెప్పారు.


పోలవరం, వివిధ విద్యాసంస్థలకు అరకొర నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని మార్గ నిర్దేశం చేశారు. 19 విభజన హామీలపై స్పష్టత వచ్చేవరకు పోరాటం కొనసాగించాలని ఎంపీలను చంద్రబాబు ఆదేశించారు. టైంబాండ్ ప్రకారం ఒక యాక్షన్ ప్లాన్ కేంద్రం నుంచి వచ్చేలా ఒత్తిడి పెంచాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు కన్న ఏది ముఖ్యంకాదని, దీనికోసం దేనికైనా సిద్ధంమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌పై మెకాన్ నివేదిక

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగుదేశం, వైకాపా ఎంపీల ఆందోళనల కారణంగా ఇరకాటంలో పడ్డ కేంద్ర ప్రభుత్వం విభజన హామీల అమలును మరింత వేగవంతం చేసింది. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో అధ్యయనం చేస్తున్న మెకాన్ సంస్థ నివేదిక నేడు కేంద్రానికి అందనుంది. ఈ నివేదిక ఆధారంగా వెంటనే చర్యలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి తగిన పరిస్థితులు లేవని ఫీజిబిలిటీ రిపోర్ట్ రావడంతో, కేంద్ర ఉక్కు శాఖ అనువైన పరిస్థితులను కల్పించడం, ప్రాజెక్టును పట్టాలెక్కించడంపై అధ్యయనం చేసేందుకు మెకాన్ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ సాధ్యపడకపోయినా, ఏదో ఒక రకంగా పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తోంది. దీంతోపాటు రెవెన్యూ లోటు అంశంపైనా నేడు కేంద్ర ఆర్థిక శాఖ నుంచి మరింత స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. లోటును లెక్కించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫార్ములా విషయంలో తేడా ఉండడం, ఆ కారణంగా ఏర్పడ్డ వ్యత్యాసాన్ని పూడ్చాలన్న విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం రూ. 16,000 కోట్లుగా అంచనా వేస్తుండగా, కేంద్రం రూ. 4,135 కోట్లుగా గతంలో లెక్కలు వేసింది. ఇందులో ఇప్పటికే రూ. 3,979.5 కోట్లు విడుదల చేసింది. కొత్త ఫార్ములా ప్రకారం కేంద్రం ఒక అంకెను సూచించగా, దానిపై రాష్ట్ర ప్రభుత్వం నిర?యం తీసుకోవాల్సి ఉందని తెలుస్తోంది. దీంతోపాటు ప్రత్యేక హెూదాకు బదులు ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక సహాయం (ప్యాకేజి) విషయంలోనూ స్పష్టత వచ్చినట్టు సమాచారం. దీనిపై కేంద్ర, రాష్ట్ర అధికారులు మరో దఫా సమావేశమైతే సరిపోతుందని తెలుస్తోంది. మరోవైపు రైల్వే జోన్ విషయంలోనూ నేడు కసరత్తు ప్రారంభించే అవకాశం ఉంది. ఇప్పటికే తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర సహాయ మంత్రి వై.ఎస్. చౌదరి (సుజనా) ఒడిశా నేతలతో సంప్రదింపులు ప్రారంభించారు. ఒడిశా నేతల నుంచి వస్తున్న అభ్యంతరాల కారణంగానే ఈ విషయంపై జాప్యం జరుగుతోందని కేంద్రం చెబుతోంది. అందుకే అభ్యంతరాలను తొలగించే ప్రయత్నాన్ని సుజనా ప్రారంభించగా, రైల్వే శాఖ సైతం నేడు కసరత్తు మొదలుపెట్టనుందని తెలుస్తోంది.

విభజనపై మోడీ అబద్ధాలు

● తలుపులు మూసి బిల్లు పాస్ చేస్తారన్న విషయం బీజేపీకి ముందే తెలుసు ● ప్రధాని మోడీ అసత్యాలు, అర్థసత్యాలు చెబుతున్నారు ● తనస్థాయి దిగజారి ప్రవర్తిస్తున్నారు ● అద్వానీ,మురళీమనోహర్ జోషిలను పక్కనపెట్టి నీతులు చెబుతున్నారు ● 2019లో కేంద్రంలో అధికారం యూపీయేదే ● ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ అమలు చేస్తాం ● ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు విరుచుకుపడ్డారు. ప్రధాని మోడీ ఆస్కార్‌కు మించిన నటుడని, కాంగ్రెస్ పార్టీపై బురదజల్లేందుకు ఏకంగా పార్లమెంటునే వేదికగా చేసుకుని తన స్థాయిని దిగజార్చుకున్నారని మండిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలకు వివరణ ఇవ్వడంతో పాటు ప్రత్యారోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ తెలుగు ముఖ్యమంత్రులను అవమానించలేదని అన్నారు. ఆరు అణాలకు కూలీగా పనిచేసే బీసీ నేత అంజయ్యను తీసుకొచ్చి ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులను సైతం పార్టీ ఆదరించిన విషయం మర్చిపోరాదని తెలిపారు. నిజానికి అంజయ్య దళితుడు కాకపోయినా, ప్రధాని తప్పుడు సమాచారంతో దళితుడిగా చిత్రీకరించారని వెల్లడించారు. నీలం సంజీవరెడ్డి విషయంలోనూ పార్టీ అవమానించిందని చెప్పడం సరికాదని, ఆయనపై పోటీకి పెట్టింది కూడా మరో తెలుగువాడైన వీవీ గిరినే అన్న సంగతి మర్చిపోరాదని కేవీపీ గుర్తుచేశారు. వీరిద్దరితో పాటు పీవీ నరసింహారావుపైనా మోడీ ఎనలేని జాలి చూపించారని, ఆయన విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం తక్కువ చేయలేదని అన్నారు. ఏ మాత్రం కుల బలం, ధన బలం లేని అంజయ్యను, పీవీ నరసింహారావును ముఖ్యమంత్రులను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. 1992లో రాజీవ్ హత్యానంతరం ప్రధాని పదవి చేపట్టే అవకాశం ఉన్నా సరే వదులుకుని పీవీని ప్రధాని చేయాలని సోనియా గాంధీయే ప్రతిపాదించారని కేవీపీ అన్నారు. రాజీవ్ హయాంలో పీవీ నరసింహారావుకు రెండు చోట్ల పోటీ చేసే అవకాశం కల్పించి మరీ ప్రాధాన్యత కల్పించారని గుర్తుచేశారు. ఈ ముగ్గురిని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీని నిందించడంతో ప్రధాని మోడీ ఆస్కార్‌ను మించిన నటనను ప్రదర్శించారని కేవీపీ అన్నారు. నిజానికి రథయాత్ర ద్వారా బీజేపీకి జవసత్వాలు తెచ్చిన ఎల్.కే అద్వానీ వంటి సీనియర్ నేతలను తన బొటనవేలి కింద తొక్కిపెట్టారని కేవీపీ ఆరోపించారు. ఈ వయస్సులో ఆయనపై పాత సీబీఐ కేసులను తిరగదోడి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. అలాగే మరో సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి నుంచి వారణాసి లాక్కున్నారని కేవీపీ అన్నారు. బీజేపీలోనే గొప్ప నేతగా కీర్తించబడుతున్న వాజపాయి ఫొటోలను బీజేపీ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరం నుంచి తొలగించారని, అలాంటి నేతలు ఇప్పుడు తమకు మర్యాదల గురించి చెబుతున్నారని కేవీపీ ఎద్దేవా చేశారు. అలాగే, మహాత్మా గాంధీని ఒక తెలివైన బనియా (వైశ్యుడు) అంటూ అమిత్ షా వ్యాఖ్యానించి, తమ ఆర్.ఎస్.ఎస్ భావజాలాన్ని చాటుకున్నారని అన్నారు. ఇక రాష్ట్ర విభజన విషయంలోనూ ప్రధాని చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. తలుపులు మూసి బిల్లు పాస్ చేస్తున్న విషయం నాటి ప్రతిపక్ష నేత, నేటి కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్‌కు ముందే తెలుసునని వ్యాఖ్యానించారు. అందుకే ఆవిడ తనను తాను తెలంగాణ ప్రజలకు చిన్నమ్మగా చెప్పుకున్నారని కేవీపీ అన్నారు. బీజేపీ అడ్డుకుంటే రాష్ట్ర విభజన బిల్లు పాసయ్యేదే కాదని, తాము బీజేపీ నేతలను వేడుకున్నా సరే వినకుండా సహకరించారని అన్నారు. అసలు రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ పాత్ర చాలా చిన్నదని, బీజేపీ పాత్రే చాలా పెద్దదని డా. కేవీపీ రామచంద్ర రావు అన్నారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైనా తీవ్ర విమర్శలు చేశారు. నాడు ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీని ప్రకటించినప్పుడు బల్లలు చరిచి మరీ స్వాగతించి సన్మానాలు చేయించుకున్న బాబు, ఇప్పుడు ఆ ప్యాకేజీని తూలనాడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని తెలిసే బాబు స్వరం పెంచారని కేవీపీ సూత్రీకరించారు. తాను ఇప్పటికీ హోదాయే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని, 2019లో యూపీయే అధికారంలోకి వచ్చిన తర్వాత హోదా సహా విభజన హామీలన్నీ అమలు చేస్తుందని కేవీపీ ప్రకటించారు. తాజాగా బీజేపీ విడుదల చేసిన 27 పేజీల ప్రకటనంతా డొల్లేనని, పేజీలు నింపే ప్రయత్నం తప్ప ఏమీ లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇందులో రైల్వే జోన్ ప్రస్తావనే లేదని, మంగళగిరి ఎయిమ్స్‌కి ఎందుకు నిధులు కేటాయించలేదో చెప్పలేకపోయారని అన్నారు. ఆంధ్ర ప్రజలు మొదటి నుంచి కష్టపడే స్వభావం కలిగినవారని, అందుకే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లగల్గుతున్నారని కేవీపీ వ్యాఖ్యానించారు.

265 మంది అన్నదాతలకు

ఎన్టీఆర్ రైతు రథం

● మొదటి విడతగా 25 ట్రాక్టర్ల పంపిణీ

● ఎంపీని అభినందించిన మంత్రి దేవినేని



అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 265 గ్రామాల ప్రజలకు సబ్సిడీపై ఎన్టీఆర్ రైతు రథం ట్రాక్టర్లను ఇచ్చినట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. ఆదివారం విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని ఆధ్వర్యంలో పేద ప్రజలకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని రైతాంగానికి ట్రాక్టర్ల అవసరాన్ని గుర్తించిన ఎంపీ కేశినేని నాని ఐచర్ కంపెనీ ఛైర్మన్‌తో మాట్లాడారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించేరైతు రథం ట్రాక్టర్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని, పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు మంజూరు చేస్తున్న ట్రాక్టర్లు సరిపోని కారణంగా సబ్సిడీపై రైతులకు సరిపడా ట్రాక్టర్లు మంజూరు చేయాలని ఎంపీ కంపెనీ ఛైర్మన్‌ని కోరారన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాలు చేస్తున్న ఎంపీని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మంత్రి దేవినేని ఉమా చేతులు మీదుగా 25 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐచర్ కంపెనీ సౌత్ హెడ్ వినాయక్, ఇన్స్టిట్యూషనల్ సేల్స్ మేనేజర్ నర్కర్, జిల్లా పార్టీ కార్యదర్శి యెనమద్ది నాగమల్లేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగమనేని శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాదయాత్రకు ఉదయగిరి ప్రజలు బ్రహ్మరథం

● కావలిలో ముగిసిన ప్రజా సంకల్పయాత్ర



నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆదివారం ఆయన కావలి నియోజకవర్గంలో తన యాత్రను ముగించుకుని ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలంలోకి అడుగుపెట్టారు. దగదర్తి మండలం బోడదునపాడు గ్రామం నుంచి ఆయన తన పాదయాత్రను ప్రారంభించారు. 15.7 కి.మీ.ల మేర ఆయన 84వ రోజైన ఆదివారం నడిచారు. దగదర్తి, జలదంకి మండలాల్లో సాగిన ప్రజాసంకల్ప యాత్రకు ఆయా ప్రాంతాల ప్రజల నుంచి అపురూప స్పందన లభించింది. జగన్‌కు అడుగడుగునా ప్రజలు మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. అంతకుముందు విశాఖపట్నం నుంచి వచ్చిన డాక్టర్స్ బృందం జగన్‌ను కలిసి పాదయాత్రకు వారి సంఘీభావం తెలిపారు. అనంతరం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్‌లతో కలిసి ఆయన తన పాదయాత్రను కొనసాగించారు. కొత్తపాళెం, గూడూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆయన కొంతసేపు ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెట్ట ప్రాంతానికి చెందిన పలువురు రైతులు తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. వైకాపా అధికారంలోకి వస్తే రైతులందరికీ మేలు జరిగేలా అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయా ప్రాంత రైతులకు జగన్ భరోసా ఇచ్చారు. పై కార్యక్రమంలో ఆయనవెంట కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్ రెడ్డి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'పుర' పాలనలో 'పౌర సమాఖ్యలు'

● ఉత్సాహవంతులతో సమాఖ్యల ఏర్పాటుకు సన్నాహాలు

● నాలుగు దశల్లో నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక

● సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యత్నం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని పురపాల క సంఘాల్లో పౌర భాగస్వామ్యం జొప్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు రాష్ట్రప్రభు త్వం దేశంలోనే తొలిసారిగా ప్రయత్నం చేస్తోంది. దీని ద్వారా పట్టణ ప్రజలకు ప్రభుత్వపరంగా మెరుగైన సేవలు అందించేందుకు అవకాశముంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పురపాలన లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే 'పౌర సమాఖ్యలు' ఏర్పాటు చేయబోతున్నారు. వార్డు, పట్టణ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేయనున్న వీటికోసం ఇప్పటికే ప్రాథమిక కసరత్తు పూర్తయ్యింది. పాలకవర్గాలకు అనుబంధంగా, రాజకీయాలకు అతీతంగా పనిచేసే ఈ సమాఖ్యలు త్వరలోనే ఏర్పాటు కానున్నాయి. దేశంలో మెదటిసారిగా చేస్తున్న ఈ ప్రయత్నంతో మంచి ఫలితాలొస్తాయన్న ఆశాభావంతో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మూడున్నరేళ్లలో రూ. 22 వేల కోట్లతో పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన తాగునీటి సరఫరా, పేదలకు గృహ వసతి, పేదలకు సాంఘీక, ఆరోగ్య భద్రత కోసం చేసే పనుల కోసం పలు పథకాలు అమలు చేశాయి. మరో రూ. 11 వేల కోట్లతో రహదారులు, కాలువల నిర్మాణం, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్, మరుగునీటి శుద్ధిచేసే పనులకోసం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యమా ? యాన్యుటీ విధానంలో ఈ పనులు చేపట్టాలా ? అనే విషయమై ప్రభుత్వం త్వరలో నిర్ణయాన్ని తీసుకోనున్నది. విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతి, అమరావతి నగరాలను కేంద్రప్రభుత్వం ఇప్పటికే ఆకర్షనీయ నగరాలుగా ఎంపికచేసింది. ఇదే పద్ధతిలో మరో 6నగరాలను అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమనుకున్న ఉద్దేశ్యంతో ఇప్పుడు పౌరసమాఖ్యలను ఏర్పాటు చేస్తున్నారు.రాష్ట్రంలో 110 పురపాలక మరియు నగర పాలక సంస్థల్లో 3,300 వార్డులున్నాయి. 250 నుండి 300 కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించడంతో ఒక్కో వార్డులో మూడు నుండి నాలుగు ఏర్పడు తున్నాయి. కొఓ క్లస్టర్‌లో రాజకీయాలకు అతీతంగా ఉత్సాహంగా, స్వచ్ఛందంగా పనిచేసే పది మందిని ఎంపి చేస్తున్నారు.వీరంతా కలిసి వార్డు స్థాయి పౌర సమాఖ్యగా ఏర్పడనున్నారు. గరిష్టంగా 40 మంది వరకు ఉండే వీరిలో అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. వార్డు సమాఖ్య లన్నీ కలిసి పట్టణ సమాఖ్యలను, పట్టణ సమాఖ్య లన్నీ జిల్లా సమాఖ్యలను, జిల్లా సమాఖ్యలన్నీ రాష్ట్రసమాఖ్యను ఎన్నుకుంటాయి. మొత్తంగా 2లోలకు పైగా ప్రజలను భాగస్వాములను చేయాలన్నది పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రణాళిక. వార్డు, పట్టణ స్థాయలో ఇప్పటకే సమా ఖ్యల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పురపాలక శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్రస్థాయి సామర్థ్యపెంపు విభాగం (ఎస్సీబీయూ) జిల్లాల వారీగా ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీవో)లకు సమా ఖ్యల ఏర్పాటు, నిర్వహణ బాధ్య తను అప్పగించింది. పౌర, రాష్ట్రస్థాయి సమాఖ్యలను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పార్టీ మారితే పదవులు వీడాలి



సిద్ధాంతాలతో కూడిన రాజకీయాలు అవసరం

- నేటి తరానికి రోశయ్య ఆదర్శం కావాలి
- రోశయ్యకు జీవిత సాఫల్య పురస్కార ప్రధానోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిద్ధాంతాలతో కూడిన రాజకీయాలు అవసరమని, అందుకోసం నేతలందరూ పాటుపడాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. నేతలు ఇష్టం వచ్చినట్లు పార్టీలు మారడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పదవుల్లో ఉంటూ పార్టీ మారడం సరైంది కాదన్నారు. పార్టీ ఫిరాయింపులు తెలుగు రాష్ట్రాల్లో కొంతకాలంగా సాగుతున్నాయని, తన వ్యాఖ్యలు కేవలం తెలుగు రాష్ట్రాలకే కాదు దేశం మొత్తం మీద జరుగుతున్న తీరుపై అని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కె.రోశయ్యకు రాగసప్త స్వరం అనే సాంస్కృతిక, సామాజిక సంస్థ తరఫున 'జీవిత సాఫల్య' పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, పార్టీ మారడం అంటే తాను నమ్మిన సిద్ధాంతాన్ని పక్కకు పెట్టి మరో సిద్ధాంతం వైపు వెళ్ళడమేనని, పార్టీ మారడం, సిద్ధాంతాలను మార్చుకోవడంలో తప్పులేదు, కానీ పార్టీ ద్వారా వచ్చిన పదవులను వదిలేసి వెళ్ళడం సరైందని పేర్కొన్నారు. చట్టసభల్లో ఫలప్రదమైన చర్చ జరగాలని, అందుకు సభ్యులందరు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల రాజ్యసభలో ఐదు రోజుల పాటు ప్రశ్నోత్తరాలు జరగలేదని, జీరో అవర్ కూడా లేకుండా పోవడం తనెంతో కలచి వేసిందన్నారు. చాలా రాష్ట్రాలలో చట్టసభలు ఇదే తీరులో సాగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో చట్టసభలలో ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై ఫలప్రదమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సభలో కనీసం 10 శాతం సభ్యులు కూడా లేకపోవడంతో కర్నాటక అసెంబ్లీ ఇటీవల 90 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైందని పేర్కొన్న వెంకయ్యనాయుడు ఇదిసరైంది కాదన్నారు. సభలో ప్రజా జీవనంలో కట్టు, బొట్టు, క్రమశిక్షణ, జవాబుదారితనం చాలా ముఖ్యమన్నారు. రాజకీయాల్లోకి రాబోయే యువత ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సిద్ధాంతపర, ప్రజాహిత రాజకీయాలకోసం పనిచేయాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం తాను పనిచేశానని, ఆర్ఎస్ఎస్ తనకు క్రమశిక్షణ, ఒదిగి ఉండటం నేర్పిందన్నారు. క్రమశిక్షణ, కట్టుబాటు, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండటం అంటే ఏమిటో రోశయ్య జీవితాన్ని పరికిస్తే తెలుస్తుందన్నారు. ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి రోశయ్య అని వెంకయ్య ప్రశంసించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, భాషావిషయ పరిజ్ఞాని, సంస్కారం కలిగిన వ్యక్తి రోశయ్య అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న వారిని, మంచి పని చేసిన వారిని సన్మానించడం అంటే కొత్త తరాలకు మంచిని గురించి తెలియజేయడమేనని అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజ్యసభ సభ్యుడు టి. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాజ్యసభను నడిపిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. భిన్న పార్టీలు, మనస్తత్వాలు, అభిప్రాయాలున్న సభను కంట్రోల్ చేయడంలో దిట్ట అని నిరూపించుకున్నారన్నారు. అదరింపులు, బెదరింపులు, బుజ్జగింపులు, ప్రశంసలతో సభ్యుల మనసులను వెంకయ్యనాయుడు స్వల్పకాలంలోనే ఆకట్టుకున్నారన్నారు. 55 ఏళ్ళ రాజకీయ జీవితంలో రోశయ్య ఎంతోమంది ప్రధానమంత్రులు, ముఖ్య మంత్రులు, మంత్రులను చూశారని, ఏ పదవిని చేపట్టినా ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. సన్మాన గ్రహీత కొణిజేటి రోశయ్య మాట్లాడుతూ, రాజకీయాలలో తానెప్పుడూ లక్ష్యంతో పని చేయలేదని, వచ్చిన ఏ పదవికైనా సంపూర్ణ న్యాయం చేశానని అన్నారు. వెంకయ్యనాయుడుతో తనకు పరిచయం జై ఆంధ్రా ఉద్యమంతో మొదలైందన్నారు. రాజకీయాలలో విలువలతో కూడిన రాజకీయం చేశానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి, రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి, వ్యాపారవేత్త నంగునూరి చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు బుర్రా వెంకటేశం, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ పి. విజయబాబు, బండారు సుబ్బారావు, ఎం. రామారావు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీపై జాతీయ సెమినార్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పాఠశాల విద్యలో ఉద్భవిస్తున్న సాంకేతికతలు అనే అంశంపై 3డీఐ స్కూల్, ఈఎస్‌సీఐ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఆదివారం సాంకేతిక సెమినార్‌ను నిర్వహించాయి. సెమినార్ నిర్వహణకు తెలంగాణ ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ ట్రాస్మా సహాయ సహకారాలు అందించింది. ట్రాస్మాతో కలిసి తమ కంపెనీ బిల్డ్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(బూట్) నమూనా కోసం పనిచేస్తోందని 3డీఐ స్కూల్ డైరక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ నమూనా తెలంగాణలోని అన్ని పాఠశాలలకూ ప్రత్యేకమైందని చెప్పారు. ఇందుకోసం ఆయా పాఠశాలలు ఎలాంటి పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేకుండానే ఇన్నోవేషన్ ల్యాబ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొంతం చేసుకునేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌సీఐ డైరక్టర్ ఆర్ఎన్ జయరాజ్, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాస్మా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఆర్థిక వ్యత్యాసాలు దేశానికేకాదు ప్రపంచానికి కూడా మంచిది కాదని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర , రాష్ట్రా ల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అన్నం పెట్టే వ్యవసాయ రంగానికి ఇతోధిక ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఆదివారం హెచ్ఐసిసిలో జరిగిన అంతర్జాతీయ బీమా ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఎ) భవనాన్ని రిమోట్ ద్వారా ప్రారంభించారు. రూ. 165 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోందని, వేగానికి అనుగుణంగా మన దేశం కూడా పయనిస్తోందని తెలిపారు.సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వేగంగా సాగుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అబుదాబీ పర్యటనలో ఉన్నారని, ఆయన అక్కడేం మాట్లాడారో ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంటున్నామని, ఎక్కడేం జరుగుతుందో క్షణాల్లో తెలుసుకుంటున్నామని చెప్పారు. దేశంలో సంస్కరణలు, మార్పు తేవడం కోసం మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని, చైనా కూడా అదే దారిలో పయనిస్తోందని, కానీ, భారత్ మాత్రం చెక్కుచెదరటంలేదని, అందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వెంకయ్యనాయుడు ప్రశంసించారు. దక్షిణాసియా దేశాల బీమా సదస్సును ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని, పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడం ద్వారా ఫలితాలు సాధిస్తామని ఉపరాష్ట్రపతి చెప్పారు. దేశాభివృద్ధి అనేది కేంద్ర, రాష్ట్రా ల సమన్వయంతోనే సుసాధ్యమవుతుందన్నారు. మంచివాడు ఇతరుల నుంచి నేర్చుకుంటాడని, చెడ్డవాడు ఇతరులను చెడగొడతారని సామెత చెప్పారు. ప్రపంచంలోనే పెద్దదని చెప్పారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు బీమా పరిశ్రమను విస్తరిస్తున్న ఆశాభావాన్ని వెంకయ్య నాయుడు వ్యక్తం చేశారు. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ కాలుష్యంపైఉప రాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో కూడా ఉప రాష్ట్రపతి హెచ్చరికలు చేశారు. సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా భారత వృద్ధిరేటు పెరుగుతోందన్నారు.గడచిన మూడు సంవత్సరాల్లో జిడిపి వృద్ధిరేటు 7.1 శాతం నమోదు చేసుకుందన్నారు.

సాగునీటికి 30వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కూడా అడ్డంకులను అధిగమించి పట్టాలెక్కింది. ఇప్పటికే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసం రూ.24వేల కోట్లు నిధుల సమీకరించగా.. కొత్తగా కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.15వేల కోట్లు, సీతారామా ఎత్తిపోతలకు రూ.5వేల కోట్లు రుణంగా సమీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

కాళేశ్వరంకు రూ.9వేల కోట్లు

2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.9వేల కోట్లు, పాలమూరు-రంగారెడ్డికి రూ.4వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.1500కోట్లు బడ్జెట్‌లో కావాలని ప్రతిపాదించినట్లు సమాచారం. రుణాల రూపంలో కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు మరో రూ.20వేల కోట్లు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇక బడ్జెట్‌లో చనాక-కొరాట, ప్రాణహిత వంటి ప్రాజెక్టులకు కూడా భారీగా నిధులు కేటాయించనున్నారు. 2017-18లో కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.7,105 కోట్లు కేటాయించగా, ఇందులో ప్రభుత్వం రూ.4వేల కోట్ల దాకా విడుదల చేసింది. వివిధ బ్యాంకుల నుండి రూ.6,500కోట్లు రుణంగా విడుదల కాగా, మరో రూ.5వేల కోట్లు మార్చివరకు జరిగే పనులకు ఇవ్వాలని నీటిపారుదల శాఖ కోరింది. ఈ కేటాయింపు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలో కాళేశ్వరం ఖర్చు రూ.15వేల కోట్లు కానుంది

కుప్పకూలిన విమానం

(మొదటిపేజీ తరువాయి)

కుప్పకూలింది. విమానంలో మొత్తం 65 మంది ప్రయాణికులు, ఏడుగురు విమాన సిబ్బంది మరణించారని రష్యా వార్తా సంస్థలు తెలిపాయి. ఆకాశం నుంచి అగ్ని గోళంలా నేలరాలుతున్న ఒక విమానాన్ని చూసినట్టు అర్గునొవో గ్రామస్థులను వార్తా సంస్థలు ఉటంకించాయి. విమానం లో ఉన్న 71 మంది ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని రష్యా అత్యవసర సేవలకు చెందిన వర్గాలు ఇంటర్ ఫ్యాక్స్‌కు చెప్పాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రయాణికుల కుటుంబాలకు ప్రగాఢమైన సంతాపం తెలిపారని పుతిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

ప్రభుత్వ టీవీ చానల్ విమానం నేలకూలిన స్థలం తాలూకు వీడియోను ప్రసారం చేసింది. మంచులో చిక్కుకున్న విమాన శకలాలను చూపించింది. రష్యాలో ఇటీవలి కాలంలో రికార్డు స్థాయిలో మంచు కురుస్తున్నది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో కంటి ముందు ఏదీ కనిపించని విపత్కర పరిస్థితి నెలకొంది. ప్రమాదానికి గురైన ఆంటొనొవ్ ఎఎన్148 విమానం రష్యాలోనే తయారైంది. ఏడేళ్ల క్రితం తయారైన ఆ విమానాన్ని సరటొవ్ ఎయిర్‌లైన్స్ ఏడాది క్రితం రష్యాకు చెందిన మరో ఎయిర్‌లైన్స్ సంస్థ నుంచి కొనుగోలు చేసింది. అత్యవసర సేవల సిబ్బంది రోడ్డు ద్వారా దుర్ఘటన స్థలికి చేరుకోలేక పోయారని, సహాయక సిబ్బంది కాలినడకన అక్కడకు చేరుకున్నారని రష్యా మీడియా తెలిపింది. 150 మందికి పైగా సహాయక సిబ్బందిని నియోగించినట్టు అత్యవసర సేవల విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. టేకాఫ్ అయిన రెండు నిముషాల్లోనే విమానం రాడార్ల నుంచి అదృశ్యమైపోయిందని విమానాశ్రయ వర్గాలు వార్తా సంస్థలకు చెప్పాయి. రష్యా రవాణా మంత్రి సంఘటనా స్థలికి బయలుదేరారు. విమాన ప్రమాదం వెనుక వాతావరణ పరిస్థితులు, మానవ తప్పిదం లాంటి పలు కారణాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు రవాణా మంత్రిత్వశాఖ తెలిపింది. విమాన ప్రయాణికుల్లో 60 మందికి పైగా ప్రయాణికులు తమ ప్రాంతానికి చెందినవారేనని ఒరెన్‌బర్గ్ గవర్నర్ రష్యా మీడియాతో అన్నారు. ప్రాసిక్యూటర్లు సరటొవ్ ఎయిర్‌లైన్స్‌పై దర్యాప్తు చేపట్టారు.

విమాన ప్రమాదాలు సర్వసాధారణం

రష్యాలో విమాన ప్రమాదాలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి. విమానయాన సంస్థలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కాలం చెల్లిన విమానాలు నడుపుతుంటాయి.

- నవంబర్‌లో రష్యాకు సుదూరంగా తూర్పు దిశలో ఒక తేలికపాటి విమానం కుప్పకూలిన ఘటనలో ఆరుగురు మరణించారు.
- 2016, డిసెంబర్‌లో రష్యాలో అత్యంత ప్రసిద్ధి చెందిన రెడ్ ఆర్మీ సంగీత గాన, వాయిద్య బృందంతో కూడిన ఒక మిలిటరీ విమానం సోచికి చెందిన బ్లాక్‌సీ రిసార్ట్ నుంచి టేకాఫ్ అయిన అనంతరం నేలకూలింది. ప్రమాదంలో విమానంలో ఉన్న మొత్తం 92 మంది దుర్మరణం పాలయ్యారు. దుర్ఘటనకు పైలెట్‌ను నిందించారు.
- 2016, మార్చిలో రొస్తొవ్-అన్-డాన్ విమానాశ్రయం వద్ద ప్రతికూల వాతావరణం మధ్య ఫ్లయ్‌దుబాయ్ జెట్ విమానం ల్యాండింగ్ వైఫల్యంతో కుప్పకూలింది. దుర్ఘటనలో మొత్తం 62 మంది ప్రయాణికులు మరణించారు.

గొల్ల,కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గొల్ల, కురుమ కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న సిఎం కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకుగానూ ఏప్రిల్ 29వ తేదీన హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన గొల్ల, కురుమ కులస్థుల ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గొల్ల, కురుమలు అధికసంఖ్యలో హాజరై కనీ, విని ఎరగని రీతిలో బహిరంగ సభను విజయవంతం చేయాలని తలసాని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి గ్రామగ్రామంనుంచి బహిరంగసభకు తరలివచ్చే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

జనసమీకరణలో భాగంగా ఏప్రిల్ మొదటి వారంలో తాను జిల్లాలలో పర్యటిస్తానని, గొల్ల, కురుమ నాయకుల కోరిక మేరకు మంత్రి తలసాని హామి ఇచ్చారు. ఈ సభ గొల్ల, కురుమల నూతన శకానికి నాందిపలకాలని ఆయన కోరారు. గతంలో ఎన్నడు లేని విధంగా గొల్ల, కురుమలకు ఐదువేల కోట్ల రూపాయలతో ఖర్చుతో గొర్రెలను పంపిణి చేయగా, వాటి ద్వారా 15 లక్షల గొర్రెపిల్లు జన్మించాయన్నారు. అలాగే గొల్ల, కురుమల సంక్షేమ హాస్టల్ భవనాల నిర్మాణం కోసం కోకాపేటలో 10 ఎకరాల స్థలం, రూ. 10 కోట్లు ఇచ్చారని మంత్రి గుర్తు చేశారు. భూమిపూజ సభను కూడా ఆశించిన దానికంటే ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. గొర్రెలను 90 శాతం సబ్సిడీపై షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గొర్రెలకు అవసరమైన దాణాకోసం గడ్డి విత్తనాలను అందజేస్తోందని, గొర్రెల మంద వద్దకే వైద్యం తీసుకెళ్ళేందుకు 1962 సంచార పశువైద్య జీవాలకు అవసరమైన అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌లను అందుబాటులో ఉంచిందన్నారు. ఆర్థికసంగా, సామాజికంగా గొల్ల, కురుమలు ఎంతో అభివృద్ధిని సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. ఇవన్నీ చేస్తున్నందునే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు భారీ బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 31 జిల్లాల్లో గొల్ల, కురుమల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుకు తాను కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చారు. ఈ భవనాలు గొల్ల, కురుమ కులస్థుల అభివృద్ధికి వేదికలుగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో గొల్ల, కురుమ, యాదవ సంఘం నాయకులు కన్నెబోయిన రాజయ్యయాదవ్, ఎగ్గె మల్లేశం, బాబురావుయాదవ్, చింతల రవీందర్‌యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- మార్చిలో ప్రధానితో బీసీ ఉద్యోగసంఘాల సమావేశం : మంత్రి జోగురామన్న, ఎంపీ దత్తాత్రేయ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీసీ ఉద్యోగ సంఘాలకు గుర్తింపు కల్పిస్తామని హామి ఇచ్చారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సమావేశానికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్ పాల్గొన్నారు. సమావేశంలో మంత్రితోపాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రమణ,పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, నాయకులు బెల్లం మాధవి, కుల్కచర్ల శ్రీని వాస్, శ్యాం కురుమ, ఎస్ దుర్గయ్య గౌడ్ లు పాల్గొ న్నారు.

ఉపాధ్యాయులు అనేవారు నవసమాజ నిర్మాతలని, వారు సమాజానికి మూలస్థంభం లాంటి వారని మంత్రి జోగు రామన్న కొనియాడారు. రాష్ట్రంలోని బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల గుర్తింపు అంశాన్ని గతంలోనే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ దృష్టికి తీసుకెళ్లానని ఇప్పుడు కొత్తగా నియమితులైన ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి దృష్టికితీసుకెళ్లి నిబంధనల మేరకు గుర్తింపు ఇవ్వాలని కోరుతామని అన్నారు. కొద్ది రోజుల క్రితం బీసీ సమస్యల తెలుసుకొని పరిష్కారా మార్గాల కోసం జరిగిన బీసీ ఎమ్మెల్యే, ఎంపిలు, ఎమ్మెల్సీల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో బీసీలకు క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లలో అమలు చేయాలని సూచించామన్నారు. బీసీలకు పారిశ్రామిక విధానంలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, డిక్కీ లాగా బిక్కిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు తెలిపారు. దేశ సంపదలో బీసీలకు తగిన వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఉద్యోగ సంఘాలతో మార్చిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ హామి ఇచ్చారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం బీసీ జేఏసీని ఏర్పాటు చేయాలని టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ సూచించారు. బీసీలకు రాయితీలు కల్పించడంతోపాటు వారు రాజకీయంగా ఎదగడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చిలో జరిగే పార్లమెంటు సమావేశాల్లోనైనా జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదం కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

7దేశాలు..17వేల కి.మీ. మహిళల సాహస యాత్ర

- తెలంగాణ పర్యాటక వైభవాన్ని చాటడానికే ఈ యాత్ర : మంత్రి అజ్మీర చందూలాల్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ పర్యాటక వైభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలియచెప్పడానికి నలుగురు సాహస మహిళా బైక్‌రైడర్స్ నడుం బిగించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. ఆదివారం ఉదయం నలుగురు మహిళా బైక్‌రైడర్స్ సాహస ర్యాలీని పర్యాటక భవనం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ టూరిజం ప్రమోషన్‌లో భాగంగా తెలంగాణ ఆడబిడ్డలు తలపెట్టిన 7 దేశాలు 17 వేల కిలోమీటర్ల సాహస ర్యాలీ విజయవంతం కావాలని ఆయన ఆకాక్షించారు. టూరిజం కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ 7 దేశాల్లో 19 యునెస్కో గుర్తింపుపొందిన ప్రపంచ



హెరిటేజ్ కట్టడాల వద్ద నలు గురు సాహస మహిళా బైక్‌రైడర్స్ తెలంగాణ టూరిజం యొక్క ప్రమోషన్‌తో పాటు మహిళల భద్రతపై పర్యాటక ప్రదేశాల వద్ద ప్రచారం నిర్వహిస్తారన్నారు. నేటి నుంచి 50 రోజుల పాటు మనదేశంతో పాటు వివిధ రాష్ట్రాలు మయన్మార్, లాఓస్, కాంబోడియా, వియత్నాం మరియు థాయిలాండ్ వరకు వీరి యాత్ర కొనసాగుతుందన్నారు.

త్వరలో అసైన్డ్ భూముల చట్టం

- సీఎం ఆదేశాలతో అధికారుల కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇప్పుడున్న అసైన్డ్ భూముల చట్టాన్ని సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేయనుంది. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత లెక్కలోకి వచ్చిన అసైన్డ్ భూములపై సీఎం కేసీఆర్ దృష్టి పెట్టారు. ఆ భూములను తిరిగి నిరుపేదలకు కేటాయించాలని నిర్ణయించారు. దీంతో రెవెన్యూ అధికార యంత్రాంగం మండలాల వారీగా భూముల లెక్కలను ఆరా తీస్తున్నారు. గతంలో 2007 జనవరి వరకు భూములు అనుభవిస్తున్న వారికి మాత్రమే సంబంధిత అసైన్డ్ భూములను కేటాయించే విధంగా చట్టం ఉంది. ప్రస్తుతం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత పాత చట్టం నిరుపయోగమని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావ దినం 2014 జూన్ 2వ తేదీని అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు కటాఫ్ డేట్‌గా నిర్ణయిస్తూ చట్టాన్ని సవరించనున్నారు. అందుకు త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేయాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన;ప కార్యదర్శి ఎస్‌కే జోషిని ఆదేశించారు. గరిష్టంగా ఒక్కో వ్యక్తి పేరున 5 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి ఉండరాదనే అంశంపై కూడా ప్రభుత్వం దృష్టికేంద్రీకరించినట్లు తెలుస్తోంది.

రెడ్ల శంఖారావంలో గందరగోళం



వడ్డేపల్లి, ప్రభన్యూస్ : తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హన్మకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కాకతీయ రెడ్ల శంఖారావం బహిరంగ సభలో గందరగోళం నెలకొన్నది. ఈ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి హాజరై ప్రసంగించారు. ముఖ్యంగా సభ ప్రవేశపెట్టిన డిమాండ్లల్లో ముఖ్యమైంది రెడ్లకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను హోం మంత్రి ప్రస్తావిస్తూ రాజ్యాంగం మనచేతిలోలేదు... మీరు నేను అనుకుంటే మారదు...రాజ్యాంగం మారాలంటే పార్లమెంట్‌లో తీర్మాణం కావాలని చెప్పగానే సభలోని రెడ్డి కులస్తులు పెద్దఎత్తున కేకలు పెడుతూ సభ వైపు వాటర్ బాటిళ్లను విసిరివేశారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డికి రక్షణగా ఉండగా సభ నిర్వాహకులు ప్రజలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అనంతరం ప్రత్యేక కార్పొరేషన్ డిమాండ్‌ను ప్రస్థావిస్తూ కార్పొరేషన్లు కులాల ప్రాతిపదికన రావని, ఆ కులంలో ఆర్థిక వెనుకబాటుతనాన్నిబట్టి రిజర్వేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మళ్లీ సభ గొల్లుమంది. అలాగే సభలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్ల డిమాండ్లను ప్రవేశపెడతామని అన్న విషయాన్ని హోం మంత్రి ప్రస్తావించి వారు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలి.. ఎన్నికలు జరుగాలి, వారు అధికారంలోకి రావాలి.. అప్పుడు డిమాండ్ల పరిష్కారం చూపించాలని అని అనగానే దానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డిలు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు రెడ్డి సమస్యలపై పట్టించుకోకుండా తాము పరిష్కారం చూపిస్తామని హోం మంత్రి అనగానే బీజేపీ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులు రావుపద్మ, ఎడ్ల అశోక్‌రెడ్డితో పాటుభూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జీ చందుపట్ల కీర్తిరెడ్డి అభ్యతరం తెలిపారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతున్నంత సేపు సభ గందరగోళంగా మారింది.

ఏటీఎంకు నిప్పుపెట్టిన అగంతకుడు

కేపీహెచ్‌బీకాలనీ, ప్రభన్యూస్ : ప్రజ లు సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను 24 గంటల్లో మీడియాలో ప్రచురించకపోతే ఆత్మహత్య చేసుకుం టానని ఓ వ్యక్తి ఏటీఎంలో లేఖను వదిలిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు ఆదివారం కేపీహెచ్‌బీకాలనీ సీఐ కుషాల్కర్ తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-1 పరిధిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలోకి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం తెల్లవారు జామున 3.25 గంటల ప్రాంతంలో ప్రవేశించి వైర్లు, ఇతర సామాగ్రి సహయంతో ఏటీఎంను తగలబెట్టడంతో రెండు సీసీ కెమెరాలు కూడా దగ్ధమయ్యాయి. అంతేకాకుండా ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారాలతో కూడిన 17 పేజీల ప్రతులను ఏటీఎంలో వదిలి వెళ్లాడు. మీడియా ఈ సమస్యలను 24 గంటల్లో ప్రసారం చేయాలని లేని పక్షంలో తాను ఆత్మహత్య చేసుకుంటానని లేఖలో పేర్కొన్నాడు.

ప్రసంగాలొద్దు..చేసి చూపించండి

- కర్నాటకలో దూకుడుగా రాహుల్ ప్రచారం
- బస్సు యాత్రతో జిల్లాలు చుట్టేస్తున్న కాంగ్రెస్ అధినేత
- మోడీ, బీజేపీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు
- అవినీతిలో బీజేపీ ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిందని వ్యాఖ్య
- సిద్ధరామయ్య ఐదేళ్లపాలనలో ఒక్క స్కాం జరగలేదన్న రాహుల్
- రాహుల్ వ్యాఖ్యలకు యడ్యూరప్ప కౌంటర్



కొప్పాల్(కర్నాటక): కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దూకుడు పెంచారు. కర్నాటక ఎన్నికల నేపథ్యంలో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్డీఏ ప్రభుత్వమే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆదివారం కర్నాటకలోని కొప్పాల్ లో పర్యటించిన రాహుల్..సిద్ధరామయ్య ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కుంభకోణ రహిత పాలనను అందిస్తే గతంలో అధికారంలో బీజేపీ సర్కారు అవినీతి, అక్రమార్జనలో ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిందని దుయ్యబట్టారు. కర్నాటకలో గత ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క స్కాం కూడా జరగలేదని స్పష్టం చేసిన రాహుల్ గాంధీ.. బీజేపీ హయాంలో జరిగిన మైనింగ్, ఇతర కుంభకోణాలను వివరిస్తూ ప్రచారాన్ని సాగించారు. జనాశీర్వాద్ యాత్రలో భాగంగా కొప్పాల్ జిల్లాలో రాహుల్ రోడ్ షో నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి సిద్ధరామయ్యనే గెలిపించాలంటూ ప్రచారాన్ని సాగించారు.మరోసారి కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలో నిలబెడితే ప్రజల కోసం మరింతగా కృషి చేస్తుందని చెప్పుకొచ్చారు. కర్నాటక నాయకులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ.. కార్యకర్తలు,నాయకుల్లో నూతనోత్తేజం నింపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సీఎం సిద్ధరామయ్యతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ప్రధాని నరేంద్రమోడీ తన బహిరంగ సభలో కర్నాటకలో అవినీతి గురించి ప్రస్తావించడాన్ని గుర్తు చేస్తూ.. రాష్ట్రంలో రెండు పార్టీల ట్రాక్ రికార్డులను ఒక్కసారి పరిశీలిస్తే మోడీకి అసలు విషయం అర్థమౌతుందని అన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వంలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారని.. అవినీతి కేసుల్లో నాటి కేబినెట్ లోని నలుగురు మంత్రులు జైలుకెళ్లారని విమర్శించారు. అయినప్పటికీ మోడీ అవినీతి గురించి కర్నాటకలో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(జే) ప్రకారం హైదరాబాద్ నిజాం పాలనలోని కర్నాటక ప్రాంతాలకు ప్రత్యేక హోదా దక్కేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గతంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాటి ఉప ప్రధాని ఎల్కే అద్వానీ హైదరాబాద్ నిజాం పాలనలోని కర్నాటక ప్రాంతాలకు ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇంతవరకు నెరవేరలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆశాపేటికలో పెట్టిన హామీలను కూడా కాంగ్రెస్ నెరవేరుస్తుందని చెప్పుకొచ్చారు. కరువు పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం రైతు రుణాలను మాఫీ చేయకపోవడాన్ని రాహుల్ తప్పుబట్టారు. నిరుద్యోగం, నోట్లరద్దు, జీఎస్టీ వంటి అంశాలపై మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పోరాటం చేస్తోందని మండిపడ్డారు. జీఎస్టీని గబ్బర్ సింగ్ టాక్స్‌గా మరోసారి అభివర్ణించారు.


హామీల మాటేంటి?

కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ ప్రధానమంత్రి నరేంద్రమోడీయే లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. మోడీజీ..కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే ప్రసంగాలు ఇవ్వడం మానుకుని.. చేయాల్సిన పని గురించి ఆలోచించండి అంటూ చలోక్తులు విసిరారు. ఎన్డీఏ ప్రభుత్వం తమ కాలపరిమితి ముగిసిపోయేనాటికి కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చదని రాహుల్ జోస్యంచెప్పారు. మోడీ వస్తే దేశంలో ఉద్యోగ కల్పన పెరుగుతుందని గతంలో చేసిన ప్రకటనలకు చేస్తున్న దానికి పొంతనలేదని మండిపడ్డారు. మోడీ ప్రతీసారి బసవన పేరును స్మరిస్తారు కానీ ఆయన మాటలను ఆచరణలో పెట్టరు అని విమర్శించారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ నేటి నుంచి మూడు జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు.



మోడీపై రాహుల్ క్రికెట్ కామెంట్

సింధనూర్, కర్నాటక: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాన నరేంద్ర మోడీని వికెట్ కీపర్‌వైపు చూస్తూ ఆడే క్రికెట్ బ్యాట్స్‌మెన్‌తో పోల్చారు. ఆదివారమిక్కడ ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. సచిన్ టెండూల్కర్ వికెట్ కీపర్ వైపు చూస్తూ బ్యాటింగ్ చేసినట్టయితే ఆయన ఒక్క పరుగైనా చేయగలరా? మన ప్రధానమంత్రి అలాంటి క్రికెట్ క్రీడాకారుడే. ఆయనకు బంతి ఎక్కడి నుంచి వస్తున్నదో అంతు పట్టక వికెట్ కీపర్ వంక చూస్తుంటారు అని రాహుల్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.



రాహుల్‌కు గోల్డ్ గిఫ్ట్‌లే ఇష్టం

కర్నాటక ఎన్నికల ప్రచారంలో రాహుల్ బీజేపీ,మోడీయే లక్ష్యంగా విమర్శలు సంధిస్తున్న నేపథ్యంలో బీజేపీ కర్నాటక చీఫ్ యడ్యూరప్ప రాహుల్ పై తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి బంగారు, వెండి విలువైన బహుమతులను తీసుకుంటూ విలువైన బాస్ గా కీర్తి గడించారని మండిపడ్డారు. శనివారం హోస్పేటలో కాంగ్రెస్ లో చేరిన స్వతంత్ర ఎమ్మెల్యే బి.నాగేంద్ర రాహుల్ కు రూ. 60 లక్షల విలువైన బంగారు పూత పూసిన వాల్మీకి విగ్రహాన్ని బహుకరించారని ..దీంతోనే రాహుల్ కాస్లీ బాస్ అని తేలిపోయిందన్నారు. గతంలోనూ కర్నాటక సీఎం సిద్ధరామయ్య కాస్లీ వాచ్‌ను పొంది వివాదాల్లోచిక్కుకున్నారని ట్విట్టర్ వేదికగా విమర్శలు సంధించారు.

స్మార్ట్ సిటీలకు రూ.9,940 కోట్లు

- ఏపీవాటా 588 కోట్లు
- తెలంగాణకు దక్కింది 96 కోట్లే
- కేంద్రం విడుదల చేసిన నిధుల లెక్కలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల మిషన్ కోసం రాష్ట్రాలకు ఇప్పటిదాకా రూ.9,940 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం అందులో సింహభాగం అన్నట్టుగా మహారాష్ట్రకు రూ.1,378 కోట్లు, ఆ తర్వాతి స్థానంలో మధ్యప్రదేశ్‌కు రూ. 984 కోట్లు అందాయి. బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కింద కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ 99 నగరాలకు కేంద్ర సాయాన్ని ప్రకటించింది. ఈ నగరాలకు ప్రతిపాదిత మొత్తం పెట్టుబడి రూ.2.03 లక్షల కోట్లు. ఏపీ కు మొత్తం రూ. 588 కోట్లకుగాను విశాఖపట్టణానికి రూ.196 కోట్లు, కాకినాడ కు రూ.196 కోట్లు, తిరుపతికి రూ.196 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన మొత్తం అమరావతికి అందింది. తెలంగాణరాష్ట్రానికి మొత్తం రూ.96 కోట్లకు టగాను గ్రేటర్ హైదరాబాద్‌కు రూ.2 కోట్లు,గ్రేటర్ వరంగల్‌కు రూ.94 కోట్లు అందించింది. స్మార్ట్ సిటీల మిషన్ కింద అత్యధికంగా 11 నగరాలు ఎంపికకాబడిన తమిళనాడుకు రూ.848 కోట్లు, కర్నాటక రాష్ట్రానికి రూ.836 కోట్లు, రాజస్థాన్‌కు రూ.784 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ.547 కోట్లు, గుజరాత్‌కు రూ.509 కోట్లు విడుదల చేసింది.కేంద్రం నుంచి ఇప్పటివరకు చెరి రూ.200 కోట్లు అందుకున్న రాష్ట్రాలలో అస్సాం, బీహార్, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, త్రిపుర ఉన్నాయి. దాదాపు రూ.100 కోట్లు అందుకున్న రాష్ట్రాల్లో మణిపూర్, నాగాలాండ్, సిక్కిమ్ ఉన్నాయి.



మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌ను దివ్యాంగుల ఫ్రెండ్లీ జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో ఓ మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, చిత్రంలో మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్..

జమ్ములో ముష్కరుల వేట

- కమాండోల గాలింపు చర్యల్లో ముగ్గురి మృత దేహాల లభ్యం
- ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం
- భారీ మందుగుండు సామాగ్రి..ఏకే 56 రైఫిల్స్ స్వాధీనం
- ఇంకా కొనసాగుతున్న గాలింపు

సుంజ్వాన్ (జమ్ము): జమ్ము నగర శివారులోని సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడిలో అమర జవాన్ల సంఖ్య 5కు చేరింది. జైషే మహ్మద్ ఉగ్రదాడిలో ఓ పౌరుడు కూడా మరణించగా..గాయపడిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. సైనిక దుస్తుల్లో ఆర్మీక్యాంప్ లోని ఫ్యామిలీ క్వార్టర్‌లోకి చొరబడటంతో ..మొదట క్వార్టర్స్ లోని వారిని ఖాళీ చేయించిన తర్వాత జవాన్లు ముష్కరుల పనిపట్టారు. ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆర్మీ.. వారి నుంచి ఏకే-56 రైఫిల్స్, అండర్ బ్యారెల్ గ్రనైడ్ లాంచర్, యుద్ధసామగ్రి, గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్మీ క్వార్టర్స్‌లో కమాండోలు గాలింపు చర్యలు నిర్వహిస్తుండగా.. మరో జూనియర్ కమిషన్డ్ అధికారి, ఇద్దరు జవాన్లు, ఓ వృద్ధుడి మృతదేహాలు లభించినట్లు ఆర్మీ అధికార ప్రతినిధి తెలియజేశారు. పౌరుడు సహా ఐదురుగు జవాన్లు ఉగ్రవాదుల కాల్పుల్లోనే హతమైనట్లు ధృవీకరించారు. ఉగ్రదాడిలో గాయపడిన 14 ఏళ్ల బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని.. అతడికి కూడా సీరియస్‌గా ఉన్నట్లు వెల్లడించారు. ఉగ్రదాడి నేపథ్యంలో క్వార్టర్స్ నుంచి చాలా మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా..మిగతా వారికి భద్రత పెంచారు. ఆర్మీ క్యాంప్ పై ఉగ్రదాడి చివరి సారిగా 2016, నవంబర్ 29న జరిగింది. నగ్రోటా సైనిక శిబిరంపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు జవాన్లు అమరులు కాగా వారిలో ఇద్దరు అధికారులు కూడా ఉన్నారు. దాడి జరిపిన నలుగురు ఉగ్రవాదులను ఆ తర్వాత సైన్యం మట్టుబెట్టింది.



ఎన్‌కౌంటర్ ప్రాంతానికి రావద్దు

సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్ సమీపంలోని ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం వైపు స్థానికులు రావద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్ కౌంటర్ వార్త తెలిసినప్పటి నుంచి ఘటనా స్థలాన్ని చూసేందుకు స్థానికులు గుంపులు గుంపులుగా వస్తుండటంతో పోలీసులు ఈ ప్రకటన చేశారు. భద్రతా కారణాల రీత్యా ఎన్ కౌంటర్ పరిసర ప్రాంతాల్లోకి రావద్దని దక్షిణ జమ్ముఎస్పీ సందీప్ చౌదరి సూచించారు. ప్రజల భద్రత నేపథ్యంలోనే ఆంక్షలు విధించామన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు మత సామరస్యాన్ని పాటించాలని అన్నారు. ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించామన్నారు.

శిశువుకు జన్మనిచ్చిన క్షతగాత్రురాలు

ఉగ్రదాడిలో గాయపడిన గర్భిణి పండంటి శిశువుకు జన్మనిచ్చింది. శనివారం ఆర్మీ క్యాంప్‌లోని ఫ్యామిలీ క్వార్టర్స్ వైపు నుంచి చొరబడిన జైషేమహ్మద్ ఉగ్రవాదులు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో గర్భిణి గాయపడింది. జవాను నజీర్ అహ్మద్ ఆయన భార్య (గర్భిణి) కాల్పుల్లో గాయపడటంతో వెంటనే మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. రేయింబవళ్లు శ్రమించిన వైద్యులు తల్లి, బిడ్డను సురక్షితంగా కాపాడారని పీఆర్వో దేవేందర్ ఆనంద్ తెలిపారు.

ఉగ్రదాడిని ఖండించిన రాహుల్

సుంజ్వాన్ ఉగ్రదాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఖండించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంతో పార్టీలకతీతంగా నేతలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. దాడిలో అమరులైన జవాన్ల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని రాహుల్ ఆకాంక్షించారు.

భద్రతా సిబ్బందికి స్థానికుల సాయం

సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతా సిబ్బంది ఆ ప్రాంతంలో నిఘా పెంచారు. వందలాది మంది పోలీసులు.. పారామిలిటరీ సిబ్బంది పరాహా కాస్తున్నారు. అయితే స్థానికులు వారికి తమ వంతు సాయం చేస్తూ... మన్ననలు పొందుతున్నారు. భద్రతా సిబ్బందికి మీల్స్, టిఫిన్స్, టీ లాంటివి అందజేస్తూ తమ ఉదారాన్ని చాటుకుంటున్నారు. సంజీవ్ మన్మోత్రా నేతృత్వంలో ఆహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మన్మోత్రా మాట్లాడుతూ.. మేం చేస్తున్న చిన్న ప్రయత్నమిది. మేం దేశానికి సేవ చేయాలనుకున్నాం. అందుకే దేశ సేవలో ఉన్న వారికి అవసరమైన ఆహారం అందజేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కాశ్మీర్ లోయ ప్రాంతంలో తప్పుదోవ పడుతున్న యువతకు మంచిసందేశం అందుతుంది. భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వుతూ ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు పలుకుతున్న యువత ఇకనైనా మారుతారని ఆశిస్తున్నాం.అని తెలిపారు.



శ్రీనగర్, కుప్వారాలో ఆంక్షలు

జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీనగర్, కుప్వారా లోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. జమ్ము కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు మక్బూల్ భట్ వర్ధంతి సందర్భంగా వేర్పాటువాదులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆంక్షలు విధించారు. 1984లో ఢిల్లీలోని తీహార్ జైలులో మక్బూల్ ను ఉరితీసిన నేపథ్యంలో అప్పటి నుంచిఆయనవర్ధంతి రోజు వేర్పాటు వాదులు హింసకు పాల్పడుతున్నారు.

ఆకాశంలో ఎదురెదురు..

- విస్తారా విమానయాన పైలట్లు ఇద్దరు సస్పెండ్
- విచారణ ప్రారంభించిన ఏఏఐబీ

ముంబై: ఆకాశంలో ఓ పెనుప్రమాదం తప్పింది. ఎయిర్ ఇండియా, విస్తారా విమానాలు గగనతలంలో ఎదురెదురుగా అతి సమీపంలో వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన దర్యాప్తును ఏయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రారంభించింది. ఫిబ్రవరి 7న, విస్తారాకు చెందిన యూకే 997 విమానం ఢిల్లీ నుండి పుణే వెళ్తున్నది. ఈ విమానంలో 109 మంది ప్రయాణికులు ఉన్నారు.
వెంటనే పైలట్లు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఆటోమేటిక్ వార్నింగ్ అలారమ్ మోగడంతో అప్రమత్తమైన ఏయిర్ ఇండియా పైలట్ ప్రమాదాన్ని నివారించినట్టు అధికారి ఒకరు తెలిపారు. ఏయిర్ ఇండియా విమానం ముంబై నుండి భోపాల్‌కు వెళ్తున్నది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు విస్తారా విమాన పైలట్లను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తొలగించింది. ఈ ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు. ట్రాఫిక్ కొల్లీషన్ అవైడెనెస్ సిస్టం ట్రాఫిక్ కారణంగా అలర్ట్ చేసిందని, ప్రమాదం నుండి తప్పించడానికి పైలట్ ప్రయత్నించాడని, దీనిపై దర్యాప్తు కొనసాగుతుందని విస్తారా ప్రతినిధి వివరించారు.

విదేశీ వైద్యవిద్యకూ' నీట్'

న్యూఢిల్లీ: విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించాలనుకునే అభ్యర్థులకు కూడా నీట్‌ను ఆపాదించేలా కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే విదేశీ వైద్యకోర్సు చదివి తద్వారా డాక్టరుగా మారాలనుకుంటున్న స్వదేశీ విద్యార్థులు కూడా నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)లో అర్హత సాధించాలి. అప్పుడే ఏదేశంలోనైనా వారు వైద్య విద్య అభ్యసించేందుకు అర్హులవుతారు. ప్రస్తుతం విదేశాల్లో ఆయా దేశాలకు చెందిన యూనివర్సిటీలు వారిపాలనతీరుకు తగ్గట్టుగా నియమ నిబంధనలు కలిగి ఉన్నాయి. దీంతో ఇండియాలో ఎంబీబీఎస్ కోర్సుకు అర్హత సాధించలేనివారు సైతం విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి డాక్టర్లుగా మారుతున్నారు. కాగా భారత్‌లో ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ చేయాలన్నా లేక ప్రైవేట్ కళాశాలలో చదవాలన్నా నీట్ అర్హత సాధించాలన్న నిబంధన అమల్లో ఉంది. ఈ నీట్ నిబంధన 2016 నుంచి అమలులో ఉంది. ఈసందర్భంగా ఆరోగ్యమంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ విదేశాల్లో మెడికల్ కోర్సు చేసిన 12 నుంచి 15శాతం గ్రాడ్యుయెట్లు కోసం ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్‌ను మెడికల్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది. వీరిలో చాలామంది చైనా, రష్యా దేశాలకు ఎక్కువగా వెళుతున్నారన్నారు.

'త్రిపురలో సీపీఎం సమాప్తం'

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన జైట్లీ



అగర్తల: త్రిపురలో పాలక సీపీఎం నేతృత్వంలోని వామపక్ష కూటమికి ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ ఆవిర్భవించిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. త్రిపుర ఎన్నికలకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టో - విజన్ డాక్యుమెంట్-2018 ని ఆదివారమిక్కడ ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్షేతర, వామపక్ష అనే రెండు రాజకీయ శిబిరాలు ఉన్నాయి. బీజేపీ వామపక్షేతర శిబిరాన్ని తనదిగా చేసుకుంది. సిపిఎంకు ప్రధాన ప్రత్యర్థిగా ఆవిర్భవించింది అని జైట్లీ తెలిపారు. త్రిపుర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వామపక్ష కూటమిని ఎదుర్కొనేందుకు ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టి) తో బీజేపీ చేతులు కలిపింది. ఎన్నికల తర్వాత పశ్చిమ బెంగాల్‌లో పట్టిన గతే త్రిపురలో సీపీఎంకు పడుతుందని కేంద్ర మంత్రి అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం అవలంబించిన హింసాత్మక ఎత్తుగడలు ప్రజల్లో ఏహ్యభావానికి దారి తీసింది. ఫలితంగా ఆ పార్టీ పతనమైపోయింది. కడకు ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లోనూ ఆ పార్టీ మూడు లేదా నాల్గవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది అని ఆయన విమర్శించారు. బీజేపీ మేనిఫెస్టో గురించి మాట్లాడుతూ త్రిపురలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్, వెదురు, ఐటీ, జౌళి లాంటి వేర్వేరు రంగాలకు ప్రత్యేక ఆర్థిక మండళ్ళను(సెజ్‌లు) బీజేపీ నెలకొల్పుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.

మోసం చేయడమే వామపక్షాల లక్ష్యం



మోహన్‌పూర్(త్రిపుర): త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బీజేపీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ర్యాలీలు, రోడ్‌షోలతో హోరెత్తిస్తున్నారు. ఆదివారం త్రిపురలోని మోహన్‌పూర్‌లో 8 కి.మీలు రోడ్‌షో నిర్వహించిన షా.. లెఫ్ట్ పార్టీలపై నిప్పులు చెరిగారు. వామపక్షాలు ప్రజలను మోసం చేస్తున్నాయని తీవ్ర విమర్శలు చేసిన అమిత్ షా..వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అభ్యర్థించారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష పార్టీల అధికారానికి బీజేపీ బీటలువేసిందని..పారదర్శకతకే ప్రజలు పట్టంకట్టాలని విజ్ఞప్తి చేశారు.రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా.. పరోక్ష విమర్శలు సంధించారు.కాంగ్రెస్ చీఫ్ ఇతరుల ఓట్లను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

మేఘాలయ ఎన్నికల్లో విదేశీ ఓట్లు


యుమిన్సు: మేఘాలయలో ఫిబ్రవరి 27న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్, ఇండోనేషియా దేశాలు ఓట్లువేసి వారి ప్రతినిధులను ఎంచుకోనున్నాయి. ఆయా దేశాలు మన మేఘాలయలో వారి ప్రతినిధులను ఎన్నుకోవటం వినటానికి ఒకింత ఆశ్చర్యం కలిగించినా ఆయా దేశాల పేర్లతో ఓట్లు విషయం మాత్రం యథార్థమే. కాకపోతే ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్, ఇండోనేషియా అనేవి ఓటర్ల పేర్లు. ఆయా దేశాల పేర్లతో ఉన్న ఓటర్లు ఈస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలోని షెల్లా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన యుమిన్సు -త్మార్ ఎలాకా గ్రామానికి చెందినవారు. ఎలాకా ఎన్నికల అధికారి (సిర్దార్) ప్రీమియర్ సింగ్ విలేఖరులతో మాట్లాడుతూ ఈ చిన్న గ్రామంలో ఉన్న సుమారు యాభైశాతం గ్రామస్థులకు ఇంగ్లీష్ అంటే అభిమానం అన్నారు. అయితే ఆయా పదాల ఖచ్చితమైన అర్థాలు కూడా వారికి తెలియదన్నారు. ఈ గ్రామం ఇండియా, బంగ్లాదేశ్ సరిహద్దుకు చేరువలో ఉందన్నారు. 850మంది పురుష ఓటర్లు, 916మంది మహిళా ఓటర్లు ఈ గ్రామంలో ఉన్నారని ఆయన తెలిపారు.

దేశం కోసం ఆర్‌ఎస్‌ఎస్ సైన్యం



ముజఫర్‌పూర్: దేశం కోసం పోరాడాల్సిన పరిస్థితి వస్తే మూడు రోజుల్లో ఒక సైన్యాన్ని సిద్ధం చేసే సామర్థ్యం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు ఉందని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ధీమాగా చెప్పారు. ఆదివారమిక్కడి జిల్లా పాఠశాల మైదానంలో స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ భారత సైన్యానికి సైనికులను సన్నాహకం చేయడానికి ఆరు నుంచి ఏడు నెలలు పడుతుంది. అదే సంఘ్ వద్దకు వస్తే ఆ పని మూడు రోజుల్లో అయిపోతుంది. మా సామర్థ్యం అలాంటిది. దేశం అలాంటి ఒక పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు, రాజ్యాంగం అనుమతించిన పక్షంలో ముందు వరుసలో నిలబడటానికి స్వయంసేవకులు సిద్ధంగా ఉంటారు అని భగవత్ అన్నారు. సంఘ్ ఒక మిలటరీ కాదు పారా మిలటరీ వ్యవస్థ కాదు కానీ అది ఒక కుటుంబ వ్యవస్థ. సైన్యం తరహాలో క్రమశిక్షణ పాటిస్తుంది అని తెలిపారు. దేశం కోసం మహోన్నతమైన త్యాగం చేయడానికి సంఘ్ కరసేవకులు నిత్యం చిరునవ్వుతో సిద్ధంగా ఉంటారని ఆయన అన్నారు.

రజినీ రంగు కాషాయమైతే కూటమి అసంభవం



కేంబ్రిడ్జ్: నటుడు కమల్ హాసన్ మరోసారి హాట్ కామెంట్ చేశారు. రజినీ కాంత్ బీజేపీతో జతకడితే ఆయన పార్టీతో కూటమి ఏర్పాటు అసంభవమని కుండబద్దలు కొట్టారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు ఇటీవల ప్రకటించిన కమల్ చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్ గా మారాయి. రజినీ కాంత్ బీజేపీతో జతకట్టరని నేను భావిస్తున్నా..ఒకవేళ ఆయన బీజేపీతో పొత్తుపెట్టుకుంటే మేం ఆయన కూటమిలో చేరడం అసంభవం. అని కమల్ హాసన్ చెప్పుకొచ్చారు. రజినీకాంత్‌తో ఎన్ని విభేదాలున్నప్పటికీ.. ఆయనతో కలిసిపనిచేసేందుకు తాను ఎప్పుడూ సిద్ధమే అని ప్రకటించిన కమల్.. కాషాయం విషయంలో తనకున్న అభిమతాన్ని బయటపెట్టారు. తమిళనాడులోని ప్రధాన రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్ననేపథ్యంలో త్వరలో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు కమల్ స్పష్టం చేశారు.

' నోహెల్మెట్... నో పూజ'

సరళాదేవి ఆలయంలో కొత్త రూల్స్



పరదీప్(ఒడిశా): ఈ రోజుల్లో హెల్మెట్ వాడకం అన్నివిధాలా శ్రేయస్కరం. ఒకో సమయంలో ప్రాణాల్ని కాపాడుతాయి. హెల్మెట్ లేకుండా ఒడిశా రాష్ట్రంలోని పరదీప్‌లోని ఓ దేవాలయంలో పూజారులు పూజ నిరాకరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలోని ప్రతిష్ఠాత్మక సరళాదేవి మాతా ఆలయ పూజారులు మాత్రం హెల్మెట్ లేకపోతే తాము పూజ చేయబోమని ఖచ్చితంగా చెప్పేస్తున్నారట. కొత్తగా ద్విచక్ర వాహనం కొనుక్కొని ఎవరు వచ్చినా, హెల్మెట్ చూపితేనే పూజ చేస్తామని చెప్పడమే కాదు లేనివారిని హెల్మెట్‌తో వస్తేనే పూజచేస్తామని తిప్పి పంపుతున్నారట. స్థానిక పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆలయ పూజారులు ఈ నిర్ణయం తీసుకున్నారట. ఆలయ పరిసరాల్లో కూడా పలుచోట్ల 'నో హెల్మెట్... నో పూజ' అనే బోర్డులు పెట్టడంతో దేవి దర్శనానికి వచ్చిన భక్తులంతా హెల్మెట్ అవసరంపై చర్చించుకుంటున్నారని పూజారులు చెబుతున్నారు.అయితే, ప్రయాణికుల వ్యక్తిగత భద్రతకు సంబంధించిన కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని పూజారులు వెల్లడిస్తున్నారు. ఈ సరళాదేవి మాతా ఆలయం 100 సంవత్సరాలకు పైగా పురాతనమైనదని పూజారులు చెప్పారు. అందుకే ఆ దేవాలయానికి వచ్చి పూజ చేయించుకుంటే మంచిదని భక్తులు భావిస్తున్నారని, ఈ దేవాలయంలో 'నోహెల్మెట్... నోపూజ'ను అమలుచేయాలని భావించామని ఎస్పీ జై నారాయణ్ పంకజ్ తెలిపారు.


నయనతార

ఎప్పుడూ ఏదో ఒక విషయంపై వార్తలలో వ్యక్తిగా ఉన్నప్పటికీ ఆ ప్రభావం నయనతారపై ఎంతమాత్రం పడలేదు. ఆమె చుట్టూ రకరకాల కథానాలు వెల్లువెత్తిన ప్రతీసారి ఆమె వాటిని ఎంతమాత్రం పట్టించుకోలేదు. సాధారణంగా అదే సమయంలో ఇంకెవరైనా అయితే వత్తిడికి గురవుతారు. దాంతో సినిమాలు తగ్గుతాయి. అయితే నయనతార మాత్రం తాను దేనికీ భయపడనని...తన మనసుకు నచ్చిన బాటలోనే ముందుకు సాగుతానని ధైర్యంగా ముందుకు సాగింది. నిర్భీతిగా అలా ముందుకు సాగడం వల్లే...ఆమెకు ఎప్పుడూ సినిమాలు తగ్గలేదు. తాను కథ నచ్చక అంగీకరించకపోతే తప్ప చేతినిండా చిత్రాలతో లేడీ సూపర్‌స్టార్‌గా కూడా పిలిపించుకుంటోంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఏడు చిత్రాల వరకు ఉన్నాయి. వాటిలో ఐదు తమిళ సినిమాలు కాగా

మోతమోగిస్తున్న నయన్

తెలుగు, మలయాళ భాషలలో ఒక్కో చిత్రం చొప్పున ఆమె నటిస్తోంది. తమిళంలో చేస్తున్న ఐదు చిత్రాలలో నాలుగు చిత్రాలు హీరోయిన్ ఓరియెంటెడ్ కావడం ఓ విశేషం. దీనిని బట్టి కోలీవుడ్‌లో నయన్ స్టార్‌డమ్ ఎలా వెలుగొందుతుందో వేరుగా చెప్పనక్కరలేదు. గతంలో వచ్చిన హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలు మాయ, అరమ్ ఘన విజయమే ఆమె పేరు మారుమోగడానికి కారణం అంటున్నారు. ఓ వైపు ఈ తరహా చిత్రాలు చేస్తూనే, హీరోల సరసన కూడా ఆమె నటిస్తోంది. తాను ఏ హీరో సరసన నటించినప్పటికీ కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం తెలుసుకున్న తర్వాతే ఆమె సినిమాలను అంగీకరిస్తోంది.

కాగా తాజాగా ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన ఇమైకా నోడిగళ్ చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, ఆమె ప్రధాన పాత్రలోనే కొలైతూర్ కాలమ్, కొలమాను కోకిల చిత్రాలు తెరకెక్కుతున్నాయి. మరోవైపు మలయాళంలో లవ్ యాక్షన్ డ్రామా అనే చిత్రంతో పాటు తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సైరా నరసింహారెడ్డిలో కూడా నయనతార మెరవనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలే కాకుండా తాజాగా అజిత్, దర్శకుడు శివల కలయికలో రూపొందనున్న విశ్వాసం అనే తమిళ సినిమాలో కూడా నయనతారను ఎంపికచేశారట. గతంలో అజిత్‌తో కలిసి నయనతార నటించింది. అజిత్ కాంబినేషన్ అనే కాదు తన పాత్ర కూడా బావుండటంతో ఆమె ఆ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందట. ఇదిలావుండగా...సార్జన్ అనే వర్ధమాన దర్శకుడు తెరకెక్కించబోయే చిత్రంలో కూడా నయనతారే ప్రధాన పాత్రలో నటించనుందట. లోగడ లక్ష్మీ, మా అనే లఘు ఛిత్రాలను తీసిన ఆయన సత్యరాజ్ ప్రధాన పాత్రలో ఓ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రం విడుదలకు ముస్తాబవుతున్న తరుణంలో ఆయన తదుపరి చిత్రం కథానాయికగా నయన్‌ను ఎంచుకున్నారట. ఇది కూడా హారర్ కథాంశంతో తెరకెక్కుతుందట. ఇలా నయన్ తన హవాను కొనసాగిస్తూనే ఉంది.


నితిన్, మేఘాఆకాష్

పవర్‌స్టార్ విడుదల చేసిన
చల్‌మోహన్ రంగ ఫస్ట్‌లుక్

నితిన్, మేఘాఆకాష్ జంటగా రూపొందుతున్న చిత్రం చల్‌మోహన్ రంగ. కృష్ణచైతన్య దర్శకుడు. శ్రేష్ట్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. నితిన్ నటిస్తున్న ఈ 25వ చిత్రానికి త్రివిక్రమ్ కథను అందిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ తన ట్విట్టర్‌లో ఆదివారం ఉదయం విడుదలచేసి, చిత్రబృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా హీరో నితిన్ స్పందిస్తూ...తన అభిమాన కథానాయకుడైన పవన్‌కల్యాణ్ ఈ చిత్రం ప్రచార చిత్రాలను విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, మా యూనిట్ తరపున పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ చిత్రం టీజర్‌ను ప్రేమికులరోజు అయిన ఈ నెల 14న, సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమాకు సంబంధించి మిగిలివున్న ఒక్క పాటను ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నామని తెలిపారు. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఈ చిత్రం షూటింగ్ జరిపామని ఆయన చెప్పారు.

దర్శకుడు కృష్ణచైతన్య మాట్లాడుతూ, ప్రేమతో కూడిన కుటుంబ కథాచిత్రమిది. చాలా సరదాగా సాగుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి అని తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రలలో .కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, షమ్మి సాయి, రాజశ్రీనాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బాల తారలు హాసిని, కృత్తిక, జోయ్, లిఖిత్, స్నేహిత్, స్కందన్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, సంగీతం: తమన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు: శేఖర్.వి.జె., పోరాటాలు: స్టంట్ సెల్వ, రవివర్మ.


అల్లుఅర్జున్

క్లైమాక్స్‌లో నా పేరు సూర్య

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం నా పేరు సూర్య (నా ఇల్లు ఇండియా). అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ చాలామటుకు పూర్తయింది. సోమవారం నుంచి క్లైమాక్స్ చిత్రీకరణ మొదలవుతున్నట్లు తెలిసింది. ఈ చిత్రం కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుని మరీ అల్లు అర్జున్ ఆర్మీ అధికారిగా తన పాత్రలో కొత్తగా కనిపించబోతున్నారు. సన్నివేశాలతో పాటు పాటలను ఆకట్టుకునేవిధంగా రూపొందించారట. ముఖ్యంగా ఇందులోని సైనికులకు సంబంధించిన అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ పాట ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేస్తుందని చిత్రబృందం తెలిపింది. అలాగే కొన్ని డైలాగులు ఆకర్షణీయంగాను, స్ఫూర్తిదాయకంగాను ఉంటాయట. చచ్చిపోతాను గాడ్‌ఫాదర్...కానీ ఇక్కడ కాదు...బోర్డర్‌కెళ్లి..వంటి డైలాగులకు ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని, ఈ తరహా డైలాగులు చిత్రాన్ని మరోస్థాయికి తీసుకెళ్లేలా ఉంటాయని చెబుతున్నారు. భారీ తారాగణంతో ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని, బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్, శేఖర్ సంగీతాన్ని అందించారని, ఏప్రిల్ 27న సినిమాను విడుదల చేయనున్నాం అని నిర్మాతలు తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజీవ్ రవి, ఎడిటింగ్‌ను కోటగిరి వెంకటేశ్వరరావును అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బన్ని వాసు.



అదే ప్రేమ కథల్లోని గొప్పదనం

- దర్శకుడు వెంకీ అట్లూరి

ఎన్ని తరహా చిత్రాలు వచ్చినా ప్రేమ కథలు ప్రేక్షకులను మెప్పిస్తూనే ఉంటాయన్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వం వహించిన తొలిప్రేమ గత శనివారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. అన్ని కేంద్రాల నుంచి సానుకూల స్పందన తెచ్చుకుంటోంది. తొలిప్రేమ విజయం సాధించిన నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తన సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. మొత్తం చిత్ర యూనిట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వెంకీ మాట్లాడుతూ....ఈ సినిమా విజయం నా పన్నెండేళ్ల నిరీక్షణ. మరోసారి ఇలాంటి సందర్భం రాకూడదనుకుంటాను. నేను దర్శకుడిని కావాలని ఆరేళ్లుగా కష్టపడుతున్నాను. ఇంతకాలం శ్రమించి చేసిన చిత్రానికి విజయం దక్కడం సంతృప్తిగా ఉంది. జీవితంలోని వివిధ దశల్లో ప్రేమ కథలను చూపించే చిత్రాలు 80వ దశకంలోనే వచ్చాయి. వాటికి భిన్నంగా ఉండేలా ఈ కథలో నేటి యువతక ు నచ్చేలా చాలా సహజంగా ఉండేలా కథా, మాటలు రాసుకున్నాను. ఇవాళ అదే ప్రేక్షకులకు నచ్చుతోంది. నేను ఎంతగా కథను ప్రేమించానో అదే విధంగా నా నటీనటులు వరుణ్, రాశీ, సాంకేతిక నిపుణులు ఇష్టపడ్డారు. వాళ్లే నాకు అండగా నిలబడ్డారు. పరిశ్రమకొచ్చినప్పటి నుంచి నన్ను ప్రోత్సహించిన గుర్రం గంగరాజు, దిల్‌రాజు గారు లాంటి వాళ్లకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి వరుణ్, నిర్మాతలు నమ్మి అవకాశమిచ్చారు. ప్రేమ కథలు మనం తీయట్లేదు కాబట్టి వాటి గొప్పదనం తగ్గిపోయింది అనుకుంటున్నాం కానీ...ఈ సినిమాలు చేసేవాళ్లుంటే తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తాయి. గత వారం ఛలో బాగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు మా సినిమా ఆకట్టుకుంటోంది. సినిమా చూసిన పరిశ్రమలోని పెద్దలు రాఘవేంద్రరావు, నాగబాబు, ఆర్ నారాయణమూర్తి, క్రిష్ గారు ఇలా చాలా మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. కథ ఫస్ట్ లవ్ గురించే కాబట్టి తొలిప్రేమ అనే పేరు సరిగ్గా సరిపోతుందని అనుకున్నాం. ఆ పేరు పెడుతున్నప్పుడు జాగ్రత్తగా చేయండి అంటూ చెప్పారు. కొంత చిత్రీకరణ చేశాక...మాకు నమ్మకం కలిగి తొలిప్రేమనే ఖరారు చేసుకున్నాం.అన్నారు.


సంతోష్ కొంకా, రాజీవ్ కె.రామ

తెలుగులో గోదా

గతేడాది మలయాళంలో స్పోర్ట్స్ కామెడీ చిత్రంగా విడుదలైన గోదా తెలుగు హక్కులను కొంకా ప్రొడక్షన్స్ సంస్థకైవసం చేసుకుంది. టవీనొ థామస్, వామికా గబ్బి, రచయిత రెంజీ ఫనికర్ నటించిన ఈ చిత్రానికి బసిల్ జోసఫ్ దర్శకత్వం వహించారు. మాలీవుడ్‌లో చిన్న చిత్రంగా విడుదలై, మంచి విజయాన్ని అందుకున్న దీనిని బాలీవుడ్‌లో సైతం రీమేక్ చేసేందుకు భారీ నిర్మాణ సంస్థలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయని చెబుతున్నారు. తెలుగులో ఎంతోమంది పోటీపడగా కొంకా ప్రొడక్షన్స్ సంస్థకు చెందిన సంతోష్ కొంకా ఫ్యాన్సీ ఆఫర్‌తో ఈ చిత్రం హక్కులను పొందారు. ఈ విషయాన్ని సంతోష్ కొంకా తెలియజేస్తూ...ప్రస్తుతం తెలుగు రీమేక్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. తెలుగులో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని సంస్థ ఎగ్జిక్యూటివ్ రాజీవ్ కె.రామ తెలిపారు.

శర్వానంద్‌తో జోడీ!

శర్వానంద్ మినిమం గ్యారెంటీ ఉన్న కథానాయకుడు. శర్వానంద్‌తో సినిమాలు తీయడానికి పలువురు నిర్మాతలు, దర్శకులు ఆసక్తి చూపుతున్నారు. వైవిధ్యమైన కథలతో దర్శకులు సంప్రదిస్తున్నారు. అయితే తక్కువ చిత్రాల్లో నటిస్తూ తన ప్రత్యేకత చాటుకోవాలని శర్వానంద్ భావిస్తున్నట్టు తెలిసింది. ఆయన నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ ఇటీవలే కోల్‌కతలో మొదలైంది. హను రావిలప ూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాయిపల్లవి నాయికగా నటిస్తోంది. ఈ చిత్రంతో పాటుగా శర్వానంద్ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. స్వామి రారా ఫేమ్ సుధీర్ వర్మ దర్శకత్వంలో నటిస్తున్నాడు. లాంఛనంగా పూజాకార్యక్రమాలు జరిగాయి. మాఫియా నేపథ్యంలో జరిగే కథతో రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చిలో మొదలవుతుందని తెలిసింది. ఇకపోతే ఈ చిత్రంలో నాయికగా కల్యాణి ప్రియదర్శినిని ఎంపికచేసినట్టు సమాచారం. అక్కినేని అఖిల్ నటించిన హలో చిత్రం ద్వారా పరిచయమైన కల్యాణి ప్రముఖ దర్శకుడు ప్రియదర్శిన్, నటి లిజ్జి తనయ అనే విషయం తెలిసిందే. శర్వానంద్ సినిమా కోసం తొలుత కాజల్, నిత్యామీనన్ పేర్లు పరిశీలించినా చివరికి కల్యాణి ప్రియదర్శన్‌ను ఎంపికచేయడం విశేషం.


కల్యాణి ప్రియదర్శిని

మళ్లీ వస్తున్న రాకాసి బల్లులు...!



యాక్షన్ సినిమాలకు హాలీవుడ్ పెట్టింది పేరు. వీటిలో ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను ఆకట్టుకున్న చిత్రం జురాసిక్ పార్క్. ఈ సినిమా సిరీస్ చిత్రాలన్నీ వసూళ్లలో చరిత్ర సృష్టించాయి. ఒక్క సినిమాతో ఆగిపోకుండా కొనసాగింపు చిత్రాలతో గొలుసులు కట్టాయి. వీటిలో ఎక్కువ ఆసక్తి కలిగిస్తోంది జురాసిక్ పార్క్ కొత్త చిత్రం ఫాలెన్ కింగ్‌డమ్. మనలో చాలా మందికి పరిచయమీ హాలీవుడ్ చిత్రం. చిన్న పెద్దా అంతా ఇష్టపడి చూసే ఈ రాకాసి బల్లుల సినిమా ఇప్పటికే అత్యంత విజయవంతమైన సినిమా సిరీస్‌గా నిలిచింది. త్వరలో జురాసిక్ పార్క్ సిరీస్‌లో మరో కొత్త చిత్రం జురాసిక్ పార్క్ ఫాలెన్ కింగ్‌డమ్ రాబోతోంది. యూనివర్సల్ పిక్చర్స్ నిర్మాణంలో దర్శకుడు జేఏ బయోనా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

క్రిస్ పాట్, హోవార్డ్, బీడీ వాంగ్, జేమ్స్ క్రోమ్ వెల్ ప్రధాన పాత్రలు పోషించారు. డైనోసార్‌ల థీమ్ పార్క్‌లో అగ్ని పర్వతాల పేలుడు జరుగుతుంది. ఈ ప్రమాదం నుంచి డైనోసార్‌లను రక్షించే ప్రయత్నం చేస్తారు ప్రధాన పాత్ర ధారులు. ఈ క్రమంలో వాళ్లకు ఎదురైన సంఘటనలు ఏంటనేది ఆసక్తికరమైన కథాంశం. జురాసిక్ పార్క్ ఫాలెన్ కింగ్‌డమ్ సినిమా జూన్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్రీడాప్రభ



శివకేశవన్‌కు 34 స్థానం

భారతీయ వింటర్ స్పోర్ట్స్ పోస్టర్ బోయ్ శివకేశవన్ పోరాటానికి తెరపడింది. రెండు దశాబ్దాల అంతర్జాతీయ కెరీర్ లూగర్ పోటీల్లో 34వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. 36 ఏళ్ల కేశవ్ పురుషుల లూగర్ పిస్టల్ సింగిల్స్ విభాగంలో ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు. చివరి, ఆరవ ఒలింపిక్స్‌లో మూడో రౌండ్ వరకు చేరాడు. ఈ రౌండ్‌లో 40 మంది క్రీడాకారులు పోటీపడగా, 1344 మీటర్ల ట్రాక్‌ను 48.900 సెకన్లలో పూర్తి చేశాడు. దాంతో అతనికి 30వ స్థానం దక్కింది. మొత్తంగా మూడు రౌండ్ల తర్వాత 34వ స్థానంలో నిలిచాడు. పతకాన్ని నిర్దేశించే నాలుగవ రౌండ్‌కు చేరుకునేందుకు మూడు పరుగుల దూరంలో ఆగిపోయాడు. మూడు పరుగులు సాధించినట్లయితే టాప్ 20లో చోటు దక్కించుకునేవాడు. శనివారం ముగిసిన రెండో రౌండ్‌లోనూ కేశవ్ 34వ స్థానంలో ఉన్నాడు. తిరిగి ఆదివారం ముగిసిన మూడో రౌండ్‌లోనూ అదే స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అనూహ్యంగా ఆస్ట్రేలియా షూటర్ డేవిడ్ గ్లెయిర్‌స్కెర్ స్వర్ణం నెగ్గగా, క్రిస్ మజ్‌జర్ (అమెరికా) రజత పతకం దక్కించుకున్నాడు. తద్వారా తమ దేశానికి లూగర్ పిస్టల్ ఈవెంట్లో తొలిపతకాన్ని సాధించి పెట్టాడు. జర్మన్ క్రీడాకారుడు జోహన్నెస్ లుడ్విగ్‌కు కాంస్యపతకం లభించింది.

పాలబుగ్గల 'పసిడి' కొండ



పైయాంగ్‌చాంగ్: స్లోప్‌స్టయిల్ స్నోబోర్డు ఫైనల్ జంప్‌లో 17 ఏళ్ల అమెరికా కుర్రాడు విజేతగా నిలిచాడు. తద్వారా ద.కొరియాలో జరుగుతున్న చలింపిక్స్‌లో తొలి పసిడి విజేతగా రికార్డు కెక్కాడు. గెరార్డ్, 1928 తర్వాత శీతాకాల ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం అతని వయసు 17 సంవత్సరాల 227 రోజులు. ఇతను 29 జూన్ 2000లో జన్మించాడు. స్నోబోర్డు జంపింగ్‌లో ఇంతవరకు పతకాలు సాధించిన వారిలోనూ ఇతడే చిన్నవాడు. ఇదివరకు ఈ రికార్డు కెల్లి క్లార్క్ పేరిట ఉంది. 2002లో కెల్లి పతకం సాధించినప్పుడు ఆమె వయసు 18 ఏళ్ల 199రోజులు. 90 ఏళ్ల కిందట 16 ఏళ్ల బిల్లీ ఫిస్కే పేరు మీద ఉంది. 'దీన్ని నేను నమ్మలేకున్నాను. ప్రస్తుతం నాకు వణుకు పుడుతోంది. బహుశా చలి తీవ్రత కారణం కావొచ్చు. లేదా అంతులేని ఆనందం వల్ల కాబోలు. ఏదేమైనా నాకు పట్టరాని ఆనందంగా ఉంది. కలయా? నిజమా? అన్నట్లు ఉంది' అని గెరాడ్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

'లూరెస్' అరుదైన గౌరవం

- అమెరికన్ స్విమ్మింగ్ స్టార్ కేతీ లెడెక్కీ



న్యూఢిల్లీ: అమెరికన్ స్విమ్మింగ్ స్టార్ కేతీ లెడెక్కీ ప్రసిద్ధ లారెస్ ప్రపంచ క్రీడా మహిళ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ క్రీడారంగంలో అత్యుత్త ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లు లేదా జట్లకు ప్రతియేటా ఈ అవార్డులు ప్రదానం చేస్తుంటారు. క్రీడాకారులు జీవిత కాలంలో ఒకసారి ఈ అవార్డు వస్తే చాలని అనుకుంటారు. అలాంటిది లెడెక్కీ వరుసగా మూడో ఏడాది ఈ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. ప్రతిష్ఠాత్మక క్రీడా అవార్డు కు ఎంపిక కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. స్కెర్ మికీలా షిఫ్రి న్, టెన్నిస్ ఏస్‌స్టార్ సెరెనా విలియమ్స్, గార్బినె ముగు రు జా, అథ్లెట్లు అల్లిసన్ ఫెలిక్స్, క్యాస్టర్ సెమెన్యా వంటి అత్యుత్తమ స్టార్లు పోటీలో ఉన్నప్పటికీ తననే అవార్డు వరించినందుకు గర్వంగా ఉందన్నారు. మిగతా అథ్లెట్లు, క్రీడాకా రుల మాదిరిగానే స్విమ్మర్లకు గుర్తింపు ఇచ్చినందుకు హర్షం వ్యక్తంచేశారు. ఐదుసార్లు ఒలింపిక్ స్వర్ణ విజేత అయిన లెడెక్కీ, 14 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచారు. మహిళా స్విమ్మర్‌గా మరెవరికీ సాధ్యం కానన్ని పతకాలను ఈమె సొంతం చేసుకుంది. రియో ఒలింపిక్స్‌లో 800- 400- 200 మీటర్ల విభాగాల్లో పసిడి పతకాలను నెగ్గింది.

రష్యన్ అథ్లెట్లపై నిషేధం..ప్రత్యేక అంశం:ఐవోసీ

పైయాంగ్‌చాంగ్: యాంటీ డోపింగ్ పరీక్షల్లో రష్యన్ అథ్లెట్ల అంశం ప్రత్యేకమైనదని ఒలిపింక్స్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ద.కొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్‌లో డోపింగ్ నేషిధిత రష్యన్ ఆటగాళ్లలో ఒకరు తొలి పతకాన్ని అందుకున్నారు. పురుషుల 1500 మీటర్ల షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్‌లో కాంస్య పతకం నెగ్గిన సెమెన్ ఇలిస్ట్రటోవ్ 2016లో తాత్కాలికనిషేధానికి గురయ్యాడు. మెల్డోనియం పాజిటివ్ రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సరిగ్గా ఇదే అంశంలో మారియా షరపోవా సైతం నిషేధానికిగురైంది. ప్రస్తుతం రష్యా నుంచి తటస్థ అథ్లెట్లుగా బరిలో ఉన్న 168 మందిలో 27 ఏళ్ల ఇలిస్ట్రటోవ్ ఒకడు. 2016 నిషేధానికి ముందే అతను మెల్డోనియం వాడినట్లు తేలింది. ఒకసారి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత ఇది సుమారు తొమ్మిది మాసాలు ప్రభావం చూపుతుంది. రష్యా స్టార్ షరపోవా ఇదే అంశంపై 15నెలలు నిషేధాన్ని ఎదుర్కొన్నది అని ఒలిపింక్స్ మెడికల్‌టీం డైరెక్టర్ బడ్జెట్ చెప్పారు. డ్రగ్స్ ఉపకారిగా మెలడోనియంను గుర్తించక ముందే దీన్ని వాడినట్లయితే, నిషేధం విధించడం సబబు కాదన్నది తాజా వాదన. అందువల్ల రష్యన్ల డోపింగ్ నిషేధం అంశం ప్రత్యకమైనది అని ఐవోసీ వెల్లడిచింది. ఈస్టర్న్ యూరోపిన్, రష్యా దేశాల్లో మెలడోనియంను టానిక్‌గా పరిగణిస్తారు. హృద్రోగ సమస్యల నివారణకు దీనిని విస్తారంగా వాడతారు. అందువల్ల అప్పట్లో డోపింగ్ పరిధిలో దీనిని చేర్చలేదని బడ్జెట్ చెప్పుకొచ్చారు.

నేటి నుంచి చెన్నై ఓపెన్ చాలెంజర్

చెన్నై: నేటి నుంచి ప్రారంభం కానున్న చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో సిగిల్స్ విభాగంలో 13 మంది భారత షట్లర్లు బరిలోకి దిగుతున్నారు. వీరిలో ముగ్గురు మెయిన్ డ్రాకి అర్హత సాధించారు. తొలిరౌండ్‌లో ఆస్ట్రేలియాకి చెందిన టాప్‌సీడ్ జోర్డాన్ థాంప్సన్, ఈజిప్టు ఆటగాడు కరీం-మహ్మద్ మామూన్‌తో తలపడతాడు. భారత టాప్ సింగిల్స్ ప్లేయర్, రెండోసీడ్ షట్లర్ యుకిభాంబ్రి, స్పానిష్ ఆటగాడు జపాటా మిరల్లెస్‌ను ఢీకొంటాడు. ఇతనితోపాటు అభినవ్. సంజీవ్ షన్ముగం, చెన్నై చిన్నోడు అర్జున్ ఖాడె, సిద్ధార్ధ్ రావత్ మెయిన్ డ్రా ద్వారా ప్రవేశం పొందారు. సెర్బియా ఆటగాడు నికోలా కాసిక్ అనారోగ్యం కారణంగా పోటీ నుంచి వైదలగడంతో సంజీవ్ సన్ముగం మెయిన్ డ్రాకు అర్హత పొందాడు. ఇక అర్జున్ ఖాడె మాత్రం స్విస్ ఆటగాడు లూకా మార్గరోలిని 7-5, 6-2తో ఓడించాడు. తొలిరౌండ్‌లో శ్రీరాం బాలాజీతో థాయిలాండ్ ఆటగాడు విశాయ చైకుల్ తలపడనున్నాడు.

వరుణుడు.. మిల్లర్

ఆ ఇద్దరే ముంచారు

- నాలుగో వన్డేలో సఫారీలు బాగా ఆడారు
- విజయానికి వాళ్లు నూరుశాతం అర్హులే
- పొరపాట్లు సరిదిద్దుకుంటాం..

సిరీస్ గెలుస్తాం : కోహ్లి



జోహన్నెస్‌బర్గ్: వరుస విజయాలతో వన్డే సిరీస్‌ను ఘనంగా కొనసాగిస్తున్న టీమిండియా జోరుకు శని వారం కళ్లెం పడింది. నాలుగో వన్డేలోనూ విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకోవాలన్న విరాట్ సేన కలలు నెరవేరలేదు. ఒకవైపు వరుణుడు.. మరొకవైపు మిల్లర్ భారత్ విజయా వకాశాలను గండికొట్టారు. సిరీస్ కోల్పోయే ప్రమాదంలో ఉన్న సఫారీలు తొలి విజయాన్ని నమోదు చేశారు. పింక్ వన్డేలో వారి కి అదృష్టం కూడా కలిసివచ్చిందనే చెప్పాలి. తొలుత మ్యాచ్‌పై వర్షం ప్రభావం పడగా, ఆపై భారత జట్టు తమకు వచ్చిన అవకాశాల్ని చేజార్చుకోంది. ప్రధానంగా డేవిడ్ మిల్లర్ ఒకే ఓవర్‌లో రెండు సార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పిం చుకోవడం భారత జట్టు విజయంపై ప్రభావం చూపింది. దీనితో భారత కెప్టెన్ కోహ్లి కూడా ఏకీభవించాడు. ఒక దశలో 200/2 పరుగులతో పటిష్ట స్థితిలో ఉన్నప్పటికీ, వర్షం అంతరాయం కారణంగా మూడొందల స్కోరును దాటలేక పోయామని పేర్కొన్నాడు.

అవకాశాలు చేజారాయి..

'మాకు వచ్చిన అవకాశాల్ని చేజార్చుకున్నాం. ఏబీ అవుటైన తర్వాత విజయం ఖాయమని అనుకున్నాం. మిల్లర్-క్లాసెన్‌లు మా ఆశలపై నీళ్లు చల్లారు. గెలుపును మాకు దూరం చేశారు. యజ్వేంద్ర చాహల్ బౌలింగ్ మిల్లర్ ఇచ్చిన డీప్ స్క్వేర్ లెగ్‌లో శ్రేయస్ అయ్యర్ వదిలేయగా, అదే ఓవర్‌లో మిల్లర్ బౌల్డ్ అయినప్పటికీ ఆ బంతి నోబాల్ అయ్యింది. దాంతో మాకు విజయావకాశాలు సన్నగిల్లాయి. మరొకవైపు వర్షం కూడా మా విజయాన్ని దూరం చేసిందనే చెప్పాలి. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కసారిగా టీ20 తరహాలో మారిపోయింది. ఇవన్నీ ఫలితం మాకు ప్రతికూలంగా మారడానికి కారణం. తదుపరి వన్డేల్లో ఎటువంటి పొరపాట్లు చేయ కుండా విజయాన్ని సొంతం చేసుకుంటామనే ఆశిస్తున్నా' అని కోహ్లి పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 289 పరుగులు చేసింది. అయితే పదే పదే వర్షం కురవడం వల్ల, డక్‌వర్త్‌లూయిస్ విధానం మేరకు మ్యాచ్‌ను 28ఓవర్లకు కుదించారు. సఫారీల లక్ష్యాన్ని 202 పరుగులుగా నిర్దేశించారు. ఈ నిర్ణయం వారికి కలిసొచ్చంది. చేతిలో వికెట్లు ఉండటంతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ టీ 20 తరహాలో చెలరేగి ఆడారు. మరోవైపు సిరీస్‌లో మ్యాచ్‌వి న్నర్లుగా నిలిచిన స్పిన్నర్లు ఇక్కడ చేతులెత్తేశారు. ధారాళంగా పరుగులు సమర్పించు కున్నారు. దీంతో ద.ఆఫ్రికా జట్టు మరో 15 బంతులు ఉండగానే లక్ష్యాన్ని చేదించింది.

100

0-100 ధావన్ రికార్డు

భారత ఓపెనర్ శిఖర్ ధావన్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. తన కెరీర్‌లో వందో వన్డే మ్యాచ్ ఆడిన ధావన్ సెంచరీ సాధించి సరికొత్త మైలురాయిని చేరాడు. వందో వన్డేలో సెంచరీ సాధించిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డు సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్ నాలుగో మ్యాచ్‌లో 99 బంతుల్లో సెంచరీ చేయడం ద్వారా క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. వందో వన్డేలో మూడంకెల వ్యక్తిగత స్కోరును నమోదు చేసిన అంతర్జాతీయ క్రికెటర్లలో ధావన్ తొమ్మిదవ బ్యాట్స్‌మన్. శిఖర్ కంటే ముందు గ్రీనిడ్జ్, కెయిన్స్, మొహ్మద్ యూసఫ్, క్రిస్‌గేల్, సంగక్కరా, ట్రెస్కోథిక్, శర్వాన్, వార్నర్‌లు వందో వన్డేలో శతకం సాధించారు. అయితే ఇక్కడ ధావన్ అరంగేట్రం వన్డే మ్యాచ్‌లో డకౌట్‌గా పెవిలియన్ చేరి, వందో మ్యాచ్‌లో శతకం బాదడం విశేషం. ఇలా వన్డే క్రికెట్ చరిత్రలో అరంగేట్రం మ్యాచ్‌లో సున్నా పరుగులకే అవుటై, వందో మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన ఏకైక క్రికెటర్‌గా ధావన్ గుర్తింపు సాధించాడు. 2010 ఆస్ట్రేలియాతో విశాఖపట్టణంలో జరిగిన వన్డే మ్యాచ్ ద్వారా ఈ ఫార్మాట్‌లో తొలి మ్యాచ్ ఆడిన ధావన్ పరుగులేమీ చేయకుండా నిష్క్రమించాడు. ఆ మ్యాచ్‌లో రెండు బంతులు ఆడిన ధావన్.. మెక్‌కే బౌలింగ్‌లో అవుటై నిరాశపరిచాడు.

టాప్ 5లో విరాట్



కోహ్లి ఖాతాలో మరో రికార్డు చేరింది. నాలుగో వన్డేలో 75 పరుగులు చేసిన టీమిండియా పరుగుల యంత్రం కోహ్లి కెరీర్‌లో మరో మైలురాయిని అధిగ మించాడు. వన్డే ఫార్మాట్‌లో అత్యధికపరుగులు సాధించిన ఆటగాళ్లలో తన పేరును లిఖించుకున్నాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ (9,378), విండీస్ దిగ్గజ ఆటగాడు క్రిస్ గేల్ (9,420)లను అధిగమించాడు. వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లలో ఓవరాల్‌గా కోహ్లి 16వ స్థానంలో నిలవగా భారత్ తరపున ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటికి 206 వన్డేలు ఆడిన కోహ్లి 9,423 పరుగులు చేశాడు. బ్యాటింగ్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ 18,426 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మొత్తం 463 మ్యాచ్‌లు ఆడిన సచిన్ 49 సెంచరీలతో 18,426 పరుగులు సాధించాడు. తర్వాతి స్థానాల్లో సౌరవ్ గంగూలీ (11,363), రాహుల్ ద్రవిడ్ (10,889), ఎంఎస్ ధోనీ (9,954) ఉన్నారు. ఇప్పుడు కోహ్లి తర్వాతి స్థానాన్ని ఆక్రమించాడు.

దక్షిణాఫ్రికా జట్టుకు జరిమానా

మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా సఫారీ జట్టుకు జరిమానా పడింది. ఈమేరకు ఐసీసీ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ నిర్ణయం తీసుకున్నారు. నిర్ణీత సమయానికి ఒక ఓవర్ తక్కువగా వేసినట్లు చెప్పారు. ఐసీసీ ఆటగాళ్ల నిబంధనావళి 2.5.1 ప్రకారం ఆజట్టు కెప్టెన్ మర్క్రం మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించగా, ఆటగాళ్లకు 10 శాతం చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. ఒకవేళ వచ్చే 12 నెలల్లో మర్‌క్రామ్ జట్టుకు సారథిగా వ్యవహరించి, అదే సమయంలో మరొకసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమైతే అతనిపై ఒక మ్యాచ్ నిషేధం పడే ప్రమాదం ఉంది. ఈ నిర్ణయంతో ఇబ్బందికి గురైనప్పటికీ, ఐసీసీ చర్యలను అంగీకరిస్తున్నట్లు మ్యాచ్ అనంతరం మర్క్రం చెప్పాడు.

17 ఏళ్ల తర్వాత..

నాలుగో వన్డేలో టీమిండియా ఓటమి పాలైనప్పటికీ, ఓపెనర్ శిఖర్ ధావన్ చరిత్ర సృష్టించాడు. వందో మ్యాచ్‌లో సెంచరీ చేయడంతో పాటు పలు ఘనతల్ని ధావన్ సొంతం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాపై 14 ఇన్నింగ్స్‌లు ఆడిన ధావన్‌కు ఆ జట్టుపై మూడో సెంచరీ. ఈ క్రమంలో 17 ఏళ్ల తర్వాత దక్షిణాఫ్రికాలో వారిపై సెంచరీ చేసిన తొలి భారత ఓపెనర్‌గా నిలిచాడు. 2001లో సఫారీ గడ్డపై గంగూలీ, సచిన్‌టెండూల్కర్‌లు ఒకే మ్యాచ్‌లు సెంచరీలు సాధించారు. ఆ తర్వాత ఈ మైలురాయిని మరెవరూ చేరుకోలేదు. తాజాగా ధావన్ ఆలోటును పూరించాడు.

స్పిన్నర్ల వ్యూహం ఆశ్చర్యానికి గురిచేసింది



డెత్ ఓవర్ల స్పెషలిస్టు పేసర్లు భువనేశ్వర్, బూమ్రాలకు సాధ్యమైనన్ని ఎక్కువ ఓవర్లు ఇవ్వకపోవడంపై దక్షిణాఫ్రికా ఆటగాడు క్లాసెన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. తమ జట్టు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో స్లాగ్ ఓవర్లలో బూమ్రా, భువీలకు భారత కెప్టెన్ కోహ్లి బౌలింగ్ ఎందుకు ఇవ్వలేదో తనకు అర్థం కాలేదన్నాడు. వీరిని పక్కకు పెట్టి స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ యాదవ్‌లు చేత డెత్ ఓవర్లు వేయించడంతో ఆశ్చర్యపోయానన్నాడు. 'కోహ్లి నిర్ణయం నన్నెంతగానో ఆశ్చర్యానికి గురిచేసింది. భువనేశ్వర్, బుమ్రా వంటి డెత్ ఓవర్ల స్పెషలిస్టులు ఉండగా, స్పిన్నర్లకు బంతి ఎందుకిచ్చాడో ఇప్పటికీ అంతుబట్టడం లేదు. పేసర్లతో చివర్లో కనీసం రెండేసి ఓవర్లైనా బౌలింగ్ చేయిస్తారని భావించాం. కానీ అందుకు భిన్నంగా విరాట్ స్పిన్నర్లపైనే నమ్మకం పెట్టుకున్నాడు. సిరీస్‌లో ఇప్పటి వరకూ స్పిన్నర్లని ఎదుర్కొనేందుకు కష్టపడ్డాం. కానీ, గత మూడు రోజుల నుంచి కుల్దీప్ బౌలింగ్‌పై బాగా అధ్యయనం చేశాం. చైనామన్ బౌలర్‌ను తిప్పికొట్టడానికి ఎక్కువ ప్రాక్టీస్ చేశాం' అని క్లాసెన్ పేర్కొన్నాడు. డీకాక్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన క్లాసెన్ 27 బంతుల్లో 47 పరుగులు చేసి సఫారీల విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ధోనీ ముందు రెండు రికార్డులు



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని మరో రెండు అరుదైన ఘనతలకు స్వల్ప దూరంలో నిలిచాడు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన నాల్గో వన్డేలో 42 పరుగులతో అజేయంగా నిలిచిన ధోని.. వన్డే కెరీర్‌లో పదివేల పరుగులు చేయడానికి ఇంకా 46 పరుగుల దూరంలో ఉన్నాడు. ప్రస్తుతం ధోని 9,954 వన్డే పరుగులతో భారత తరపున అత్యధిక పరుగులు చేసిన వారిలో నాల్గో స్థానంలో ఉన్నాడు. ఒక హాఫ్ సెంచరీ చేస్తే పదివేల వన్డే పరుగుల మార్కును దాటేసి ధోని.. వన్డేల్లో ఇప్పటివరకూ 295 క్యాచ్‌లు అందుకున్నాడు. మరో ఐదు క్యాచ్‌లు పడితే మూడొందల మార్కును చేరుకుం టాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ధోనిని ఈ రెండు ఘనతలు ఊరిస్తు న్నాయి. సఫారీలతో ఇంకా రెండు వన్డేలు మిగిలి ఉండటంతో ఈ రెండు రికార్డులను ధోని సాధించే అవకాశం ఉంది. బ్యాట్స్‌మన్‌గా 316 వన్డే మ్యాచ్‌లకుగాను 271 ఇన్నింగ్స్‌లు ఆడిన ధోని అత్యధిక వ్యక్తిగత స్కోరు 183 నాటౌట్. మరొకవైపు వన్డేల్లో కీపర్‌గా 311 ఇన్నింగ్స్‌ల్లో 401 అవుట్‌లలో భాగస్వామ్యమయ్యాడు. ఇందులో 106 స్టంపింగ్స్ ఉన్నాయి. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలో 400 మందిని అవుట్ చేయడంలో భాగమైన ధోని ఆ ఘనత సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఓవరాల్‌గా ఈ మార్కును చేరిన నాలుగో వికెట్ కీపర్ ధోని. అతనికి ముందు సంగక్కర (482), గిల్‌క్రిస్ట్ (472), బౌచర్ (424) ముందున్నారు.

ఖేలో ఇండియాలో మెరిసిన మట్టిలోని మాణిక్యాలు



ఊర్మిళ

న్యూఢిల్లీ: ఒకరు ఆటోరిక్షా డ్రైవర్ కుమారుడు.. మరొకరు రైతు బిడ్డ.. ఇంకొకరు కూరగాయలు అమ్ముకుని జీవించే సాధారణ కుటుంబానికి చెందిన వారు.. వీళ్లంతా ఖేలోఇండియా స్కూల్ గేమ్స్‌లో అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. పేదరికపు అడ్డుగోడలను దాటుకుని క్రీడాకారులుగా ఎదిగేందుకు పరితపిస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ఖేలో ఇండియా కార్యక్రమంతో ఇలాంటి మట్టిలోని మాణిక్యాలు వెలుగులోకి వస్తున్నారు. కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ క్రీడాపోటీల్లో మొత్తం 3507 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో చాలామంది క్రీడాభారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఖాయమని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు.

ఇలాంటి మట్టిలోని మాణిక్యాల్లో భక్తారాం డెస్టిస్ ఒకడు. ఈ కుర్రాడు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందినవాడు. పేద రైతు కుంటుంబం నుంచి వచ్చాడు. ట్రైబల్ సామాజిక వర్గానికి చెందిన ఈ బుడతడి ప్రదర్శన క్రీడాప్రముఖులను ఆకట్టుకుంది. ఇలాంటి వారికి అవకాశాలు పరిమిత స్థాయిల్లోనే ఉండటం మూలంగా జాతీయ స్థాయికి చేరుకోలేక పోతున్నారు. ఒకవైపు చదువు.. ఇంకొకవైపు క్రీడాశిక్షణ కొనసాగించడం భారంగా మారుతుంటుంది అని డెస్టిస్ కోచ్ సీతాజెనా అభిప్రాయ పడ్డారు. ఖేలో ఇండియా గేమ్స్‌లో ఇతడు వెయిట్‌లిఫ్టింగ్‌లో పసిడిపతకం సాధించాడు.



అర్షద్

అదేవిధంగా, మణిపూర్‌కి చెందిన నంగోబమ్ ఖొంబాసింగ్‌దీ ఇలాంటి గాథే. వాల్‌పెయింటర్ కుమారుడైన సింగ్ మారుమూల ప్రాంతం నుంచి వచ్చాడు. ముగ్గురు సంతానంలో సింగ్ పెద్దవాడు. 60 కేజీల బాక్సింగ్ విభాగంలో ఇతను రజత పతకం సాధించాడు. 'మా నాన్న సాధారణ పెయింటర్. ఆయనకు ఆటలంటే తెలీదు. కానీ నన్ను ఇటువైపు ఎంతో ప్రోత్సహించాడు. ఈరోజు నేను పతకం సాధించానంటే, అందుకు మానాన్న, కోచ్‌లే కారణం' అని సింగ్ చెప్పాడు.

ఇక జావెలింగ్ త్రో విభాగంలో పతకాలు సాధించిన వికాస్ యాదవ్, అర్పిత్ యాదవ్, బాక్సింగ్ హీరో అర్షద్ కూడా సామాన్య కుటుంబానికి చెందినవారే. రైతు కుటుంబానికి చెందిన అర్పిత్‌కు ఆరుగురు తోబుట్టువులు ఉన్నారు. అలాగే 44 కేజీల మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం గెలిచిన ఊర్మిళ తొమ్మిదో తరగతి విద్యార్థిని. చదువు కోవడమే భారంగా మారిన పరిస్థితుల్లో, క్రీడా శిక్షణ ఆలోచనకు కూడా అందనిది. అలాంటి పరిస్థితుల్లోనూ ఆమె ఈ స్థాయి ప్రదర్శన కనబరిచింది. ఇలాంటి వారెందరో సరైన ప్రోత్సాహం లేక కిందిస్థాయిలోనే క్రీడా జీవితానికి ముగింపు పలికుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి వారికి చివరిదాకా మంచి ప్రోత్సాహం అందించి, తీర్చిదిద్దాలని కోరుకుందాం.

2019 ప్రపంచకప్‌లో భారత్‌ను ఓడించడం కష్టమే

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియా బలమైన జట్టుగా ఉందని, 2019 ప్రపంచకప్‌లో ఈ జట్టును ఓడించడం మిగతా వాళ్లకు సవాలేనని ద.ఆఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లర్ వెస్సెల్స్ అభిప్రాయపడ్డాడు. వన్డే సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లో ఘన విజయం సాధించిన కోహ్లి సేన, ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. ప్రస్తుత భారత జట్టు ప్రపంచకప్‌లో బలమైన శక్తిగా నిలుస్తుంది. వీళ్లను ఓడించడం అంత సులువేం కాదు. అయితే, ప్రపంచకప్ ఫేవరెట్‌గా నేను పేర్కొ నలేను. కానీ, గట్టి పోటీదారుగా ఉంటుంది. కీలక ఆటగాళ్లు గాయాలకు గురికా కుండా ఉంటే, ఈ జట్టును ఓడించడం ఎవరికైనా సవాలే. భారత నాణ్యమైన స్పిన్నర్లకు మా జట్టు దాసోహమైంది. విలక్షణ స్పిన్‌ను ఎదుర్కోలేక చతికిల పడింది. ఇద్దరు స్పిన్నర్లతో కోహ్లిసేన పూర్తిభి న్నంగా ఉంది. మొత్తం మీద ఈ జట్టు సమ తూకంగా పటిష్టంగా ఉంది. ప్రారంభ ఓవర్లలో వికెట్లు తీయగల పేస్ దళపతులు భువీ, బుమ్రా అదనపు బలంగా పేర్కొన్నాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.